www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సంపుటి: 14 సంచిక: 225

జిల్లా సమితులకు

సారథులు వీరే

30 మంది సమన్వయకర్తల నియామకం

జాబితాలో రెడ్డి సామాజిక వర్గానికి పెద్దపీట

12 మంది రెడ్లు; 9 మంది బీసీలు, ఓ ముస్లిం

జగిత్యాలకు వెలమ, ఖమ్మానికి కమ్మ సమన్వయకర్త

అంగన్వాడీ టీచర్, ఉద్యమ నాయకులకు చాన్స్

అధికార పార్టీ నాయకుల అనుచరులకు అందలాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఒకరు అంగన్వాడీ టీచర్! మరికొందరు ఉద్యమ నాయకులు! అత్యధికులు అధికార పార్టీ నాయకుల ప్రధాన అనుచరులు! రైతు సమన్వయ సమితి జిల్లా నేతలుగా నాయకుల అనుచరులకే పదవులు దక్కాయి. జిల్లా రైతు సమన్వయ సమితుల ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. రాష్ట్రంలోని 30 జిల్లాలకు సమన్వయకర్తలను ఎంపిక చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారిలో 12 మంది రెడ్డి సామాజిక

మిగతా 11వ పేజీలో...

ఆధార్ ఇవ్వకుంటే బినామీలే

భూ యజమానులకు సీఎం కేసీఆర్ హెచ్చరిక

- పాస్‌బుక్కుతో లంకె పెట్టాల్సిందేనని స్పష్టీకరణ
- ఆధార్ నంబర్ ఇచ్చేందుకు వీవీఐపీల వెనకడుగు
- వారిలో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్‌లూ
- శివారు, జిల్లాల్లో భారీగా భూముల కొనుగోలు
- పాస్ పుస్తకాలు తీసుకునేందుకు నిరాకరణ
- పెట్టుబడి సాయం వదులుకునేందుకూ సిద్ధం
- బినామీ చిట్టా బయటపడుతుందనే భయం

8

అసైన్డ్ ఆక్రమణలకు

చట్టబద్ధత

కబ్జాలో ఉంటే అర్హులకు రీ అసైన్ చేయండి

అసైన్‌దారులకు కూడా పట్టా పుస్తకాలివ్వండి: సీఎం



కేజ్రీవాల్ నివాసంలో స్వాధీనం చేసుకున్న ఆధారాలతో పోలీసులు

కేజ్రీవాల్ ఇంట్లో

సోదాలు!

21 కెమెరాల సీసీ ఫుటేజీ సేకరణ

తనిఖీల్లో 60 మంది పోలీసులు

కేజ్రీవాల్‌నూ ప్రశ్నిస్తామని ప్రకటన

భగ్గుమన్న ఢిల్లీ ముఖ్యమంత్రి

లోయా మృతిపై అమిత్‌షాను ప్రశ్నించరేం అంటూ నిలదీత

సీఎస్‌పై దాడి నిజమే.. కేజ్రీ సలహాదారు స్పష్టీకరణ

అడ్డొచ్చిన వారందరికీ ఇదే శిక్ష.. ఆప్ ఎమ్మెల్యే ప్రకటన

చీఫ్ సెక్రెటరీపై దాడి కుట్రే: కోర్టు.. ఎమ్మెల్యేల బెయిలుకు నో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఆప్ ఎమ్మెల్యేల దాడికి సంబంధించి శుక్రవారం పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఢిల్లీ ఐఏఎస్ అధికారుల సంఘం ప్రతినిధులు ఉదయమే ప్రధాని కార్యాలయ వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్‌ను కలిశారు. వెనువెంటనే 60 మంది పోలీసులతో కూడిన బృందం రంగంలోకి దిగి, ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికార నివాసంలో రెండు గంటలపాటు సోదాలు జరిపింది. 21 సీసీ కెమెరాలను

మిగతా 14వ పేజీలో...

భగీరథ ప్రయత్నం

కాళేశ్వర

విజయం

సుప్రీంకోర్టులోనూ సానుకూల నిర్ణయం

విచారణకు తీసుకోకుండానే కేసు కొట్టివేత

- చెన్నై, పుణెల్లో ఉన్న ఎన్జీటీలను కాదని ఢిల్లీకే ఎందుకు వచ్చారు?
- ఇది మీ అనుకూల జడ్జిని వెతుక్కుంటూ రావడం కాదా?
- 6 నెలల్లోనే పిటిషన్ వేయాలిగా!
- 9 ఏళ్ల తర్వాత ఎందుకొచ్చారు?
- పిటిషనర్‌ను తప్పుబట్టిన బెంచ్
- తీవ్ర వ్యాఖ్యలతో వ్యాజ్యం తిరస్కరణ
- వాదనలు ప్రత్యక్షంగా వినేందుకు కోర్టుకొచ్చిన మంత్రి హరీశ్‌రావు
- ఇది తెలంగాణ రైతాంగం విజయం
- కుటిల కాంగ్రెస్‌కి చెంపపెట్టు: మంత్రి



కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుకూలంగా తీర్పు వెలువడిన తర్వాత ఢిల్లీలో సుప్రీంకోర్టు నుంచి ఉత్సాహంగా బయటకు వస్తున్న హరీశ్ రావు

న్యూఢిల్లీ/ హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఇప్పటికే అనుమతులు సాధించిన సర్కారుకు సుప్రీం కోర్టులోనూ సానుకూల నిర్ణయం వెలువడింది. కాళేశ్వరం పనులను నిలిపివేయాలంటూ హరిత ధర్మాసనం ఉత్తర్వులపై హైకోర్టు స్టేను సవాల్ చేస్తూ దాఖలయిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించకుండానే కొట్టివేసింది. దీనిని ప్రాజెక్టు చరిత్రలో అత్యంత కీలక మైలురాయిగా భావించవచ్చు. కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ తీరుపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషన్ వేసిన తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణపై హైకోర్టులో, అటవీ, పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు

మిగతా 11వ పేజీలో...

రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

57 మంది సభ్యుల పదవీ విరమణ.. మార్చి 23న రాజ్యసభ పోలింగ్!

11

జాక్‌పాట్ ఎవరికి?

రాష్ట్రంలో 3 రాజ్యసభ సీట్లకు ఎన్నిక.. మూడూ టీఆర్ఎస్ ఖాతాలోకే

సంతోష్ కోసం సీఎంపై నేతల ఒత్తిడి.. రెండింట్లో ఒకటి యాదవులకు

ఇప్పటికే ప్రకటించిన సీఎం కేసీఆర్.. మూడో స్థానంపైనే తర్జన భర్జన



సంతోష్

11

లక్ష రుణమాఫీ

నేతన్నలకు వరం.. అమలు మార్గదర్శకాలను జారీ చేసిన సర్కారు

2014 నుంచి 2017 మార్చి 31దాకా తీసుకున్న రుణాలకు వర్తింపు

ఎంత రుణం ఉన్నా లక్షదాకా మాఫ్.. ఇప్పటికే చెల్లిస్తే ఖాతాలో డబ్బు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత కార్మికులకు తీపి కబురు! నేతన్నలకు రూ.లక్ష వరకు రుణాన్ని రాష్ట్ర సర్కారు మాఫీ చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ శుక్రవారం చేనేత కార్మికుల రుణమాఫీ అమలు కోసం మార్గదర్శకాలను జారీ చేశారు. 2014 జనవరి 1 నుంచి 2017 మార్చి 31వ తేదీ వరకు తీసుకున్న బ్యాంకు రుణాలకు ఈ నిర్ణయం వర్తించనుంది. దీని ప్రకారం అసలు, వడ్డీ కలిపి రూ.లక్ష వరకు చేనేత కార్మికుల రుణాలను బ్యాంకులు మాఫీ చేయనున్నాయి. రూ.లక్ష కంటే ఎక్కువ రుణం ఉన్న కార్మికులు ప్రభుత్వం చేసే

మిగతా 11వ పేజీలో...

సింగరేణి కార్మికులకు

వడ్డీ లేని రుణం

5

10 లక్షల రుణంతో సొంతింటి కల

ఏడాదికి వడ్డీ భారం 130 కోట్లు

సర్కారీ హెల్త్‌కార్డుదార్లకు

ఉచితంగా డయాలసిస్

2

27న గజ్వేల్ కేంద్రానికి సీఎం ప్రారంభం

రాష్ట్రంలో మరో 3 డయాలసిస్ కేంద్రాలు

30 ఏళ్లు దాటిన మహిళలకు

కేన్సర్ పరీక్ష తప్పనిసరి

వ్యాధి తీవ్రత దృష్ట్యా కేంద్రం నిర్ణయం

2

తెలంగాణ తరహాలో దేశమంతా అమలు

కేన్సర్ సెంటర్ల ప్రతినిధులతో సమావేశం

ప్రభుత్వ పెన్షనర్లకు ఊరట

రాష్ట్రంలోనూ 'జీవన్ ప్రమాణ్' విధానం

8

వెరిఫికేషన్ సర్టిఫికెట్ మీసేవలో ఇస్తే చాలు

పెన్షన్ అధికారిని కలవాల్సిన పనిలేదు

పాక్‌కు ఎదురుదెబ్బ


ఉగ్రవాదులకు సాయంపై కన్నెర్ర

14

గ్రే లిస్ట్‌లో చేర్చేందుకు 36 దేశాల మద్దతు

2 నుంచి థియేటర్లు బంద్

14



మనో నిగ్రహానికి అదే ఆయుధం

Paramjyothi
పరంజ్యోతి



'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో' అని శాస్త్ర వచనం. మానవ జీవన గమనాన్ని విశేషంగా ప్రభావితం చేయగల్గిందీ.. దాని దిశ, దశలను నిర్దేశించేదీ మనసే. మనను సంసార సాగరంలో ముంచి తేలుస్తూ, లౌకిక బంధనాలను దృఢతరం చేస్తూ, పారలౌకిక విషయాలపట్ల ఆసక్తి పెరగకుండా చూస్తూ మానవ జీవిత లక్ష్యాన్ని దూరం చేసేది మనసే. దైవం పట్ల భక్తి విశ్వాసాలను పెంచి, మోక్షాపేక్ష కలిగించి, ఆధ్యాత్మిక సాధనకు సహకరించగలిగేదీ మనసే. విషయాసక్తిని పెంచి పోషించేదీ మనసే. ఆధ్యాత్మిక సాధన వైపు అడుగులు పడేలా చేసేది మనసే. అదే తాళం లాంటిది. అదే తాళంచెవిలాంటిది కూడా. ఒకవైపునకు తిప్పితే తాళం పడుతుంది. మరొకవైపునకు తిప్పితే తెరుచుకుంటుంది. చపలత్వంలో మనసు పిచ్చి కోతి వంటిది. బలంలో మదపుటేనుగు వంటిది. మనసును నిగ్రహించడం గాలిని నిగ్రహించడమంత కష్టం. అయితే, గీతాచార్యుడైన శ్రీకృష్ణపరమాత్మ అర్జునుడిని ఉద్దేశించి.. 'అర్జునా! మనసును నిగ్రహించడం నిస్సందేహంగా మిగుల కష్టమే. కానీ అసాధ్యంకాదు. అభ్యాస, వైరాగ్యముల చేత మనోనిగ్రహమును సాధించవచ్చును' అని చెప్పాడు. ఇక్కడ అభ్యాసమంటే.. జ్ఞాన సంబంధమైన, దైవసంబంధమైన విషయాలను పునఃపునః మనసులో తర్కించుకోవడం. నిజానికి మనసుకు ఒక రూపమే లేదు. సముద్రపు టలలుగా అనుక్షణం వచ్చిపోయే ఆలోచనల సమాహారం అది. ఆలోచనల ఉధృతిని ఆపలేకపోతే, వాటి దిశను మార్చుకొనే ప్రయత్నం చేయవచ్చు. అపుడు మనసుకు కొంత ఉపశమనం కల్గుతుంది. మనో నిగ్రహానికి భగవన్నామ స్మరణ శక్తిమంతమైన ఆయుధం. దైవ స్మరణ వల్ల మనసును నిగ్రహించుకుని ఆందోళనరహితంగా, ప్రశాంతంగా, ప్రజోపయోగకరంగా జీవించగలుగుతాం.

-మాదిరాజు రామచంద్రరావు

ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత డయాలసిస్

- సొంతూరికి దగ్గర్లోనే చేయించుకొనే అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వం అంతర్గత ఉత్తర్వులు జారీ
- కొత్తగా మరో 3 డయాలసిస్ కేంద్రాలు
- గజ్వేల్‌లో 27న ప్రారంభించనున్న సీఎం
- ఉన్న కేంద్రాల్లో యంత్రాలను పెంచనున్న సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని డయాలసిస్ కేంద్రాలలో ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టు హెల్త్ కార్డులున్న వారికి ఉచితంగా డయాలసిస్ చేయించుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు శుక్రవారం అంతర్గత ఉత్తర్వులను జారీ చేసింది. తొలుత గద్వాల్, సిద్దిపేట, వనస్థలిపురం, కామారెడ్డి, సంగారెడ్డి డయాలసిస్ కేంద్రాలలో ఈ సేవలు లభిస్తాయి. తరువాత మిగిలిన అన్ని కేంద్రాలలో విస్తరిస్తారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రాలలో కేవలం ఆరోగ్యశ్రీ పథకం కిందనే సేవలను అందిస్తున్నారు. ఇక నుంచి ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు కూడా ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ కింద ఉచిత డయాలసిస్ సేవలు పొందవచ్చని ఈహెచ్‌ఎస్ సీఈవో కల్వకుంట్ల పద్మ తెలిపారు. ఇప్పటిదాకా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ కింద అందిన డయాలసిస్ సేవలు ఇక నుంచి రాష్ట్రంలోని అన్ని డయాలసిస్ కేంద్రాల్లోనూ దశలవారీగా అమలు చేస్తామని ఆమె తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల కుటుంబాల్లో డయాలసిస్ అవసరమైన వారు కార్పొరేట్ ఆసుపత్రుల కోసం జిల్లాల నుంచి దూర ప్రయాణం చేయాల్సిన బాధ తప్పుతుంది.


మరో మూడు డయాలసిస్ కేంద్రాలు

రాష్ట్రంలో కొత్తగా మరో మూడు డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కొత్త కేంద్రాలను గజ్వేల్, నారాయణ ఖేడ్, పాతబస్తీలోని బర్కాస్‌లో ఏర్పాటు చేస్తారు. 27న సీఎం కేసీఆర్ గజ్వేల్ డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 34 డయాలసిస్ కేంద్రాలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అంతకుముందు నుంచే ఏడు కేంద్రాలు డయాలసిస్ సేవలను అందిస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేయబోయే కేంద్రాలతో కలుపుకోని మొత్తం 44 అవుతాయి. డయాలసిస్ కేంద్రాలకు పెద్ద ఎత్తున కిడ్నీ రోగులు వస్తున్నారు. సిద్దిపేట కేంద్రంలో నిత్యం వంద మంది కిడ్నీ రోగులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ కేవలం 5 మిషన్లే ఉన్నాయి. 24 గంటలు సేవలందిస్తున్నా ఇంకా రోగులు మిగిలిపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో యంత్రాల సంఖ్యనూ పెంచాలని సర్కారు నిర్ణయించింది. సోమవారం ప్రకటన వెలువడే అవకాశం ఉంది. సిద్దిపేట, సిరిసిల్ల, గద్వాల కేంద్రాలలో అదనపు యంత్రాలు అవసరం అవుతాయని గుర్తించారు. ఏప్రిల్ 1 నాటికి ప్రకటించిన అన్ని డయాలసిస్ కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. రోజుకు 3250 మందికి డయాలసిస్ అందిస్తారు.

అభ్యర్థుల సహనానికి 'పరీక్ష'!

ఆందోళనలు, ఆవేదనల నడుమ నేటి నుంచి టీఆర్టీ.. ఏర్పాట్లు పూర్తిచేసిన టీఎస్‌పీఎస్సీ

- ఆప్షన్ ఇవ్వకున్నా హైదరాబాద్‌లో కేంద్రాలు
- హైదరాబాద్ వారికి కరీంనగర్‌లో కేంద్రం
- ఒకే జిల్లా వారికి ఒకే కేంద్రంలో పరీక్ష
- హాల్‌టికెట్ల కోసం అభ్యర్థుల ధర్నా
- ఉదయం పరీక్షకు 17972 మంది
- మధ్యాహ్నం పరీక్షకు 17050 మంది
- బంగారు నగలు, మైదాకుతో రావొద్దు: టీఎస్‌పీఎస్సీ



హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ).. ఇప్పుడు అభ్యర్థుల సహనానికి పరీక్షగా తయారైంది. అధికారుల తీరుతో వారు చుక్కలు చూడాల్సి వస్తోంది. ఇప్పటికే ఆఫ్‌లైన్‌లో పరీక్ష రాసే ఆదిలాబాద్, మెదక్ జిల్లాల అభ్యర్థులకు ఆప్షన్ ఇవ్వకపోయినప్పటికీ హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రాలను కేటాయించిన అధికారులు.. తాజాగా హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులకు కరీంనగర్ జిల్లాలో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. ఈ పొరపాట్లు ఒక ఎత్తయితే ఏకంగా ఒకే జిల్లాకు చెందిన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఒకే కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒకేసారి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఒకే కేంద్రంలో, ఒకే సమయంలో దరఖాస్తు చేసుకున్నవారికి పక్కపక్క నంబర్లు వచ్చాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జంబ్లింగ్ విధానాన్ని పాటించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక, తాము తెలుగు మీడియంలో పరీక్షకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాయాలంటూ హాల్‌టికెట్లు జారీ చేశారని ఇంకొందరు అంటున్నారు. పరీక్షకు ఒకటిరెండురోజుల ముందు హాల్‌టికెట్లు జారీచేసి.. అదీ ఇంగ్లిష్ మీడియంలో రాయాలని చెప్పటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించినప్పటికీ.. హాల్‌టికెట్లు ఇవ్వటంలేదంటూ శుక్రవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట కొందరు అభ్యర్థులు ధర్నాకు దిగారు. మరోవైపు ఎస్టీ అభ్యర్థులకు 45శాతం మార్కులు ఉండాలనే నిబంధన చూపుతూ హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తమవుతోంది. ఇలాంటి ఆందోళనలు, ఆవేదనలు కొనసాగుతుండగానే.. శనివారం నుంచి టీఆర్టీ నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్చి 4వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

ఉదయం.. మధ్యాహ్నం పరీక్షలు

అభ్యర్థుల ఆవేదనలు, ఆందోళనల నడుమ టీఆర్టీ రాతపరీక్షలు శనివారం నుంచి మొదలుకానున్నాయి. తొలిరోజు(శనివారం) ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు లాంగ్వేజ్ పండిట్ తెలుగు సబ్జెక్టుకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ తెలుగు సబ్జెక్టుకు సీబీఆర్టీ(ఆన్‌లైన్) విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9.15 గంటలలోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. మధ్యాహ్నం పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 1.45గంటల లోపు పరీక్షా కేంద్రంలో ఉండాలి. నిర్ణీత గడువు తర్వాత వచ్చిన వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఉదయం జరిగే పరీక్షకు 17972 మంది అభ్యర్థులు హాజరుకానుండగా.. వీరికోసం హెచ్‌ఎండీఏ పరిధిలో 34, కరీంనగర్‌లో 4, వరంగల్‌లో 7, ఖమ్మంలో 4, నల్లగొండలో 2, మెదక్‌లో ఒకటి చొప్పున పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జరిగే పరీక్షకు 17050 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. పరీక్షా కేంద్రాలకు విలువైన బంగారు ఆభరణాలతో హాజరు కావద్దని, చేతులకు, కాళ్లకు మైదాకు ఉండకూడదని స్పష్టం చేసింది.

ఈ దశలో టీఆర్టీని నిలిపివేయలేం : హైకోర్టు

టీఆర్టీని రాసేందుకు ఎంతో మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, ఈ దశలో పరీక్షను నిలిపివేయాలని ఆదేశించలేమని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. నాలుగైదేళ్ల తర్వాత ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రకటన ఇచ్చిందని, శనివారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. టీఆర్టీ రాత పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించడాన్ని సవాల్ చేస్తూ నల్లగొండ జిల్లాకు చెందిన డి.సతీష్‌రావు సహా మరో ముగ్గురు అత్యవసరంగా దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ రామచందర్‌రావు విచారించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి టీఆర్టీకి లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, శనివారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న ఈ దశలో పరీక్ష ప్రక్రియను నిలిపివేయాలని కోరడం సరికాదన్న ఏజీ వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. పరీక్ష నిర్వహణ ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. పిటిషన్‌ను కొట్టివేస్తామని స్పష్టం చేయడంతో.. ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యర్థించారు. దీంతో న్యాయస్థానం అందుకు అనుమతించింది.



జగన్మోహినిగా నారసింహుడు

- నేడు యాదాద్రి బ్రహ్మోత్సవ తిరుకల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఇంద్రకరణ్

యాదాద్రి, భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనారసింహుడు శుక్రవారం 'జగన్మోహిని'గా భక్తులకు దర్శనమిచ్చాడు. యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని జగన్మోహిని అలంకరణలో పెండ్లి కొడుకుగా ముస్తాబు చేసి బాలాలయంలో ఊరేగించారు. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా వెలిగిపోతున్న స్వామివారిని చూసి భక్తులు పులకించిపోయారు. సముద్ర మథనం తర్వాత శ్రీహరి.. జగన్మోహినిగా అవతరించారు. ఆ దివ్య సౌందర్యానికి శ్రీదేవి, భూదేవిలే అసూయపడి, తర్వాత తేరుకుని జగన్నాటక సూత్రధారి అయిన శ్రీ మహావిష్ణువే జగన్మోహినిగా మారారని ఆనందించిన సందర్భమే ఈ అవతారమని పురాణాలు చెబుతాయి. స్వామివారి అలంకార సేవోత్సవంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవానికిగాను అమ్మవారి కోసం భూదాన్ పోచంపల్లి పద్మశాలి సంఘం నాయకులు పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరను సమర్పించారు.

తిరు కల్యాణానికి సీఎం కేసీఆర్ దూరం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. యాదాద్రి బాలాలయంలో ఆగమశాస్త్ర ప్రకారం ఉత్సవ విగ్రహాలకు ఈ వేడుక నిర్వహించి, సాయంత్రం కొండ కింద వైభవోపేతంగా ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ వేడుకలను సీఎం కేసీఆర్ సతీసమేతంగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఇటీవల ఆయన సోదరి మృతిచెండంతో పర్యటనను రద్దు చేసుకున్నట్టుగా ఆలయ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి.. స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. ఈ వేడుకకు గవర్నర్ నరసింహన్ హాజరుకానున్నట్టు తెలిసింది.

మహిళలందరికీ కేన్సర్ పరీక్షలు

- 30 ఏళ్లు దాటితే తప్పనిసరి
- తెలంగాణ తరహాలో దేశమంతా అమలు
- వ్యాధి తీవ్రత దృష్ట్యా కేంద్రం నిర్ణయం
- కేన్సర్ సెంటర్ల ప్రతినిధులతో సమావేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మహిళలందరికీ కేన్సర్ పరీక్షలు తప్పనిసరి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే గురువారం(22న) ఢిల్లీలో కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో దేశంలోని 8 ప్రాంతీయ కేన్సర్ కేంద్రాల(రీజనల్ కేన్సర్ సెంటర్లు, ఆర్‌సీసీ) ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఇటీవల కాలంలో కేన్సర్ వ్యాధి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా 30 ఏళ్లు దాటిన మహిళలందరికీ పరీక్షలు చేయాలన్న అంశంపై సమావేశంలో చర్చించింది. ఇప్పటికే తెలంగాణలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతుండడంతో దేశమంతా ఇదే తరహాలో అమలు చేయాలని, ఇందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారం కోరనుంది. ప్రస్తుతం ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 8 జిల్లాల్లో 3లక్షల మంది మహిళలకు కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. తొలుత పెద్దపల్లి, జనగాం జిల్లాలో ఇంటింటికీ కేన్సర్ పరీక్షలు నిర్వహించి.. అక్కడ విజయవంతం కావడంతో హైదరాబాద్, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో ప్రస్తుతం కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలు జరిపిన 3 లక్షల మందిలో కొత్తగా 500 మందికి కేన్సర్ ఉన్నట్టు గుర్తించారు. ఈ కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తున్నారు? అనుమానిత కేసులను ఏం చేస్తున్నారు? అలాగే ఎంతమందికి శిక్షణ ఇస్తున్నారు? ఎన్ని జిల్లాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు? ఎంతమందికి స్క్రీనింగ్ అయింది? అన్న సందేహాలను ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి ప్రతినిధి నుంచి ఎన్‌హెచ్‌ఎం అధికారులు గురువారం జరిగిన సమావేశంలో అడిగి తెలుసుకున్నారు.

మన దగ్గర ఎలా చేస్తున్నారంటే..

ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఎలా నిర్వహించాలన్న దానిపై శిక్షణ ఇస్తున్నారు. అవసరమైతే ముంబైలోని టాటా ట్రస్టు ఆధ్వర్యంలో నడిచే కేన్సర్ పరిశోధన కేంద్రం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లాస్‌లు ఇప్పిస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన వైద్య బృందం మళ్లీ ప్రతి జిల్లాలో స్థానికంగా ఉండే వైద్యులు, స్టాఫ్ నర్సులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. శిక్షణ పొందిన నర్సులు ఒక్కొక్కరు కనీసం 20-30 గృహాలను సందర్శించి 30 దాటిన మహిళలకు కేన్సర్ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి ఉందన్న అనుమానం ఉంటే వెంటనే జిల్లా కేంద్రానికి పంపుతున్నారు. అక్కడ బయోప్సీ నిర్వహించి కేన్సర్ ఉందని తేలితే అక్కడి నుంచి ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇలా 5నెలలుగా తెలంగాణలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గత నెలలో జాతీయ ఆరోగ్య మిషన్ బృందం స్వయంగా రాష్ట్రానికి వచ్చి కేన్సర్ పరీక్షల తీరుతెన్నులను పరిశీలించింది. ఇక్కడ జరుగుతున్న కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు ఢిల్లీకి రావాలని కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆహ్వానించింది.

వివరాలు కోరిన కేంద్రం

రాష్ట్రంలో జరుగుతున్న కేన్సర్ పరీక్షల నిర్వహణ గురించి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వివరాలు అడిగి తెలుసుకుంది. అక్కడి నుంచి వచ్చిన ఓ బృందం ఇక్కడ జరుగుతున్న పరీక్షలను స్వయంగా పరిశీలించి వెళ్లింది. దేశమంతా కేన్సర్ పరీక్షలు నిర్వహించాల్సి వస్తే అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరింది.

– డాక్టర్ జయలత, డైరెక్టర్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, హైదరాబాద్

తెలంగాణకు మరింత సహకారం

తెలంగాణలో చేపడుతున్న కేన్సర్ ముందస్తు నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని కేంద్రం అభినందించింది. ఇటువంటి పరీక్షలను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని అందించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. రూ.25లక్షల విలువైన కాల్పోస్కోపీ యూనిట్, రూ.4లక్షల విలువైన క్రయోథెరపీ యూనిట్‌ను ఉచితంగా అందించేందుకు అంగీకరించింది.



సచివాలయంలో ఎస్‌కే జోషిని కలిసి వినతి పత్రం ఇస్తున్న సకల ఉద్యోగుల జేఏసీ నాయకులు

మార్చి 25న సకల ఉద్యోగుల మహాసభ

సీఎస్ జోషికి ఉద్యోగుల జేఏసీ సమాచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పింఛను విధానం రద్దు సహా మరో 8 ప్రధాన డిమాండ్ల సాధనకు వచ్చే నెల 25న సకల ఉద్యోగుల మహాసభను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి ఉద్యోగుల జేఏసీ సమాచారమిచ్చింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత తదితరులు శుక్రవారం సీఎస్‌ను సచివాలయంలో కలిసి సకల ఉద్యోగుల మహాసభకు సంబంధించిన నోటీసు అందించారు. తక్షణమే పదోన్నతుల ప్రక్రియను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో పదోన్నతికి సంబంధించి ప్రస్తుతం కనీస అనుభవంగా ఉన్న 'మూడు సంవత్సరాల'ను రెండు సంవత్సరాలకు కుదించాలని, సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, కుటుంబ పింఛను సౌకర్యాలను తక్షణమే వర్తింపజేయాలని కోరారు. గ్రంథాలయ ఉద్యోగులకు '101' పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలన్నారు. 'ఆర్డర్ టు సర్వ్' ఉత్తర్వులను తక్షణమే రద్దు చేసి, శాశ్వత కేటాయింపులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మార్చి 25 నాటి సభను 50-60 వేల మందితో నిర్వహించనున్నామని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పింఛనుదారులు, కాంట్రాక్టు ఉద్యోగులు సభలో పాల్గొంటారన్నారు.

కాంగ్రెస్ యాత్రకు బస్సు సిద్ధం

- మొదటి దశలో సాధారణ వోల్వో బస్సు.. రెండో దశ యాత్రకు అధునాతన బెంజ్ బస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రకు బస్సు సిద్ధమైంది. వోల్వో బస్సుకు 'ప్రజా చైతన్య యాత్ర' పేరిట స్టిక్కరింగ్ చేశారు. అయితే ఈ బస్సులో ఎలాంటి అదనపు సౌకర్యాలు లేవు. లోపల సాధారణ సీటింగ్ మాత్రమే ఉంటుంది. అయితే, రెండో దశ యాత్రకు మాత్రం ప్రత్యేకంగా బెంజ్ బస్సును కొనుగోలు చేసినట్లు సమాచారం. కోయంబత్తూరులో ఈ బస్సును అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిసింది. కాన్ఫరెన్స్‌హాల్, రెస్ట్‌రూం, వాష్‌రూంతోపాటు సౌకర్యాలు సమకూరుస్తున్నట్లు చెబుతున్నారు.

ఫేస్‌బుక్ లైవ్‌లో ఉత్తమ్

టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోషల్ మీడియాలో యాక్టివ్ కానున్నారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఫేస్‌బుక్ లైవ్‌లో అందుబాటులో ఉంటారు. ఈమేరకు కార్యకర్తలు, ప్రజలు ఆయనతో నేరుగా సంభాషించవచ్చు. ఉత్తమ్‌తో మాట్లాడాలనుకునేవారు 8683 242 289, 9505 811 818 నంబర్లలో సంప్రదించవచ్చని గాంధీభవన్ వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

లోకం తీరు



దేశం నుంచి అవినీతిని తరిమేశాం!



ముఖ్యమంత్రి విషం పెట్టి చంపాలని చూశారు

నా యాత్రలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. దీన్ని ఓర్వలేక రాష్ట్ర ప్రభుత్వం నన్ను చంపాలని చూస్తోంది. ఇందులో భాగంగానే నేను తినే ఆహారంలో విషం కలిపేందుకు ప్రయత్నం చేసింది. విశ్వసనీయ వర్గాలు ఈ మేరకు సమాచారం అందించాయి.

- నితీశ్‌పై తేజస్వీ యాదవ్ సంచలన ఆరోపణలు



రైతులే కాదు! ఎమ్మెల్యేలూ చనిపోతున్నారు..

ఎమ్మెల్యేలూ చనిపోతున్నారు. గత నాలుగేళ్లలో పది మంది ఎమ్మెల్యేలు మరణించారు. వారేమైనా చిరకాలం బతుకుతారా? చావులను ఎవరూ నియంత్రించలేరు. ఆ సమస్య(రైతుల మరణాల)పై మేమూ ఆందోళన చెందుతున్నాం. రైతుల పట్ల మాకూ సానుభూతి ఉంది.

- మధ్యప్రదేశ్ మంత్రి గోపాల్ భార్గవ్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.83	పాత ధర 67.59
కొత్త ధర రూ.75.73	కొత్త ధర 67.51
తగ్గింది: 10 పైసలు	తగ్గింది: 8 పైసలు



నరాల చికిత్సకు కన్నీళ్ల సాయం

లాస్ ఏంజెలిస్, ఫిబ్రవరి 23: దుఃఖం, సంతోషం వంటి బలమైన భావోద్వేగాలు కలిగినపుడు వచ్చేవే కన్నీళ్లు. అశ్రువులు రాల్చితే ఆరోగ్యంగా ఉంటామని, ప్రశాంతత చేకూరుతుందని చాలా పరిశోధనల్లో తేలింది. తాజాగా, నరాల బలహీనతకు చికిత్స అందించడంలోనూ కన్నీళ్ల సాయం చేస్తాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు తెలిపారు. కన్నీటి గ్రంథిలోని నరాలు ఉత్తేజితమైనపుడు రహస్య కణాలు కొన్ని ప్రొటీన్లను విడుదల చేస్తాయని, ఆ ప్రొటీన్లు కన్నీళ్లలో ఉంటాయని, ఆ ప్రొటీన్ల పరిస్థితిని బట్టి నరాల బలహీనత ప్రభావాన్ని గుర్తించవచ్చని వివరించారు. ఆ ప్రభావానికి తగ్గట్లు రోగికి చికిత్స అందించవచ్చని వెల్లడించారు.



గుండెకు బీట్‌రూట్ రక్ష

వాషింగ్టన్, ఫిబ్రవరి 23: ఆరోగ్యానికి బీట్‌రూట్ చేసే మేలు అంతా ఇంతా కాదు. కాలేయాన్ని ఆరోగ్యం ఉంచేందుకు, ఊబకాయాన్ని తగ్గించేందుకు, మలబద్ధకాన్ని నివారించేందుకు ఇలా ఎన్నో రకాలుగా సాయపడుతుంది. రక్తపోటును తగ్గించి గుండెకు రక్షగా ఉంటుంది. అంతేకాదు, గుండె వైఫల్యం చెందిన రోగులు తిరిగి కోలుకోవడానికీ బీట్‌రూట్ జ్యూస్‌లోని పోషకాలు ఉపయోగపడతాయని అమెరికాలోని ఇండియానా వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు.

చిరుతిళ్లకు జన్యువులే కారణం!

టొరంటో, ఫిబ్రవరి 23: కొందరికి చిరుతిళ్లు అంటేనే చిరాకు. మరికొందరు ఎక్కువగా తింటారు. అందులోనూ కొందరు తియ్యనివి తినేందుకు, మరికొందరు ఉప్పగా, కారంగా ఉన్నవి తినేందుకు ఇష్టపడుతారు. ఇలా తినడానికి కారణం జన్యువుల ప్రభావమేనని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ గ్వెల్ఫ్ శాస్త్రవేత్తలు తెలిపారు. జన్యువుల్లోని పరివర్తనశీలి వల్లే పిల్లలు వివిధ రకాల చిరుతిళ్లను ఎంచుకుంటారని వెల్లడించారు.



ఖమ్మం ధర్నాచౌక్‌లో ఆమరణ దీక్షలో పాల్గొన్న ఫార్మాడీ విద్యార్థులు

ఆమరణ దీక్షలో ఫార్మా-డీ విద్యార్థులు

ఖమ్మంటౌన్/హైదరాబాద్, ఫిబ్రవరి 23: డిమాండ్ల సాధనలో భాగంగా ఫార్మా-డీ విద్యార్థులు ఖమ్మంలో శుక్రవారం నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన డాక్టర్ ఆఫ్ ఫార్మసీ (ఫార్మా-డీ) కోర్సు చేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంపై 23 రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలను ఖమ్మం జిల్లా జర్నలిస్టు యూనియన్ నేతలు సంఘీభావం తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఫార్మా-డీ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వారిని క్లినికల్ ఫార్మసిస్టులుగా గుర్తించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఉపాధి చూపించాలని ఫార్మా-డీ అభ్యర్థులు 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. కేరళ, మహారాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగా ఫార్మా-డీ కోర్సు చదివినవారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని సూచించారు.

బెదిరించి ఖాళీ కాగితాలపై సంతకాలు

- ప్రశ్నించినందుకు కేసు నమోదు
- హెచ్‌ఆర్‌సీలో బాధితుడి ఫిర్యాదు
- వరంగల్ సీపీకి నోటీసులు!

హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏసీపీ, పోలీసు ఇన్‌స్పెక్టర్ తనను బెదిరించి భూపత్రాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపిస్తూ ఒక బాధితుడు శుక్రవారం మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ)లో ఫిర్యాదు చేశారు. దీన్ని ప్రశ్నించినందుకు కేసు నమోదు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన హెచ్‌ఆర్‌సీ...వరంగల్ పోలీసు కమిషనర్‌కు నోటీసులిచ్చి, జూన్ 14లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. వరంగల్ గిర్మాజిపేటకు చెందిన బొమ్మకంటి శ్రీనివాస్ కేబుల్ ఆపరేటర్. ఆయనకు స్థానికంగా 333 గజాల భూమి ఉంది. ఇటీవల వరంగల్ ఏసీపీ, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్... బాధితుడు శ్రీనివాస్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని రెండు తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. భూమిపై ఇక ఆయనకు ఎలాంటి హక్కూ లేదని, అటువైపు కన్నెత్తి కూడా చూడొద్దని హెచ్చరించారు. కష్టపడి తాను కొన్న భూమిని వదిలేయాలని చెప్పడమేంటని ఆయన ప్రశ్నించారు. ఆగ్రహించిన పోలీస్ అధికారులు శ్రీనివాస్‌పై ఎదురు కేసు పెట్టారు.

హరితహారంపై ప్రతి నెలా నివేదికలివ్వండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో పీసీసీఎఫ్ పీకే ఝా

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో హరితహారం మొక్కలకు తప్పనిసరిగా నీటిసౌకర్యం కల్పించాలని, అందుకు సంబంధించి ప్రతి నెలా నివేదికలు పంపాలని అటవీశాఖ అధికారులను పీసీసీఎఫ్ పీకే ఝా ఆదేశించారు. శుక్రవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హరితహారంలో నాటిన మొక్కలు, తీసుకున్న రక్షణ చర్యలు, బతికిన మొక్కల శాతంపై సమీక్షించారు. అనంతరం పీసీసీఎఫ్ పీకే ఝా మాట్లాడుతూ హరితహారం మొక్కలపై సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారని, ఫలితాలపై సంతృప్తిగా లేరని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్, అదనపు అటవీసంరక్షణ అధికారులు మునీంద్ర, లోకేష్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఆదిలాబాద్ మునిసిపాలిటీ డీఈ

- 26 లక్షల నగదు, కిలో 340 గ్రాముల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు, నగదును చూపిస్తున్న ఏసీబీ అధికారులు

మట్టెవాడ(వరంగల్), ఫిబ్రవరి 23: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఆదిలాబాద్ మునిసిపాలిటీ డీఈ కొండల్‌రావును ఏసీబీ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులు కొండల్‌రావుకు సంబంధించిన వరంగల్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్, మండిబజార్‌లోని ఇండియన్ బ్యాంక్‌లోని లాకర్లను తెరిచారు. ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.26 లక్షల నగదు, మండిబజార్‌లోని ఇండియన్ బ్యాంక్‌లో కిలో 340 గ్రాముల బంగారు ఆభరణాలు, కొన్ని ప్రామిసరీ నోట్లు, ఇతర పత్రాలు స్వాధీనపర్చుకున్నారు. కొండల్‌రావును హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా... 14 రోజుల రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న తహసీల్దార్‌లు

సబ్ రిజిస్ట్రార్‌ల బాధ్యతలొద్దు: తహసీల్దార్‌లు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23: ప్రభుత్వం ఇటీవల సబ్ రిజిస్ట్రార్‌ల బాధ్యతలను తహసీల్దార్‌లకు అప్పగించగా.. తాము ఆ బాధ్యతలను నిర్వహించబోమని నిర్మల్ జిల్లా తహసీల్దార్‌ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ యం. ప్రశాంతిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కార్యాలయాల్లో సిబ్బంది కొరతతో పాటు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తాము సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలకు న్యాయం చేయలేమని తేల్చిచెప్పారు. తమను సబ్ రిజిస్ట్రార్‌ల బాధ్యతల నుంచి తొలగించే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.

బొమ్మ కారు బ్యాటరీ పేలి బాలుడికి గాయాలు



ఇల్లెందు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బొమ్మకారు బ్యాటరీ పేలి ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా టేకులపల్లి మండలం కొత్తూరులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాయం శ్రీను, రజిత దంపతులకు రెండో తరగతి చదువుతున్న అరవింద్ అనే కుమారుడు ఉన్నాడు. ఇటీవల జరిగిన మేడారం జాతరలో బాలుడికి రిమోట్ కారు కొనిచ్చారు. అయితే రిమోట్ పని చేయకపోవడంతో అరవింద్ బ్యాటరీకి కరెంట్ వైర్ చుట్టి ప్లగ్‌లో పెట్టాడు. దీంతో బ్యాటరీ పేలి బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అరవింద్‌ను కొత్తగూడెం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



సమయానికి బస్సులు ఉండవు! చేసేది లేక ఇలా విద్యార్థులు ఆటోలో ఫీట్లు వేయాల్సి వస్తోంది. వనపర్తి జిల్లా పెబ్బేరులోని ప్రభుత్వ బాలబాలికల పాఠశాల విద్యార్థులు స్కూల్ ముగియగానే తమ స్వస్థలాలు శ్రీరంగాపురం, కబలిపురం, చుగురు గ్రామాలకు నిత్యం ఇలా ప్రయాణించాల్సి వస్తోంది.

సర్పంచ్‌కు చేతులెత్తడమే!

పరోక్ష ఎన్నిక విధానానికే సీఎం మొగ్గు.. వార్డు సభ్యుల నుంచే ఒకరి ఎన్నిక

- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నిక విధానం దాదాపు ఖరారైంది. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారానే సర్పంచ్‌ను ఎన్నుకునే పరోక్ష ఎన్నిక విధానమే తెలంగాణలో అమలులోకి రానుంది. సర్పంచ్ ఎన్నికకు పరోక్ష విధానాన్ని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) సూచించిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా నూతన పంచాయతీరాజ్ చట్టం ముసాయిదాను ఆ శాఖ అధికారులు రూపొందించారు. దీనిని వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించనున్నారు. కొత్త విధానం ప్రకారం వార్డు సభ్యుల్లోనే ఒకరు సర్పంచ్‌గా ఎన్నిక కానున్నారు. ఇప్పటివరకు సర్పంచ్‌కు, ఆ గ్రామ పంచాయతీ పరిధిలోని వార్డులకు ఎన్నికలు జరిగేవి. సర్పంచ్ నేరుగా ఎన్నికయ్యేవారు. వార్డులకు ఎన్నికైన వారు గ్రామ పంచాయతీ సభ్యులుగా కొనసాగేవారు. సర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన కమిటీ గ్రామ పంచాయతీ పాలక మండలిగా వ్యవహరిస్తోంది. ఇక నుంచి వార్డు సభ్యుల్లోనే ఒకరు సర్పంచ్, మరో వార్డు సభ్యుడు ఉప సర్పంచ్‌గా ఎన్నికవుతారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తరువాత మొదటి సమావేశంలో వీరిద్దరిని చేతులెత్తడం ద్వారా ఎన్నుకుంటారు.

నాలుగున్నర దశాబ్దాల క్రితం...

గ్రామ పంచాయతీలకు దాదాపు అన్ని సందర్భాల్లోనూ ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. కానీ, 1970వ దశకంలో జరిగిన ఎన్నికల్లో వార్డు సభ్యుడి నుంచే ఒకరిని పరోక్ష పద్ధతిలో సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అప్పట్లో ఉన్న జిల్లా పరిషత్ కు, సమితిలకు కూడా పరోక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించేవారు. సర్పంచ్‌ల నుంచే ఒకరు సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యేవారు. జిల్లాలోని సమితుల అధ్యక్షుల నుంచే ఒక రు జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యే వారు. 1980 దశకం ఆరంభంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి మళ్లీ ప్రత్యక్ష పద్ధతి అమలులోకి తెచ్చారు. 1987 ప్రాంతంలో సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ అధ్యక్షుడిని ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నుకున్నారు. 73వ రాజ్యాంగ సవరణ అనంతరం 1994, 1995లలో పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు జరిగాయి. అప్పట్లో సర్పంచ్‌ను మాత్రమే ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోగా, జిల్లా, మండల పరిషత్‌ల అధ్యక్షులను పరోక్ష పద్ధతి ద్వారానే ఎన్నుకున్నారు. నాటి నుంచి నాలుగు పర్యాయాలుగా ఈ విధానమే అమలులో ఉంది.



కీలకం కానున్న వార్డులు

సర్పంచ్‌గా వార్డు సభ్యుల్లోనే ఒకరిని ఎన్నుకోనున్నందున... వార్డు ఎన్నికలు కీలకం కానున్నాయి. రిజర్వేషన్‌ను అనుసరించి కొన్ని వార్డులకు ప్రాధాన్యత పెరుగుతుంది. ఉదాహరణకు 10 వార్డులున్న పంచాయతీ సర్పంచ్ పదవిని బీసీలకు కేటాయించారనుకుందాం. కనీసం నలుగురు బీసీ వార్డు సభ్యులుంటే ఈ నాలుగు వార్డులతో పాటు జనరల్ కేటగిరిలో ఉండే కొన్ని సీట్లు కూడా కీలకంగా మారనున్నాయి. దళితులు, గిరిజనులకు సర్పంచ్ పదవిని కేటాయిస్తే.. ఆ వర్గాలకు కేటాయించిన వార్డులతో పాటు జనరల్ వార్డులు కీలకమవుతాయి. సర్పంచ్ పదవి జనరల్‌కు కేటాయిస్తే ఇక పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులూ కీలకమే. సహజంగా పరోక్ష ఎన్నిక విధానంలో కొంతకాలం తరువాత అవిశ్వాసం పెట్టే అవకాశాలు కూడా ఉంటాయి. దీంతో సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి... మెజారిటీ వార్డు సభ్యులు తనకు అనుకూలంగా ఉండేట్లు చూసుకోవాలి.

12 వేలకు పైగా తగ్గనున్న పదవులు

సర్పంచ్‌ను పరోక్షంగా ఎన్నుకోనుండడంతో గ్రామ పంచాయతీ పాలక మండళ్ల పదవులు దాదాపు 12 వేలకు పైగా తగ్గనున్నాయి. ప్రస్తుతం 8,684 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లతో పాటు దాదాపు 87 వేల మంది వార్డు సభ్యులు ఉన్నారు. దాదాపు 4 వేలకు పైగా కొత్త పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. కొత్త వాటితో కలిపి పంచాయతీల సంఖ్య 12 వేలకు పైబడనుంది. నేరుగా ఎన్నికయ్యే అవకాశం లేనందున ఈ మేరకు పదవులు తగ్గనున్నాయి.

దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు

12 వేల కోట్ల బ్యాంకు రుణాలు

- ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణాలకు బ్యాంకు రుణాలను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్నట్టుగానే ఈ రెండు ప్రాజెక్టులకు కూడా రూ. 12 వేల కోట్ల రుణాలను తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన చర్యల్ని అధికారులు చేపట్టారు. దేవాదుల లిఫ్టుకు గోదావరి నది నీటిని అందించడం కోసం ప్రత్యేక బ్యారేజిని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. తుపాకులగూడెం వద్ద దీనిని నిర్మిస్తున్నారు. ఈ బ్యారేజి నిర్మాణంతో పాటు, దేవాదుల ప్రాజెక్టులో మిగిలిన పనుల కోసం సుమారు రూ. 7 వేల కోట్లను రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకు సంబంధించి దేవాదుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడానికి ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టుకు నాబార్డు ద్వారా రుణాన్ని తీసుకోవాలని గతంలో ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే ఇందుకు కేంద్రం తగిన విధంగా సహకరించకపోవడంతో ఈ ప్రతిపాదనను విరమించుకున్నారు. నాబార్డుకు బదులుగా బ్యాంకుల నుంచి రుణాలను తీసుకోవాలని తాజాగా నిర్ణయించారు. అలాగే సీతారామ ప్రాజెక్టుకు కూడా బ్యాంకుల సుమారు రూ. 5 వేల కోట్ల మేర రుణాలను తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సీతారామ ప్రాజెక్టు పేరిట ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల రుణాలకు సంబంధించి పలు బ్యాంకుల ప్రతినిధులతో ఇరిగేషన్ శాఖ అధికారులు సంప్రదింపులు మొదలుపెట్టారు. రుణాలివ్వడానికి కొన్ని బ్యాంకులు ఇప్పటికే ముందుకు వచ్చినట్టు సమాచారం. రానున్న బడ్జెట్‌లో అనేక రంగాలకు ఎక్కువ నిధులను కేటాయించాల్సి ఉంటుందనే అంశాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు బ్యాంకు రుణాలను సమీకరించుకోవాలని భావిస్తున్నది. ఈ ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయడానికి వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) చాలా కీలంగా మారనుంది.

కేయూలో విద్యార్థుల ఘర్షణ

బంద్ విషయంలో తలెత్తిన వివాదం.. విద్యార్థులు, జేఏసీ నాయకులకు గాయాలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 23: కాకతీయ యూనివర్సిటీలో బంద్ విషయంలో తలెత్తిన వివాదం విద్యార్థి జేఏసీ నాయకులు, ఇంజనీరింగ్ విద్యార్థులకు మధ్య ఘర్షణకు దారి తీసింది. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రకటనను రద్దు చేయడంతో పాటు సీట్లు పెంచి విద్యార్థులకు న్యాయం చేయాలని కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో గత కొంతకాలంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం కేయూ బంద్‌కు పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘం నాయకులు క్యాంపస్‌లోని అన్ని విభాగాల్లో తరగతులను బహిష్కరిస్తున్న క్రమంలో కేయూ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే వివాదం తలెత్తింది. మా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు మీ సమస్యల కోసం తరగతులు బహిష్కరిస్తున్నారని కొందరు ఇంజనీరింగ్ విద్యార్థులు ఘర్షణకు దిగారు. దీంతో విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని తారా స్థాయికి చేరింది. కళాశాల నుంచి సస్పెన్షన్‌కు గురైన పలువురు విద్యార్థులు కుడా ఇంజనీరింగ్ విద్యార్థుల్లో కలిసి విద్యార్థి సంఘాల నాయకులతో ఘర్షణ పడ్డారు. ఒకరిని ఒకరు తోసుకోవడంతో విద్యార్థులు కింద పడిపోయారు. గొడవ తీవ్ర స్థాయికి చేరింది. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన రాజగోపాల్, మరో విద్యార్థి జేఏసీ నేత బొట్ల మనోహర్, రాజులకు గాయాలయ్యాయి. రాజగోపాల్ తలకు బలంగా దెబ్బ తగలడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు కుడా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నేతలు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి సంఘం నేతలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు దాస్యం వినయ్‌భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితరులు పరామర్శించారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం విద్యార్థి సంఘాల నేతలు మూకుమ్మడిగా వర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడించారు. గొడవలకు బాధ్యులైన విద్యార్థులు, ప్రిన్సిపాల్ మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలని బైఠాయించారు. పరిస్థితి తెలుసుకున్న కేయూ వీసీ ఆర్. సాయన్న, రిజిస్ట్రార్ పురుషోత్తంతో మాట్లాడారు. పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థుల ఆందోళనతో దిగివచ్చిన వర్సిటీ రిజిస్ట్రార్.. ప్రొఫెసర్ మల్లారెడ్డిని ప్రిన్సిపాల్ పదవీ నుంచి తప్పిస్తామని ప్రకటించారు. ఘర్షణల నేపథ్యంలో కేయూ క్యాంపస్ పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వినయ్, అరూరి

లిపోసార్కోమా కేన్సర్ బాధితుడికి వైద్యం

- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' కథనాలకు సబ్ కలెక్టర్ స్పందన
- బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో చికిత్సకు ఏర్పాట్లు

భద్రాచలంటౌన్, ఫిబ్రవరి 23: రెక్కాడితేగానీ డొక్కాడని ఆ నిరుపేదలో ఇప్పుడు బతుకుపై కొత్త ఆశలు. లిపోసార్కోమా కేన్సర్‌తో బాధపడుతున్న ఆ వ్యక్తిలో మెరుగైన వైద్య చికిత్స లభిస్తుందనే కొండంత భరోసా! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన మామిడాల రవి (35) దీనగాథను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీనిపై భద్రాది కొత్తగూడెం జిల్లా సబ్ కలెక్టర్ పమేలా సత్పథి స్పందించారు. మెరుగైన వైద్యం కోసం ఏర్పాట్లకు ఆదేశించారు. భద్రాచలం ఏరియా సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డితో మాట్లాడి బాధితుడికి వైద్యం అందించేందుకు హైదరాబాద్‌కు తరలించాలని ఆదేశించారు. రవికి వైద్య పరీక్షల అనంతరం ప్రత్యేక అంబులెన్సు ద్వారా హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో చేర్పించారు. రవికి శస్త్ర చికిత్స చేసేందుకు సుమారు రూ. 5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు నివేదిక తయారు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ వైద్య ఖర్చుల కోసం ఓ నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు. కాగా సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఇప్పటికే సీఎం పేషీకి లేఖ రాసినట్టు తెలిసింది. అయితే శుక్రవారం రవిని పరిశీలించిన వైద్య బృందం.. శనివారం మరోసారి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్స నిర్వహించే విషయంలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని బాధితుడి కుటుంబ సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



జీడిమెట్లలో 'రసాయన' విస్ఫోటనం

- మంటల్లో తీవ్రంగా కాలిపోయిన ఏడుగురు కార్మికులు
- నలుగురి పరిస్థితి విషమం.. కోట్ల రూపాయల ఆస్తి నష్టం

జీడిమెట్ల/హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అది జీడిమెట్లలోని సుటిక్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ.. శుక్రవారం తెల్లవారుజామున 10 మంది కార్మికులు రియాక్టర్ వద్ద పనిచేస్తున్నారు. ఒక్కసారిగా రియాక్టర్ పేలి క్షణాల్లో మంటలు గుప్పుమన్నాయి. ఏం జరుగుతుందో అని తెలుసుకునేలోపే ఏడుగురు కార్మికులు మంటలు అంటుకొని తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రాణాలు కాపాడుకోవడానికి గోడలు దూకి సమీపంలోని గంపల బస్తీలోకి పరుగులు తీశారు. వారిని కొంపల్లిలోని హర్ష ఆస్పత్రికి తరలించారు. వారిలో నలుగురు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండడంతో డీఆర్‌డీవో అపోలో ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో షిఫ్ట్ ఇంచార్జి కె.కుమారస్వామి(40), బి.శ్రీనివాస్ (35), సీనియర్ ఎలక్ట్రీషియన్ కె.సింహాచలం, కెమికల్ ట్యాంకర్ డ్రైవర్ సంజీత్(25), హర్షన్(45), నరహరి(33), శ్యామ్(35) ఉన్నారు. కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని శ్రీ వేంకటేశ్వర కో ఆపరేటివ్ సొసైటీలోని ప్లాట్ నంబరు 42/ఏలో ప్రసాద్ అనే వ్యక్తి ఈ ఫార్మా కంపెనీని నడుపుతున్నాడు. పరిశ్రమలో 30 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాగా, ఈ ప్రమాదానికి పరిశ్రమ యాజమాన్యం, కార్మికుల నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. రియాక్టర్‌లో మిథైల్ రియాక్షన్ జరుపుతున్న సమయంలో ఉష్ణోగ్రత పెరిగినా దానిని అదుపుచేయడానికి జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే భారీ విస్ఫోటనం సంభవించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక, మంటలను అదుపుచేసేందుకు దాదాపు 3 గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. 8 ఫైర్ ఇంజన్లను రంగంలోకి దించారు. ఒకవేళ రసాయాల డ్రమ్ములకు మంటలు అంటుకుని ఉంటే ఘోర ప్రమాదం సంభవించేది. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అదే కథ!

అవినీతి విషయంలో మనమేమిటన్నది మనకు తెలుసును కానీ, విదేశీ సర్వేలు ఆ విషయాన్ని రూఢీ పరిచినప్పుడు ఎందుకో మనసు చివుక్కుమంటుంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ అవినీతి నిరోధంలో భారతదేశం ఎక్కడున్నదో ఏటా చెబుతూనే ఉన్నది. అవినీతి నిరోధంలో మీరెక్కడ? అంటున్న ఈ నివేదికలో ఒకటి రెండు ర్యాంకులు తగ్గివుంటే క్షేత్రస్థాయిలో అవినీతి అంతమైపోయినట్టు కాదు కానీ, ఏదో పోరాటం సాగుతోందనే భ్రమ కాస్తంత మిగిలేది. ఈ ఏడాది ఈ సంస్థ ప్రకటించిన నివేదిక ఆ సంతోషాన్ని కూడా మిగల్చలేదు. 2016లో ఇచ్చిన 40మార్కులనే 2017లోనూ ఇస్తూ మరో రెండు ర్యాంకులు దించేసింది. 67 మార్కులతో 26వ ర్యాంకులో నిలిచిన పొరుగుదేశం భూటాన్‌ను ఆదర్శంగా ఎంచుకోవడం అసాధ్యమైన విషయం కనుక, మనకంటే దిగువ ర్యాంకుల్లో ఉన్న శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, మయన్మార్‌లతో సరిపోల్చుకొని సరిపెట్టుకోవడం ఉత్తమం.

పంజాబ్ నేషనల్ బ్యాంక్, రోటోమాక్ కుంభకోణాల నేపథ్యంలో వెలువడిన ఈ నివేదిక భారతదేశంలో అవినీతి స్థాయిని అంచనా వేయడం మరింత సులభతరం చేసింది. కాంగ్రెస్ ఏలుబడిలో ఇటువంటి నివేదికలు వెలువడినప్పుడల్లా దేశం అవినీతికూపంలోకి జారిపోతున్నదని ఆగ్రహించిన ప్రజలకు, ఇప్పుడు పరిస్థితిలో కించిత్తు మార్పు రాలేదన్న వార్త పెద్ద దెబ్బే. కాంగ్రెస్ అవినీతి పాలనను దునుమాడుతూ, కుంభకోణాలపై నోరు విప్పని మన్మోహన్ సింగ్‌కు మారుపేర్లు పెడుతూ, అవినీతిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్నీ, అసహ్యాన్ని సునాయాసంగా సొమ్ముచేసుకొని మోదీ అధికారంలోకి రాగలిగారు. ఆ తరువాత ఆయన తాను తీసుకున్న ప్రతి చర్యనీ అవినీతిపై పోరాటంగా చిత్రీకరించినా ప్రజలు కాదనలేదు. ఒక అర్థరాత్రి పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించి, లక్షలాదిమంది సామాన్యులను బ్యాంకుల ముందు మండుటెండలో నిలబెట్టినా, అనేకరంగాలను ముంచేసినా ప్రజలు ఆయన మాటే నిజమనుకున్నారు. విపక్ష నాయకులపై కేంద్ర ప్రభుత్వ విభాగాలు దాడులు జరిపినా అది అవినీతిపరుల ఏరివేతేనని నమ్మారు. జీఎస్టీ కూడా ప్రక్షాళనలో భాగమేనని నమ్ముతున్నారు. మోదీ చర్యలు, చేష్టలపై ఇప్పటిదాకా విశ్వాసం ఉంచినవారికి, అవినీతి నిరోధానికి భారత్ చేసిందేమీలేదని ఈ నివేదిక తేల్చేయడం కచ్చితంగా అసంతృప్తి కలిగిస్తుంది. మరో దేశం కొత్తగా ఈ జాబితాలోకి వచ్చి చేరడం, కొన్ని దేశాలు తమ పరిస్థితులను మెరుగుపరచుకోవడం వల్ల భారత్ ర్యాంకు జారిపోయి వుండవచ్చునేమో కానీ, ప్రభుత్వం ప్రచారం చేసుకున్నట్టుగా అవినీతి ప్రక్షాళన లోతుగా సాగుతూవుంటే మరుసటి ఏడాది పరీక్షలోనూ అవే మార్కులు వచ్చివుండేవి కావు.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అవినీతి, పత్రికాస్వేచ్ఛలకు సంబంధించి తీవ్రమైన నేరాలు జరుగుతున్న దేశంగా భారత్‌ను ఈ నివేదిక ప్రస్తావించడం విశేషం. ఫిలిప్పైన్స్, మాల్దీవులతో పాటు ఈ కేటగిరీలో భారత్ స్థానం సంపాదించుకున్నది. పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, ప్రజావేగులు ఇత్యాదులపై సాగుతున్న హత్యలకు, దేశంలో పెరుగుతున్న అవినీతికీ ప్రత్యక్ష సంబంధం ఉన్నదని ఈ నివేదిక హెచ్చరిస్తున్నది. అవినీతిపై వార్తలు రాసిన జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయనీ, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలనీ, అప్పుడు మాత్రమే అవినీతి తగ్గుముఖం పడుతుందని ఈ సంస్థ అంటున్నది. తనవాదనకు మద్దతుగా అది చూపిన ఉదాహరణలను అటుంచితే, న్యాయాధికారుల హత్యలనుంచి, ఎన్జీవోలపై ఆంక్షలవరకూ దేశంలో ఎటువంటి వాతావరణం నెలకొనివున్నదో చూస్తూనే ఉన్నాం. ఈ వాతావరణాన్ని మార్చేందుకు ట్రాన్స్‌పరేన్సీ ఇంటర్నేషనల్ పలు సూచనలు చేసింది. చట్టాలు చేయడం, వ్యవస్థలను నిర్మించడం వంటి చర్యలతో పాటు, న్యాయ వ్యవస్థ ఏ విధంగా ఉండాలో, పౌర సమాజం గొంతు ఎంత బలంగా ఉండాలో కూడా చెప్పింది. ఎటువంటి భయాలూ, ఒత్తిళ్ళు లేకుండా సామాజిక కార్యకర్తలు స్వేచ్ఛగా మాట్లాడగలిగే వాతావరణం ఉండాలంటున్నది. ప్రభుత్వాలతో పాటు, పారిశ్రామిక సంస్థలు కూడా పూర్తి పారదర్శకంగా ఉంటూ, సాధ్యమైనంత సమాచారాన్ని పౌర సమాజంతో పంచుకొనే ఏర్పాట్లు జరిగినప్పుడే అవినీతి తగ్గుతుందని ఈ సంస్థ చెబుతున్నది. రాజకీయపక్షాలకు అందే విరాళాలు కూడా పారదర్శకంగా ఉండాలంటున్నది. ఈ నివేదికలో భారతదేశం ర్యాంకును అటుంచితే, మార్కుల విషయంలో అది గత ఐదేళ్ళుగా మెరుగుపడుతున్న వాస్తవాన్ని గుర్తించకతప్పదు. 2012లో 36 మార్కులనుంచి ఇప్పటివరకూ నాలుగు మార్కులు పెంచుకోగలిగింది. ఈ మెరుగుదల సంతోషించవలసిందే అయినప్పటికీ, అవినీతిపై పోరాటం నినాదంగానే మిగిలింది తప్ప క్షేత్రస్థాయిలో సాగడం లేదన్న వాస్తవాన్ని గుర్తించడం ముఖ్యం. అన్నిరంగాల్లోనూ లోతుగా వేళ్ళూనుకొనివున్న అవినీతిని ప్రక్షాళించడం అందమైన మాటలు, అద్భుతమైన నినాదాలతో సాధ్యం కాదు. ఈ నివేదిక ఇచ్చిన సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకుంటూ, సమూలమైన మార్పుచేర్పులకు నడుం బిగించవలసిన అవసరం ఉన్నది.

కరపత్రం

అనాథ రైతు కుటుంబాలతో ఆత్మీయ సమావేశం

కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ (సిసిసి) ఆధ్వర్యంలో 'రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలతో ఆత్మీయ సమావేశం' ఫిబ్రవరి 25 ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు తెలుగు యూనివర్శిటీ ఆడిటోరియం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. పొత్తూరి వెంకటేశ్వరరావు, రమ మెల్కోటే, బెజవాడ విల్సన్, భాషా సింగ్, సుజాత సూరేపల్లి, శ్రీనివాస్ రణబోతు, మల్లిఖార్జున, యాంకర్ ఝాన్సీ, కె.ఆర్. వేణుగోపాల్, కిరణ్ విస్సా, ఆశాలత, జీవన్ కుమార్ తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా 130 బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న వ్యక్తులు పాల్గొంటారు.

– కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్

మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారం

మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారం ఫిబ్రవరి 25, ఆదివారం జరుగుతుంది. ఆంధ్రమహిళా సభ హైదరాబాద్‌లో సాయంత్రం 4.30 గంటలకు జరిగే సభలో 2017 సంవత్సరానికిగాను సమ్మెట ఉమాదేవి స్మారక పురస్కారం అందుకుంటారు. నాళేశ్వరం శంకరం అధ్యక్షతన జరిగే సభలో డి.కామేశ్వరి, సమ్మెట నాగమల్లేశ్వరరావు, అంజలి ఎలమంచి, మాడభూషి లలితాదేవిలు పాల్గొంటారు.

– మాడభూషి లలితాదేవి

కరుణామూర్తి బిల్లీ గ్రాహం

"నేను భారతదేశాన్ని అనేక సార్లు పర్యటించాను. నాకు భారతదేశం అన్నా భారత ప్రజలన్నా చాలా ప్రేమ. ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో 1977 ఉప్పెన కారణంగా జరిగిన భీకర విధ్వంసం నా మనసును కలచి వేసింది. వెంటనే వెళ్ళి ఉప్పెన ప్రాంతాల్ని సందర్శించాను. నా జీవితంలో మరచిపోలేని భయంకర విధ్వంసం అది. ఇంత జరిగినా కృంగిపోకుండా అక్కడ నిలిచిన బాధితులతో నేను మాట్లాడినప్పుడు వాళ్ళు ప్రదర్శించిన మనోధైర్యం నన్ను చాలా ప్రభావితుణ్ణి చేసింది. వాళ్ళు ఆ నేలమీదే అక్కడే తమజీవితాలను పునర్నిర్మించుకోవాలని కోరుకున్నారు. ఇంతటి మనో నిబ్బరాన్ని నేనెక్కడా చూడలేదు," అన్నారు ప్రపంచ ప్రఖ్యాత క్రీస్తుసందేశ ప్రచారకుడు బిల్లీ గ్రాహం. నలభై యేళ్ల క్రితం దివిసీమ ఉప్పెన జనజీవితాన్ని ఛిన్నాభిన్నం చేసిన దృశ్యాల్ని స్వయంగా దివిసీమకు వచ్చి సందర్శించి, బైట ప్రపంచానికి తెలియజేసి, దివిసీమ పునర్నిర్మాణానికి ప్రపంచవ్యాప్తంగా సాయం అందటానికి ప్రథమ కారకుడు బిల్లీగ్రాహం. "నేను అమెరికా తిరిగి వెళ్లాక ఆ విధ్వంసానికి సంబంధించిన దృశ్యాల్ని చూపించి, బాధితులు పడ్తున్న అవస్థల్ని అమెరికన్ క్రైస్తవ సమాజానికి వివరించాను. వేలాది అమెరికన్ దాతల కారణంగానే 'బిల్లీ గ్రాహం నగర్ నిర్మాణం' అనే కల నెరవేరింది. మన స్నేహానురాగాల్లో వాళ్లంతా భాగస్వాములయ్యారు. సంతోషకరమైన ఈరోజున అలసట ఎరుగకుండా కృషిచేసి విజయాన్ని సాధించిన మీ అందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా నిర్మాణ సారథ్యం వహించిన కమిటీ వారికి నా అభివాదాలు" అని బిల్లీ గ్రాహం తన సందేశంలో పేర్కొన్నారు.

దివిసీమ ఉప్పెన సమయంలో రెవ. డా.సిహెచ్ దేవానందరావుగారు రాష్ట్ర పర్యాటక, క్రీడల, గ్రంథాలయ శాఖామాత్యులుగా ఉండేవారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న మా నాన్నగారు, దేవానందరావుగారూ మంచి సన్నిహితులు. ఆయన క్రీస్తు సువార్త ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు కూడా!

1977 డిసెంబర్ తొలి రోజుల్లో ఫిలిప్పైన్స్ నుంచి ఇండియా వచ్చిన బిల్లీని దివిసీమ ఉప్పెన బాధితులను ఆదుకోవాలని రాష్ట్రపతి కోరారు. బిల్లీ వెంటనే హైదరాబాద్ వచ్చారు. ముఖ్యమంత్రి సహకారంతో డిసెంబర్ 8న భారతీయ వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో బిల్ గ్రాహం బృందాన్ని గన్నవరం విమానాశ్రయానికి తోడ్కొని వచ్చారు. అక్కడి నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో దివిసీమ ఉప్పెన ప్రభావిత ప్రాంతాల సందర్శనకు తీసుకువెళ్లారు. మా నాన్నగారు బిల్ గ్రాహం బృందానికి స్వాగతం పలికారు. బిల్ గ్రాహం గారితో పాటుగా రెవ.డా.వాల్టర్ స్మిత్, ఇంకా అనేకమంది ఫోటోగ్రాఫర్లు, ఫిల్మ్ మేకర్లు, విదేశీ ఛానళ్ల వాళ్లూ ఉన్నారు. నిజానికి గ్రాహంగారి వెంటవచ్చిన ఈ బృందం తీసిన చిత్రాలే దివిసీమ ఉప్పెన కలిగించిన బీభత్సాన్ని బయట ప్రపంచానికి తెలియచేశాయి. మా నాన్నగారు అన్నింటికన్నా ఎక్కువగా దెబ్బతిన్న సొర్లగొంది, గొల్లపాలెం గ్రామాలకు గ్రాహం బృందాన్ని తీసుకువెళ్లారు. గ్రాహం అక్కడి ప్రజల్ని అక్కున చేర్చుకుని ఓదార్చారు. వాళ్లు చెప్పుకున్నదంతా శ్రద్ధగా విన్నారు. అప్పటికీ వందలాది మృతకళేబరాల్ని ఇంకా తొలగిస్తూనే ఉన్నారు. ఆ



మా నాన్నగారు బిల్లీ గ్రాహంతో మాట్లాడుతూ, "మా తెలుగు భాషలో గ్రామ్ అంటే ఊరు. మీరు ఒక గ్రామాన్ని దత్తత తీసుకోండి గ్రాహమ్ గారూ, ఆ గ్రామాన్ని మీ పేరుతో బిల్లీ గ్రాహమ్ నగర్ అని పిలుచుకుంటాం," అన్నారు. ఆ ప్రతిపాదనకు గ్రాహం వెంటనే సానుకూలంగా ప్రతిస్పందిస్తూ గణపేశ్వరం, ఇసుకరేవు మాలపల్లి గ్రామాలను దత్తత తీసుకున్నారు

శవాల మధ్యనుండి, శిథిలాల మధ్యనుండి ఆయన ఆ ప్రాంతాన్నంతా పర్యవేక్షించారు. ఇక్కడ వీళ్లకు ఆరోగ్యదాయకమైన వసతులు కల్పించకపోతే మిగిలినవాళ్లు కూడా బతకలేరనే భావన ఆయనకు కలిగింది. తాను వ్యవస్థాపించిన 'బిల్లీ గ్రాహం ఇవాంజెలిస్టిక్ అసోసియేషన్' అత్యవసర ప్రపంచ నిధి నుండి లక్ష డాలర్ల తక్షణ సహాయాన్ని ప్రకటించారు. స్థానిక క్రైస్తవ సంఘాలు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ నిధిని వెచ్చిస్తాయని ప్రకటించారు. ఇందుకోసం ఆర్చిబిషప్ డా. ఎస్ అరులప్పగారు, మంత్రి డా. సిహెచ్. దేవానందరావుగారు, మా నాన్నగారు వీళ్లతో ఒక కమిటీని అప్పటికప్పుడు ఏర్పరచారు.

మా నాన్నగారు బిల్లీ గ్రాహంగారితో మాట్లాడుతూ, "మా తెలుగు భాషలో గ్రామ్ అంటే ఊరు. మీరు ఒక గ్రామాన్ని దత్తత తీసుకోండి గ్రాహమ్ గారూ, ఆ గ్రామాన్ని మీ పేరుతో 'బిల్లీ గ్రాహమ్ నగర్' అని పిలుచుకుంటాం" అన్నారు. ఆ ప్రతిపాదనకు వెంటనే సానుకూలంగా ప్రతిస్పందించారు గ్రాహం. గణపేశ్వరం, ఇసుకరేవు మాలపల్లి గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఇళ్ల నిర్మాణం నిమిత్తం తక్షణం ఇంటికి 10,000 రూపాయల చొప్పున 20 ఇళ్ల నిర్మాణం కోసం 2 లక్షల రూపాయల నిధిని, తుపాను పీడిత ప్రాంతాల్లో దెబ్బతిన్న 20 చర్చిల రిపేరు నిమిత్తం 2 లక్షల రూపాయల్ని అందించారు. 285 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కమిటీ వారు నిర్ణయించారు. ముఖ్యమంత్రి ప్రతి ఇంటి నిర్మాణానికి 2,500 రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇవ్వటానికి అంగీకరించారు. గత లబ్ధిదారులైన బాధితులు శ్రమదానం ద్వారా మిగతా ఖర్చును పూడ్చటానికి అంగీకరించారు. 'బిల్ గ్రాహం నగర్'కు ఆర్చిబిషప్ డా. అరులప్పగారు 1978, ఏప్రియల్ 21వ తేదీన శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల కాలంలోనే ఏప్రియల్ 21 నాటికి 40 ఇళ్లు పూర్తయ్యాయి.

యాభై యేళ్ళపాటు మత ప్రచారకుడిగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన వ్యక్తి బిల్లీ గ్రాహం. ఐసన్ హోవర్, జాన్సన్ నిక్సన్‌ల నుంచి బరాక్ ఒబామా వరకూ దాదాపు 12మంది అమెరికన్ అధ్యక్షులకు ఆయన అత్యంత సన్నిహితుడు కూడా! మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ని అరెస్టు చేసినప్పుడు ఆయన బెయిల్ ఇప్పించి విడిపించాడు.

బిల్లీ గ్రాహం తన ఆత్మకథని 'జస్ట్ వాట్ ఐ యామ్' పేరుతో వ్రాసుకున్నారు. అదొక శ్రమ జీవుని అధికారపత్రం లాంటిది. బిల్లీగ్రాహం 1950లో దైవప్రచార సంస్థను బిల్లీ గ్రాహం ఇవాంజెలిస్టిక్ అసోసియేషన్ పేరిట వ్యవస్థాపించాడు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని టెలివిజన్, రేడియోలాంటి ప్రసార సాధనాల ద్వారా క్రైస్తవ సువార్త ప్రచారం చేసిన వారిలో బిల్ గ్రాహం అగ్రగణ్యుడు. టెలివాంజెలిస్ట్‌గా వీరికి గొప్ప పేరు. 1960లకే ఆయన ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తుల జాబితాలో ఉన్నారు. అమెరికా అధ్యక్షులకు ఆధ్యాత్మిక సలహాదారుగా, అనేక అంతర్జాతీయ అంశాలు ముఖ్యంగా యుద్ధాలు, ప్రపంచ శాంతి, జాతి వివక్షలు, సామాజిక ఉన్నతి లాంటి అంశాల మీద ఆయన మాటకు విలువ ఉండేది. నిజానికి గ్రాహంగారు ప్రెసిడెంట్ నిక్సన్‌తో స్నేహం కారణంగా రిపబ్లికన్ పార్టీలో సభ్యుడుగా చేరారు. కానీ, 'క్రీస్తుకు రాజకీయ పార్టీ లేదు' అంటూ సున్నితంగా రాజకీయ అంశాలను తిరస్కరిస్తూ వాటికి దూరంగా ఉండేవారు. 2010 తరువాత వృద్ధాప్యం కారణంగా ప్రజా జీవితంలోంచి విరమించుకుని విశ్రాంతి తీసుకోసాగారు. క్రీస్తు సందేశ వ్యాప్తి కోసం ఆయన నెలకొల్పిన సంస్థకు ఆయన కుమారుడు నేతృత్వంలో క్రీస్తుసేవలు కొనసాగుతూనే ఉన్నాయి. కరుణామూర్తిగా, శాంతిదూతగా బిల్లీ గ్రాహం సేవలు చిరస్మరణీయం.

ఒక ఇవాంజలిస్టుగా, ఆధ్యాత్మిక సలహాదారుగా క్రైస్తవమతానికి, సమస్త మానవాళికీ అనుపమానమైన సేవలందించిన బిల్లీగ్రాహంగారు తన 99వ యేట 2018 ఫిబ్రవరి 21న కీర్తిశేషులయ్యారు.

■ డా. మండలి బుద్ధప్రసాద్
ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి

కాలం కాలరాయని క్రౌర్యం


కంచికచర్ల హరిజన యువకుని హత్యపై రాజ్యసభలో ఆగ్రహావేశం
యిటువంటి ఉదంతాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని హరిజన సభ్యుల డిమాండ్



దేశవ్యాప్తంగా ప్రతిరోజూ ఏదో ఒక చోట దళితులు అవమానాలకు, హింసకూ గురవుతూనే ఉన్నారు. యాభై సంవత్సరాల క్రితం విజయవాడ సమీపంలోని కంచికచర్ల గ్రామంలో దళిత యువకుడు ఆరుకట్ల కోటేశ్వరరావు సజీవ దహనానికి గురైన సంఘటనను చరిత్రలో రికార్డు చేయాలి. ఆ సంఘటనపై పెల్లుబికిన నాటి ఉద్యమ స్ఫూర్తిని నేటి యువత స్వీకరించాలి.

ఒక వైపు నక్సల్బరీ ఉద్యమం బెంగాల్‌లో జీవం పోసుకుంటోంది. మరోవైపు శ్రీకాకుళంలో దాని ప్రకంపనలు కనబడసాగాయి. తెలుగునాట నక్సలైట్ ఉద్యమం వేళ్ళూనుకోవడానికీ, ఆ తర్వాత దళితులు అందులో ఎక్కువగా భాగస్వామ్యం కావడానికీ ప్రధాన కారణం కృష్ణాజిల్లా 'కంచికచర్ల'లో జరిగిన సంఘటన. దొంగతనం చేశాడనే ఆరోపణతో గుంజకు కట్టేసి 'కోటేశు' అనే దళితుణ్ణి సజీవంగా దహనం చేసిన దారుణ ఘటన అది. ఈ ఉదంతం పార్లమెంటులో ప్రకంపనలు సృష్టించింది. రాజ్యసభ, లోక్‌సభల్లో సభ్యులు ఈ విషయమై ప్రత్యేకంగా చర్చించారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, హోంమంత్రి చవాన్‌లు సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ, కఠిన చర్యలు తీసుకుంటామని ఉభయ సభల్లో హామీ ఇచ్చారు. అనంతరం కేంద్రమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ కంచికచర్లను సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వ్యక్తిగతంగానూ, ప్రభుత్వపరంగానూ ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దళితుడైన కంచికచర్ల (ఆరుకట్ల) కోటేశ్వరరావుని ఇత్తడి చెంబు, వంట సామాగ్రి దొంగతనం చేశాడనే నేరం మోపి గ్రామస్థులంతా కలిసి చెట్టుకు కట్టేసి సజీవ దహనం చేసినారు. ఈ సంఘటన 1968 ఫిబ్రవరి 24న జరిగింది. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోటేశు ఫిబ్రవరి 26న చనిపోయిండు. 'దిగంబర కవులు' ప్రచురించిన తమ చివరి, మూడో సంపుటాన్ని 'అగ్రకుల దురహంకారా'నికి బలయిన కంచికచర్ల కోటేశుకు అంకితమిచ్చినారు. "ఈ దేశంలో ఇరవయ్యేళ్ళ స్వాతంత్ర్యంలో భయంకరంగా విజృంభించిన కుల మత దురహంకారానికి, ధనమదంతో యథేచ్ఛగా ప్రజాస్వామ్యాన్ని వాడుకుంటున్న గూండాయిజానికి, సినిమా రొంపిలో ఈదులాడుతున్న యువతరం బలహీనతకి, స్తోత్రపాఠాల కుడితిలో పడిపోయిన పత్రికాలోకం పడుపు జీవనానికి, అతీత జీవనానికి తప్పించుకు బతుకుతున్న మేధావుల అనాసక్తతకి, నాయకుల ఊసరవెల్లి ఆదర్శాలకి, పదవీ వ్యాపారాలకి, నేటి ఈ కుష్ఠు వ్యవస్థకి క్రూరంగా బలైన 'కంచికచెర్ల కోటేశు స్మృతిలో'" అని అంకితంలో పేర్కొన్నారు.

కోటేశ్వరరావు సొంతూరు కంచికచర్లకు సమీపంలోని పరిటాల. ఈయన తండ్రి అక్కడికి సమీపంలోని ఏటూరు నుంచి వచ్చి స్థిరపడ్డాడు. 1968 జనవరిలో తండ్రి చనిపోవడంతో కుటుంబ భారం కోటేశ్వరరావుపై పడింది. 20 ఏండ్ల వయసులో కోటేశు కంచికచర్లలోని నన్నపనేని ఆదెమ్మ దగ్గర గేదెలకు మేత వేయడానికి, కొట్టం ఊడ్వడానికి, పాలు పితకడానికి జీతం కుదిరాడు. రోజూ రెండు పూటలా పాలు పితికి అదే ఊరిలోని 'గంటాల' హోటల్‌లో పోసే పనిచేసేవాడు. ఒక మాదిగాయిన ఇట్లా కలుపుగోలుగా ఉండడం అగ్రకులాల వాండ్లు జీర్ణించుకోలేక పోయారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం బాగాలేక పోవడంతో 1968 ఫిబ్రవరి 16న ఆదెమ్మకు చెప్పి సొంతూరు పరిటాలకు వెళ్ళిండు. అనారోగ్యంతో అక్కడే వారం రోజులుండి, ఆరోగ్యం మెరుగు పడకపోయినప్పటికీ యజమానురాలు తిడుతుందనే భయంతో తన ఊరి నుంచి వచ్చేసిండు. అయితే వచ్చి రావడంతోనే ఆదెమ్మ 'ఇన్ని రోజులు ఎక్కడికెళ్ళినావ్' అని కోటేశుని తిట్టడం ప్రారంభించింది. అదే సమయంలో నన్నపనేని వెంకటేశ్వరరావు పాల చెంబు పోయిందని చెబుతూ, ఆ నేరాన్ని కోటేశు మీద మోపిండు. అంతేగాదు చెంబుని గంటాల హోటల్‌లో అమ్మేసి భోజనం చేసిండని ఆరోపించినారు. చెంబు విషయం తనకేమీ తెలియదని కోటేశు ఎంత చెబుతున్నా వినిపించుకోకుండా ఆదెమ్మ కుటుంబ సభ్యులు, అదే గ్రామానికి చెందిన జొన్నలగడ్డ చిన్ని ఇంకా చెప్పాలంటే ఊరు ఊరంతా 'చెంబు ఎక్కడ పెట్టినావో/అమ్మినావో చెప్పు' అంటూ బెదిరించడం ప్రారంభించారు. కోటేశు తనకు ఏ పాపం తెలియదు అని ఎంత మొత్తుకున్నా వినిపించుకోలేదు. 'వీన్ని ఇలా కాదు చెట్టుకు కట్టేయండి' అని ఆదెమ్మ చెప్పడంతో కోటేశ్వరరావు కట్టేసిండు. రెండు రెక్కలు వెనక్కి విరిచి చెట్టుకు కట్టేసింద్రు. జొన్నలగడ్డ చిన్ని కిరోసిన్ తీసుకొచ్చి కోటేశుపై గుమ్మరించిండు. జొన్నలగడ్డ మధు అనే వ్యక్తి అగ్గిపుల్లలు గీసి మీదెయ్యడం ప్రారంభించిండు. ఈ పుల్లలు గాలికి వెంటనే ఆరిపోతున్నాయి. మరోవైపు కోటేశు ఎంత మొత్తుకున్నా భూస్వాములెవరు పట్టించుకోలేదు. సానుభూతి చూపలేదు. అగ్గి పెట్టెలోని ఆఖరి పుల్లను జాగ్రత్తగా గీసి జొన్నలగడ్డ మధు కిరోసిన్‌తో తడిసిన కోటేశు మీద వేసిండు. అది భగ్గున అంటుకుంది. కొంచెం సేపటికి తాళ్ళు కాలిపోవడంతో కోటేశు గ్రామంలోని పిడికిటి వెంకటేశ్వరరావు క్లినిక్‌కు పరిగెత్తినా అక్కడెవరూ పట్టించుకోలేదు. ఆఖరికి పోలీసులు కోటేశుని మొదట నందిగామ ఆస్పత్రికి ఆ తర్వాత విజయవాడకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఫిబ్రవరి 26న మృతి చెందినాడు. అంతకన్నా ముందు నందిగామ పోలీసులకు ఒకవైపు కాలిన గాయాలతో బాధ పడుతూనే తనపై ఎవరెవరు దాడి చేసిందీ, దాడికి దారి తీసిన పరిస్థితులేవైనవీ తదితర వివరాలన్నీ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఈ సంఘటనను ప్రజల మధ్యకు తీసుకొచ్చి పోరాటం చేసింది పరిటాల గ్రామానికి చెందిన వేముల జార్జి. ఈయన అప్పటికే చదువుకున్న దళితుడు. టీచర్‌గా పనిచేసేవాడు. సంఘటన జరిగిన తర్వాత జార్జి చందాలు వసూలు చేసి ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ సంస్థకు, ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి, కేంద్ర హోంమంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ, తమకు న్యాయం చేయాలంటూ టెలిగ్రామ్‌లు పంపించాడు. ఆనాడు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈ వార్తను ప్రముఖంగా ప్రకటించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇదొక పెద్ద వార్తయింది. 'హరిజన ఐక్యవేదిక'ను ఒకటి ఏర్పాటు చేసి దాని తరపున కొన్ని కార్యక్రమాలు నిర్వహించాడు. కాసు బ్రహ్మానందరెడ్డి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించినాడు. బహుశా దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రధానమంత్రి, దేశ హోంమంత్రి, ప్రతిపక్ష నాయకులు అందరూ ఈ సంఘటనను ఖండించడమే గాకుండా, బాధ్యుల్ని అరెస్టుచేసి కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటామని లోక్‌సభలోనూ, రాజ్యసభలోనూ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కోటేశు తల్లిదండ్రులు శేషమ్మ, ఆరుకట్ల పున్నయ్య. కొడుకులు కోటేశు, నరసింహం, కుమార్తె రోజామణి వారి సంతానం. తండ్రి చనిపోయిన తర్వాత ఇంటికి పెద్దవాడయిన కోటేశుపై కుటుంబ భారం పడింది. జీవిక కోసం కంచికచర్లలోని నన్నపనేని ఆదెమ్మ దగ్గర జీతానికి కుదురుకున్నాడు. కంచికచర్లలోనే ఈ దారుణ ఘటన చోటుచేసుకున్నది. తల్లి కండ్లముందటనే ఊరందరూ చూస్తుండగానే జరిగిన ఈ సంఘటనపై ఆనాటి పత్రికలు రిపోర్టు చేయలేదు. అయితే ఈ విషయం పార్లమెంటులో చర్చనీయాంశం కావడంతో అనివార్యంగా వాటిని రిపోర్టు చేసినాయి. పార్లమెంటులో హోంమంత్రి వై.వి.చవాన్ చేసిన ప్రకటనను ఆనాడు దాదాపు అన్ని పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. వాటిలో ఇలా ఉన్నది: "'కృష్ణాజిల్లా కంచికచర్ల గ్రామస్థులు, గత ఫిబ్రవరి నెలలో ఒక హరిజన కుర్రవాడు, కొన్ని ఇత్తడి పాత్రలు దొంగిలించాడని అతన్ని ఒక గుంజకు కట్టి, కొట్టి బట్టలకు నిప్పుపెట్టి అతని మృతికి దారితీసిన సంఘటన అతివిషాదకరమైనది. సిగ్గు చేటైనది, కిరాతకమైనది' అని రాజ్యసభ సభ్యులు తీవ్రమైన ఆగ్రహ విస్ఫులింగాలు విరజిమ్మారు. ఈ సంఘటనపై తీవ్రమైన దర్యాప్తు జరపవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తాను గట్టిగా చెప్పగలనని స్వయంగా తాను ఈ విషయాన్ని పరిశీలించగలనని హోం మంత్రి చవాన్ ఆగ్రహపూరితులైన సభ్యులకు హామీ ఇచ్చారు.

"శ్రీ కోట పున్నయ్య స్వల్ప వ్యవధి ప్రశ్నకు చవాన్ సమాధానమిస్తూ 'కృష్ణాజిల్లా కంచికచర్ల గ్రామస్థులు ఒక హరిజన కుర్రవాణ్ణి ఇత్తడి పాత్రలు దొంగిలించాడని పట్టుకున్నారు. అతడు ఆ ఇత్తడి పాత్రలు అమ్మిన హోటల్‌కు ఇతన్ని తీసుకువెళ్ళి ఆపాత్రలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత గ్రామస్తులు ఆ కుర్రవాణ్ణి ఒక పందిరి వద్దకు తీసుకెళ్ళి అతన్ని పందిరి గుంజకు కట్టి కొట్టారు. అతని కట్టుబట్టలకు నిప్పుపెట్టడం వల్ల అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తరువాత ఆ హరిజన బాలుడు పోలీసుస్టేషన్‌కు వెళ్ళి ఈ అన్యాయాన్ని గురించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు 320 ఐపిసి క్రింద కేసు నమోదు చేసుకొని అతన్ని నందిగామ ఆస్పత్రికి పంపించారు. అక్కడి నుంచి అతన్ని చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఫిబ్రవరి 26న ఆ హరిజన కుర్రవాడు మరణించాడు. ఈ ఘోరానికి పాల్పడ్డ గ్రామస్థులు తప్పించుకుని తిరుగుతున్నారు. వారి పత్తా దొరకలేదు. వారిని పట్టుకోడానికి తీవ్రమైన గాలింపు జరుగుతున్నది' అని ప్రకటించాడు."

లోక్‌సభలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ మాట్లాడుతూ "అత్యంత దారుణమైన సంఘటన, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. నిందితులను తొందరలోనే పట్టుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని" ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మాయని ఈ గాయానికి 50 ఏండ్లు నిండాయి. ఇప్పటికీ దేశమంతటా రోజూ ఏదో ఒక చోట దళితులు అవహేళనకు, హింసకు గురవుతూనే ఉన్నారు. ఈ సందర్భంగా 50 ఏండ్లక్రితం సంఘటనలను చరిత్రలో రికార్డు చేయాల్సిన అవసరమున్నది. ఆనాటి పోరాట పటిమ ఈనాటి తరానికి స్ఫూర్తిగా నిలవాలి.

■ సంగిశెట్టి శ్రీనివాస్

(కంచికచర్ల కోటేశు సజీవ దహనం ఫిబ్రవరి 24, మరణం ఫిబ్రవరి 26, 1968)

పక్కదారి పడుతున్న రిజర్వేషన్లు

స్వాతంత్ర్యానంతరం ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కోసం రిజర్వేషన్ల విధానం అమలులోకి వచ్చింది. అయితే ఈ రిజర్వేషన్ల అమలు వివిధ ఆటంకాల మధ్య సత్ఫలితాలు సాధించలేకపోతోంది. రాజ్యాంగం నిర్దేశించిన దళిత, గిరిజన రిజర్వేషన్లు సక్రమంగా అమలు కాకపోయేందుకు నియంత్రణ లేని మాతమార్పిడులే కారణం. దళిత, గిరిజన రిజర్వేషన్ విధానాన్ని నియమ నిబంధనల ప్రకారం అమలు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకత పాటించకపోవడంతో విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. నిజమైన దళిత, గిరిజన వర్గాలకు దక్కాల్సిన రిజర్వేషన్లను మతం మారిన వారు అక్రమంగా దక్కించుకొంటున్నారు. ఇందులో మిషనరీల పాత్ర కీలకంగా ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణ జరపకుండానే రెవిన్యూ అధికారులు దళిత, గిరిజన కుల ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాల్లోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా మతంమారిన వారు దళిత, గిరిజన కుల ధృవీకరణ పత్రాలతో ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలోని ఓ రిజర్వ్‌డ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, తాను క్రైస్తవ మతానికి చెందిన వ్యక్తినని తన పెళ్లి క్రైస్తవ మత సంప్రదాయాల ప్రకారం జరిగిందని ఓ బహిరంగ సభలో చెప్పుకొన్నారు. చట్టసభల ఎన్నిలలోనే పరిస్థితి ఇలా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితి ఊహించవచ్చు. రాష్ట్రం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు మతంమారిన క్రైస్తవులకు దక్కేలా జి.ఓ.25 జారీ చేసి నిజమైన దళిత, గిరిజనులను మోసం చేస్తోంది.

మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలో కొండ నరేష్ అనే సామాజిక కార్యకర్త, ఆ మండలంలో ఎన్ని చర్చిలు ఉన్నాయి? ఎంతమంది క్రైస్తవులు ఉన్నారు? ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వారు లబ్ధిదారులుగా ఉన్నారా? అని రెవిన్యూ అధికారులకు సమాచార హక్కు చట్టం కింద సమాధానం కోసం దరఖాస్తు చేశారు. దానికి సంబంధిత అధికారులు.. మండలంలో 19 చర్చిలు, 8మంది క్రైస్తవులు ఉన్నారని సమాధానమిచ్చారు. ఒక గ్రామంలో చర్చి నిర్మాణం జరగాలంటే కనీసం 30 కుటుంబాలు క్రైస్తవులుగా ఉండాలి. మరి, ఇక్కడ 19 చర్చిలకు గాను 8 మంది క్రైస్తవులు ఎలా ఉంటారు? ఇప్పటివరకు ప్రభుత్వం వద్ద క్రైస్తవ జనాభా ఎంతో లెక్కలు లేవు. చర్చిలకు పాలకమండళ్లు లేవు. చర్చిల నిర్వహణ, చట్టబద్ధతపై మైనారిటీ శాఖ వద్ద ఎలాంటి సమాచారం లేదు. మతంమారిన క్రైస్తవులను గురించే ప్రయత్నం ప్రభుత్వం చేయడంలేదు. నిజమైన దళిత, గిరిజనులకు దక్కాల్సిన రిజర్వేషన్లను ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టించి వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాయి.

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ద్వారా జీవం పోసుకున్న రిజర్వేషన్ల విధానం ఎన్నో కోట్లమంది జీవితాలకు దశా దిశా చూపింది. నిజానికి 1935లోనే షెడ్యూల్డ్ కులాలు–తెగల జాబితా తయారై 1936లో రిజర్వేషన్లను బ్రిటీష్ పార్లమెంటు ఆమోదించింది. అప్పుడు కూడా ఆంగ్లేయులు క్రైస్తవులుగా మారిన వారికి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కల్పించలేదు. మతం మారిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తి షెడ్యూల్డ్ కులాల వ్యక్తిగా పరిగణింపబడజాలడని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ 1977లో తీర్పునిచ్చింది. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన షెడ్యూల్డ్ కులాలవారు షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలను పొందజాలరని సుప్రీంకోర్టు 1986లో తీర్పునిచ్చింది. అలాగే విద్యాశాఖ ఉత్తర్వు జి.ఓ.యం.ఎస్ 1973 ప్రకారం.. క్రైస్తవ మతం పుచ్చుకున్న ఎస్సీలు బిసి(సి)గాను, ముస్లిం మతం పుచ్చుకున్న ఎస్సీలు ఎస్సీలు ఓసీలుగా, క్రైస్తవ లేదా ఇస్లాం మతం పుచ్చుకున్న ఎస్టీలు ఓసీలుగా పరిగణింపబడతారు.

నిజమైన దళిత, గిరిజన వర్గాలకు దక్కాల్సిన రిజర్వేషన్లను మతం మారిన వారు అక్రమంగా దక్కించుకొంటున్నారు. ఇందులో మిషనరీల పాత్ర కీలకంగా ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణ జరపకుండానే రెవిన్యూ అధికారులు దళిత, గిరిజన కుల ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు.

రంగారెడ్డిజిల్లా శంషాబాద్‌కి చెందిన గంటీల జాన్ అలియాస్ జానయ్య అనే వ్యక్తి క్రైస్తవుడుగా మతం మారిన తరువాత కూడా షెడ్యులు కులస్తుడుగా చలామణి అవుతున్నట్టు ఫిర్యాదురాగా ప్రభుత్వ యంత్రాంగం విచారణ జరిపి ఎస్సీ సర్టిఫికెట్ తొలగించి బీసీ(సి)సెర్టిఫికెట్ ఇచ్చింది. ఇది చాలా చిన్న విషయంలా కనిపించినప్పటికీ దీనివెనుక అంతర్జాతీయ కుట్రదాగి ఉంది. మతమార్పిడి వల్ల కూడా హిందూ జనాభా తగ్గిపోతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడిన తరువాత ఈ విదేశీ దురాక్రమణ స్వరూపం మారింది. నేరుగా దాడి చేయడానికి అవకాశంలేక పరోక్షపద్ధతులు ఎంచుకుంటున్నారు. హిందువులను క్రైస్తవంలోకి మార్చడం ద్వారా తమ జనసంఖ్యను పెంచుకొనే ప్రయత్నం చేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల, తెగల రిజర్వేషన్లతో అనుభవించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్ మెంట్, బ్యాంక్ రుణాలు, ఉద్యోగాలు, కార్పొరేషన్ రుణాలు, రిజర్వుడ్ స్థానాలలో పోటీ, దళిత, గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర చేపడుతున్న పథకాలలో రిజర్వేషన్లను హిందూ ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే వర్తింపచేయాలి. లేనిపక్షంలో రాబోయేరోజుల్లో తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

■ కొట్టె మురళీకృష్ణ
బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, కరీంనగర్

జనవాక్యం

గ్రామాల నుంచి పట్టణాలకు వలసలను నివారించాలి!

భారతదేశంలో రోజురోజుకు గ్రామాల నుండి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయని జాతీయ నమూనా సర్వే (ఎన్ఎస్ఎస్) జనాభా అధ్యయనాలు తెలుపుతున్నాయి. 2011 జనగణన, రైలు రవాణా సమాచారం, వివిధ ప్రాంతాల్లో వయోవర్గాల జనాభాలో వచ్చిన మార్పులు వలసల వెల్లువను నిర్ధారిస్తున్నాయి. గత పదేళ్ళలో అనేక రాష్ట్రాల్లో ఆర్థిక కారణాల వల్ల పట్టణాలకు జనం తరలిపోతున్నట్లు స్పష్టీకరించాయి. 2001–2011 మధ్య మొత్తం అంతరాష్ట్ర వలసదారుల సంఖ్య 5కోట్లు. అంటే ఏడాదికి కనీసం 5లక్షల మంది వలసపోయారన్న మాట. ప్రధానంగా దుర్భిక్ష, వరద పీడిత ప్రాంతాల నుంచి, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి వలసలు వెల్లువెత్తుతున్నాయి. తరచు రాజకీయ, సాంఘిక సంఘర్షణలకు లోనయ్యే ప్రాంతాల నుంచి కూడా ఎక్కువ మంది వలసపోతుంటారు. పేదరికం; స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడం; పట్టణాల్లో, ఇతర రాష్ట్రాల్లో పని దొరికే అవకాశం... ఇవన్నీ కలిసి గ్రామీణ జనాభాను వలసలకు ప్రేరేపిస్తున్నాయి. మనదేశంలో బిహార్, అస్సాం, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వలసలు అధికం. వలస కార్మికుల ప్రయోజనాల రక్షణకు 1989లోనే ఒక చట్టం అమలులోకి వచ్చింది. దీన్ని అంతరాష్ట్ర వలస కార్మిక చట్టంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అమలుచేయడానికి ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకొంటున్న దాఖలా లేదు. ఉపాధి అవకాశాల గురించి సమాచారం గానీ, బేరమాడే శక్తి గానీ, లేకపోవడంతో తక్కువ వేతనాలిచ్చే ప్రమాదకర పనులతో వలసదారులు నెట్టుకురావలసి వస్తుంది. వలసవచ్చిన కూలీలు స్థానికుల దౌర్జన్యానికి, ప్రాంతీయ దురభిమానాలకు తేలిగ్గా ఎర అయ్యే ప్రమాదముంది. పట్టణ కార్మిక విపణుల్లో వీరికి ఆహారం, నివాసం, వైద్యం, విద్య వంటి కనీస వసరులూ కరువే! స్థానిక సంస్థలు గానీ, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ ఈ వలస కూలీల గురించి పట్టించుకోవడం లేదు. ఉదాహరణకు– ఒడిశా నుండి వలస వచ్చి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులను చూడండి. వలస కూలీలకు మూల రాష్ట్రాలయిన బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు కలిసి వలస కూలీల ప్రయోజనాలను రక్షించాలి. వారికి కనీస వేతనం, భీమా తదితర సౌకర్యాలను కల్పించేలా చూడాలి. దేశ ప్రగతికి కార్మిక వలసలు అవసరం కాబట్టి ఇవి ఇప్పట్లో ఆగవు. వీరు జాతీయాదాయ వృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారు. పూర్తిగా వలస కూలీలతోనే నిర్మితమైన కొచ్చి మెట్రో రైలు ప్రాజెక్టును ఇందుకు ఒక ఉదాహరణ. ఈ వలసలను ఆపాలంటే వ్యవసాయరంగంలో నూతన విప్లవాత్మక మార్పులు తక్షణమే రావాలి.

– శ్రీనివాస్ చిరిపోతుల
తెలంగాణ సామాజిక రచయితల సంఘం, జయశంకర్ భూపాల పల్లి జిల్లా.

సింగరేణి కార్మికులకు వడ్డీ లేని రుణం

10 లక్షల రుణంతో సొంతింటి నిర్మాణం.. ఏడాదికి వడ్డీ భారం రూ.130 కోట్లు.. సింగరేణి బోర్డు నిర్ణయం

హైదరాబాద్/కొత్తగూడెం/మంచిర్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు శుభవార్త. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు.. కార్మికుల సొంతింటి కల నెరవేరనుంది. వడ్డీ లేకుండా రూ. 10 లక్షల రుణం అందనుంది. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్ అధ్యక్షతన జరిగిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం.. సింగరేణి కార్మికులు ఎవరైనా సొంతింటి నిర్మాణం కోసం బ్యాంకు నుంచి తీసుకునే 10 లక్షల రుణానికి వడ్డీ యాజమాన్యమే చెల్లిస్తుంది. ఇప్పటికే గృహ నిర్మాణం కోసం రుణం పొందిన కార్మికులకూ ఈ పథకం వర్తిస్తుంది. ఇప్పటికే రుణం తీసుకున్న కార్మికులు చెల్లించిన వడ్డీ వివరాలను తెప్పించుకొని రీయింబర్స్ చేస్తారు. వడ్డీ కోసం సింగరేణి యాజమాన్యం ఏడాదికి సుమారు రూ. 130 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. కార్మికులకు వడ్డీ లేని రుణ పథకం కోలిండియా సహా దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థలోనూ లేదని సీఎండీ శ్రీధర్ చెప్పారు. ఈ సమావేశంలో బొగ్గు మంత్రిత్వశాఖ డైరెక్టర్లు జేఎస్ బింద్ర, సబూద్ అహ్మద్, రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, సింగరేణి డైరెక్టర్లు పవిత్రన్‌కుమార్, బి.భాస్కరరావు, చంద్రశేఖర్, ఎస్.శంకర్‌లు పాల్గొన్నారు.



సీఎం హామీలు ఒక్కొక్కటిగా అమలు: సీఎండీ

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను సింగరేణి యాజమాన్యం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని సంస్థ సీఎండీ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రయోజనాలను గురించి అందులో వివరించారు.

» ఉద్యోగం వద్దనుకునే కార్మికులకు 'మెడికల్ అన్‌ఫిట్' కింద రూ. 25 లక్షలు ఒకేసారి చెల్లిస్తున్నారు. ఇది వద్దనుకునే వారికి నెలకు రూ. 25 వేల చొప్పున అందజేస్తున్నారు. ఇప్పటికే వంద మందికి పైగా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు.

» కార్మికుల గృహ నిర్మాణం కోసం రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నారు.

» సింగరేణి ఉద్యోగుల తల్లిదండ్రులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారు.

» తొలి దశ రూ. 15 కోట్లతో కార్మికుల ఇండ్లకు ఏసీ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



సీఎండీ శ్రీధర్

» అంబేడ్కర్ జయంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు జీతంతో కూడిన సెలవు దినాలు అమలు చేస్తున్నారు.

» ఐఐటీ, ఐఐఎంలలో ఉన్నత చదువులు చదువుతున్న కార్మికుల పిల్లలకు పూర్తిస్థాయి ఫీజులు చెల్లిస్తున్నారు.

» అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో క్యాంటీన్లను ఆధునీకరించి, నాణ్యమైన తినుబండారాలను నామమాత్రపు ధరకు అందిస్తున్నారు.

» 2016 జూలై 31 నాటికి ఉన్న అర్హతల ప్రకారం 2718 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరించారు.

» ఆరు కొత్త బొగ్గు బావుల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు.

» సింగరేణిలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, డిపెండెంట్ కోటా కింద 7200 మందికి ఉద్యోగాలు కల్పించారు.

» గతంలో లాభాల బోనస్ 18% మాత్రమే ఉండగా, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 2014-15లో 21 % పెంచి రూ. 102 కోట్లు, 2015-16లో 23% పెంచి రూ. 245 కోట్లు చెల్లించారు. 2016 - 17లో 25% పెంచి చెల్లించారు.

» పండుగల అడ్వాన్స్ రూ. 10 వేల నుంచి రూ. 25 వేలకు పెంచారు.

» ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు యాజమాన్యం చెల్లించే మ్యాచింగ్ గ్రాంట్ పది రెట్లు పెంచారు. విధి నిర్వహణలో ఉండి సహజ మరణం పొందితే ఆయా కార్మికుల కుటుంబాలకు ఇచ్చే మ్యాచింగ్ గ్రాంటును రూ. 75 వేల నుంచి రూ. 7,50,000కు పెంచారు.

» మహిళా ఉద్యోగినులకు అభ్యర్థన మేరకు రిటైర్‌మెంట్ స్కీం 2015ను అమలు జరుపుతున్నారు. మహిళా ఉద్యోగినులకు ఇప్పటివరకు 12 వారాల ప్రసూతి సెలవులు ఉండగా, వాటిని 26 వారాలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. చైల్డ్ కేర్ లీవ్ ఇచ్చేందుకు అంగీకరించారు.

» తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాల్గొన్న సింగరేణి కార్మికులకు తెలంగాణ ఇంక్రిమెంట్‌ను 2014 ఆగస్టు నుంచి అమలుచేస్తున్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయకుంటే ఉద్యమమే

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య



కవాడిగూడ/హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం దోమలగూడ గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాలలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథకు 45 వేల కోట్లను కేటాయించారని, అవే నిధులను పరిశ్రమలకు కేటాయిస్తే లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు వచ్చేవన్నారు. రాష్ట్రంలో 15 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, ఇంత వరకు గ్రూప్ - 1, 3, 4 నోటిఫికేషన్ జారీ చేయలేదని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో అదనంగా 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్త వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్ని నిరుద్యోగ సంఘాలతో హైదరాబాద్‌లో ఏప్రిల్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశానికి నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షత వహించగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొద్దు నిద్రలో టీఆర్ఎస్ సర్కారు: చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించకుండా టీఆర్ఎస్ సర్కారు మొద్దు నిద్ర పోతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సబ్‌ప్లాన్ అమలుకు నోచుకోవటం లేదని, రిజర్వేషన్లు పెంచే దిశగా చర్యలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. సమన్వయ సమితులతో రైతులకు ఎలాంటి మేలు జరగదని అభిప్రాయపడ్డారు. మాదిగలు చేస్తున్న వర్గీకరణ ఉద్యమంపై నిర్లక్ష్యం తగదని సీఎం కేసీఆర్‌కు హితవు చెప్పారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటున్న కేసీఆర్.. వర్గీకరణ కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకుపోవటం లేదని నిలదీశారు. ఢిల్లీ స్థాయిలో సీపీఐ నేత డి.రాజా ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తున్నారని, మార్చి 13 నాటి ఎమ్మార్పీఎస్ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. దేశ సంపదను ప్రజలందరూ అనుభవించాలన్న ఆశయంతో పనిచేస్తున్న కమ్యూనిస్టులను అవకాశం దొరికినప్పుడల్లా కాల్చిచంపుతున్న కేంద్రం... బ్యాంకులను లూటీ చేసి విదేశాలకు పారిపోతున్న వారికి రక్షణ కల్పిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీఎస్.బోస్ విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజలు శిక్షించే రోజులొస్తాయని ఓ ప్రకటనలో హెచ్చరించారు.

ప్రేమ్‌సాగర్‌కు షరతులతో ముందస్తు బెయిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుకు హైకోర్టు శుక్రవారం షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తునకు సహకరించాలని, రోజూ దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని న్యాయమూర్తి జస్టిస్ టి.రజని షరతు విధించారు. ఎస్టీ జాబితా నుంచి లాంబాడీలను తొలగించాలంటూ ఆదివాసీలు చేస్తున్న ఉద్యమానికి ఆర్థికంగా సహకరించారన్న ఆరోపణలపై ప్రేమ్‌సాగర్‌రావుపై పలు కేసులు నమోదయ్యాయి. రాజకీయ కారణాలతోనే ప్రేమ్‌సాగర్‌పై కేసులు నమోదు చేశారని, ఈ కేసుల దర్యాప్తు పూర్తయ్యిందంటూ కిందికోర్టుకు దర్యాప్తు అధికారి నివేదించారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు.

ప్రాజెక్టుల అధ్యయనానికి కర్ణాటక జర్నలిస్టులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్‌భగీరథతో పాటు సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించేందుకు కర్ణాటక జర్నలిస్టుల బృందం మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ఫిబ్రవరి 26 సోమవారం హైదరాబాద్‌కు ఈ బృందం చేరుకుంటుంది. 27వ తేదీ ఉదయం గజ్వేల్ కోమటిబండలో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను పరిశీలించనుంది. మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకుని తెలంగాణ మీడియా అకాడెమీ ఆధ్వర్యంలో దివంగత జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో పాల్గొననున్నారు. మూడో రోజు సుందిళ్ల బ్యారేజీ, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి పంపు హౌస్‌ను పరిశీలించనున్నారు.

రుణం డబ్బులు ఇవ్వనన్న మేనేజర్!

» బ్యాంకు ఎదుట మహిళల నిరసన

మద్దూరు, ఫిబ్రవరి 23: బ్యాంకు ఖాతాల్లో జమయిన రుణం డబ్బులను ఇవ్వడానికి బ్యాంకు మేనేజర్ నిరాకరించడం వివాదాస్పదమైంది. మెదక్ జిల్లా మద్దూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో ఈ సంఘటన జరిగింది. బాధిత ఖాతాదారులు తెలిపిన వివరాల ప్రకారం.. లద్నూరు గ్రామానికి చెందిన దీపిక సం ఘం సభ్యులు జనగామ జిల్లా బచ్చన్నపేట ఏపీజీవీబీ నుంచి రూ. 5 లక్షల వ్యక్తిగత రుణాన్ని పొందారు. పొదుపు సంఘంలోని 10 మంది సభ్యులు మద్దూరులోని ఏపీజీవీబీలోని ఖాతాల్లోకి డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఒక్కొక్కరి పేరు మీద రూ. 50వేలు ఈ నెల 22న వారి ఖాతాల్లో జమయ్యాయి. శుక్రవారం బ్యాంకు లో డబ్బు డ్రా చేసుకోవడానికి వెళ్లగా బ్యాంకు మేనేజర్ తిరస్కరించి తమ బ్యాంకులో డబ్బులు ఎవరు వేయమన్నారని ప్రశ్నించారు. బయటకు గెంటేసి గేటుకు తాళం వేసుకున్నారని వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్ రాందాసును 'ఆంధ్రజ్యోతి' వివరణగా, బ్యాంకులో నగదు తక్కువగా ఉండటంతో రూ. 10 వేల కంటే ఎక్కువ ఇవ్వలేమని చెప్పామన్నారు. వాళ్లను బయటకు వెళ్లగొట్టలేదన్నారు.

సింగరేణి ప్రయివేటీకరణకు కుట్ర: టీఎన్‌టీయూసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్రం తక్షణం ఉపసంహరించుకోవాలని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు బి.ఎన్.రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రయివేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. శుక్రవారం ఎన్టీఆర్‌భవన్‌లో ఆయన మాటాడారు.

బీఏ ఉర్దూ పుస్తకాల ఆవిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఏ రెండో సంవత్సరం ఉర్దూ మీడియం పుస్తకాలను విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి శుక్రవారం ఆవిష్కరించారు. నాంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ సమీనా బషీర్ ఈ పుస్తకాలను రచించారు. గతేడాది బీఏ హిస్టరీ మొదటి సంవత్సరం పుస్తకాలను విడుదల చేయగా.. ఈ యేడాది రెండో సంవత్సరం పుస్తకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

తెలంగాణలో 'కాళేశ్వరం' కలికితురాయి

» శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్

భూపాలపల్లి/ హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ చరిత్రలో మరో కలికితురాయిగా నిలిచిపోతుందని శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో గోదావరిపై నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌస్ పనులను శుక్రవారం డిప్యూటీ సీఎం మహమూద్ అలీతోపాటు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేడిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ కేవలం చైనాలో మాత్రమే ఇలాంటి ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుందని, అదే తరహాలో తెలంగాణలో ప్రాజెక్టు నిర్మించడం గొప్ప విషయమన్నారు. శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ నేతృత్వంలో 23 మంది ఎమ్మెల్సీలు హైదరాబాద్ నుంచి నేరుగా భూపాలపల్లికి చేరుకున్నారు. బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టును అందరూ ప్రశంసిస్తున్నారని, ఆ ప్రాజెక్టు పనులను స్వయంగా చూశాకే తమ పార్టీ తరపున స్పందిస్తామన్నారు.



మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న స్వామిగౌడ్, ఎమ్మెల్సీలు

అంగరంగ వైభవంగా కలెక్టర్ ఆమ్రపాలి విందు



కలెక్టర్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

» హాజరైన ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 23: వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి కాట, ఐపీఎస్ అధికారి సమీర్ శర్మ వివాహ విందు అంగరంగ వైభవంగా జరిగింది. వరంగల్ అర్బన్ కలెక్టరేట్‌లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన విందుకు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. సుమారు 600 మందికి ఆహ్వాన పత్రాలు అందినట్లు సమాచారం. సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఓరుగల్లు చరిత్ర, కట్టడాల ప్రతిష్ఠను కళ్ళకు కట్టేలా ఉన్నాయి. విందుకు ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంత రావు, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్ రావు, దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అధికారులు హాజరయ్యారు.



స్వామికి హారతి నివేదిస్తున్న చిన్నజీయర్ స్వామి

నృసింహ క్షేత్రాలకు శిరో భూషణం యాదాద్రి

» చిన్న జీయర్ స్వామి

యాదాద్రి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోని నారసింహ క్షేత్రాలకు స్వయంభూ యాదాద్రి దివ్యక్షేత్రం శిరోభూషణంగా నిలుస్తోందని వైష్ణవ పీఠాధిపతి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ప్రవచించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయన శుక్రవారం యాదాద్రి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారి జగన్మోహినీ అలంకార సేవను దర్శించుకుని హారతిని నివేదించారు. అంతకు ముందు ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. రాబోయే విలంబి నామ సంవత్సరంలో మూడో ముఖ్య ఘట్టం జరగనుందని చెప్పారు. విలంబి నామ సంవత్సరంలోనే శ్రీరాముడు జన్మించారని, శ్రీనివాసుడి కల్యాణం ఈ సంవత్సరంలోనే జరిగిందని, యాదాద్రి గర్భాలయంలో నారసింహుడి మూలమూర్తుల దర్శన భాగ్యం కలగనుందని పేర్కొన్నారు.

నాగం రాకను ఆహ్వానిస్తున్నాం

» ఆయన బలమైన నాయకుడు : చిన్నారెడ్డి

» నల్ల కుబేరులకు కొమ్ముకాస్తారా? : వీహెచ్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌లోకి నాగం జనార్దన్‌రెడ్డి రాకను స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. సీఎల్పీలో శుక్రవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. నాగం వంటి బలమైన నాయకుడు కాంగ్రెస్‌లోకి వస్తే రాష్ట్రస్థాయిలోనూ ప్రభావం ఉంటుందని అభిప్రాయపడ్డారు. జైపాల్‌రెడ్డి, నాగంపై ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికలో నాగం సహకరించిన విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. కలిసి వచ్చే వారందరినీ పార్టీలో చేర్చుకోవాలని, కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డిని సైతం పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. తన కంటే రావుల బలమైన అభ్యర్థి అని భావిస్తే, తన సీటును త్యాగం చేసేందుకూ సిద్ధమని ప్రకటించారు. అయితే, రావులకు దేవరకద్ర అనుకూలమైన నియోజకవర్గమని అభిప్రాయపడ్డారు. వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ ఇతర పార్టీ నేతలు వచ్చి చేరుతామంటే కాంగ్రెస్‌లో పుట్టి పెరిగిన నేతలెవరూ వ్యతిరేకించరని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ దేశంలోని నల్ల కుబేరులకు ప్రధాని మోదీ కొమ్ము కాస్తున్నారని దుయ్యబట్టారు. నల్లధనాన్ని వెలికితీసి పేదల ఖాతాల్లో జమ చేస్తానని చెప్పిన మోదీ ఇప్పుడు పేదల డబ్బును అక్రమార్కులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. 'మన్ కీ బాత్'లో అవినీతిపై మాట్లాడాలని డిమాండ్ చేశారు.

మిషన్ అంత్యోదయలో 'ఉపాధి' కీలకం

» 2018-19 నుంచే కార్యాచరణకు కేంద్రం శ్రీకారం

» దేశ వ్యాప్తంగా కోటి కుటుంబాలకు లబ్ధి

» తెలంగాణలో 1,622 గ్రామ పంచాయతీల ఎంపిక

» త్వరలో కో ఆర్డినేషన్, స్టీరింగ్ కమిటీల నియామకం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పేదరికాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించనున్న మిషన్ అంత్యోదయ పథకంలో ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్) కీలకం కానుంది. తొలిదశలో దేశ వ్యాప్తంగా 50 వేల గ్రామ పంచాయతీల్లో సుమారు కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలోని 1,622 గ్రామ పంచాయతీలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం కేటాయించిన ర్యాంకింగ్‌లో తెలంగాణలోని తెల్లాపూర్ దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకున్న విషయం విదితమే. అయితే మిషన్ అంత్యోదయకు ప్రత్యేక నిధులంటూ ఏమీ ఉండవు. వివిధ పథకాల కింద చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో అమలు చేస్తారు. అంత్యోదయ కింద ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఉపాధి పథకం కింద చేపట్టే ప్రత్యేక వ్యూహాలను తెలియజేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో మార్చి నెలలో ఢిల్లీలో జరిగే ఈ సమావేశానికి కావాల్సిన వ్యూహాలను సమర్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

ప్రధాని నేతృత్వంలో గవర్నింగ్ కౌన్సిల్

మిషన్ అంత్యోదయ కార్యాచరణపై గవర్నింగ్ కౌన్సిల్‌కు ప్రధాన మంత్రి నేతృత్వం వహిస్తారు. అన్నిరాష్ట్రాల సీఎంలు సభ్యులుగా ఉంటారు. కేంద్ర కార్యదర్శి నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రుల సారథ్యంలో కో - ఆర్డినేషన్ కమిటీలను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల నేతృత్వంలో స్టీరింగ్ కమిటీలను నియమిస్తారు. జిల్లా, మండల, గ్రామ పంచాయతీ స్థాయిల్లోనూ స్టీరింగ్ కమిటీలు ఉంటాయి.

సంతృప్త స్థాయిలో..

మిషన్ అంత్యోదయ అమలు చేసే పంచాయతీల్లో విద్య, వైద్యం, పౌష్టికాహారం, సాంకేతికత, రహదారులు, విద్యుత్, నైపుణ్యాభివృద్ధి, స్వచ్ఛ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, నీటి పారుదల సౌకర్యం వంటి పథకాలను పూర్తి స్థాయిలో మంజూరు చేస్తారు.

స్టడీ ట్రెండ్స్

స్టెమ్ కోర్సులపై అమ్మాయిల మక్కువ

స్టెమ్ (STEM).. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ కోర్సులకు సంక్షిప్త రూపం. ప్రస్తుతం స్టెమ్ కోర్సులకు దేశంలో మంచి ఆదరణ లభిస్తుంది. ముఖ్యంగా అమ్మాయిలు స్టెమ్ కోర్సులను ఎంచుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు మాస్టర్ కార్డ్ సంస్థ చేసిన సర్వేలో వెల్లడైంది. అధ్యాపకులు, తల్లిదండ్రులు ప్రోత్సహించడడంతోపాటు ఆయా కోర్సులకు సమాజంలో లభిస్తున్న గౌరవం, కెరీర్‌పరంగా అవకాశాలు కూడా విద్యార్థి లోకాన్ని స్టెమ్ వైపు దృష్టి సారించేలా చేస్తున్నాయి. ఈ సర్వేలోని ఆసక్తికరమైన అంశాలు..







ఎంచుకోకపోవడానికి చెప్పిన కారణాలు



- ☆ పురుషులకే ఎక్కువ అవకాశాలు
- ☆ అనాసక్తి
- ☆ సమాజంలో గుర్తింపు లేకపోవడం



ఎందుకు ఎంచుకుంటున్నారు?

- ☆ ఆసక్తి
- ☆ ఎప్పుడు కొత్తగా ఏదో ఒకటి నేర్చుకోవచ్చు
- ☆ కెరీర్‌పరంగా ఉన్నత స్థానాలను త్వరగా చేరుకోవచ్చు
- ☆ ఎక్కువ వేతనాలు

స్టెమ్ ఎందుకు ప్రత్యేకం?

సృజనాత్మకతకు అవకాశం	83%
హార్డ్ వర్క్ చేయవచ్చు	79%
స్వతంత్రంగా పని చేయవచ్చు	78%
ఫన్ లవింగ్ స్వభావం	77%
మ్యాథ్స్‌పై ఆసక్తి	69%
టెక్నాలజీపై ఆసక్తి	66%



6 నెలలు


స్టెమ్ కోర్సులు చేసిన తరవాత ఉద్యోగం రావడానికి పట్టిన సమయం.

31 శాతం

స్టెమ్ కోర్సులు చేసిన వారిలో 31 శాతం మందికి కంప్యూటర్, ఐటీ రంగాల్లో తొలి ఉద్యోగం లభించింది.

21 ఏళ్లు

స్టెమ్ రంగంలో కెరీర్ ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చే సగటు వయసు



39 శాతం

కెరీర్‌పరంగా ఎదగడానికి జెండర్ కీలకంగా ఉంటుందని 39 శాతం మంది అభిప్రాయపడ్డారు.



45 శాతం

స్టెమ్ కోర్సులు మహిళలకు అనువుగా ఉంటాయని 45 శాతం మంది పేర్కొన్నారు.

93 శాతం మంది ఓటు స్టెమ్‌కే

దేశ వ్యాప్తంగా సర్వేలో పాల్గొన్న 12 - 14 ఏళ్ల వయసున్న బాలికల్లో 93 శాతం మంది, 15 - 16 ఏళ్ల వయసున్న బాలికల్లో 81 శాతం మంది, 17 - 19 ఏళ్ల వయసున్న బాలికల్లో 70 శాతం మంది స్టెమ్ కోర్సులకు ఓటేశారు. స్టెమ్ సంబంధిత రంగంలో ఉద్యోగాలు చేయాలనే లక్ష్యంతో 45 శాతం మంది, సబ్జెక్ట్‌పై ఆసక్తితో 42 శాతం మంది, వేతనాలు ఎక్కువ ఉంటాయనే ఆలోచనతో 39 శాతం మంది స్టెమ్ కోర్సుల వైపు ఆకర్షితులవుతున్నారు.

స్టెమ్ ఆదరణకు ప్రధాన కారణాలు

- తల్లిదండ్రుల ప్రోత్సాహం పాఠశాలలో అవగాహన కల్పించడం
- కెరీర్, ఇంటర్న్‌షిప్ పరంగా మహిళలకు పెరుగుతున్న అవకాశాలు
- అన్ని రంగాల్లో పురుషులతో సమాన అవకాశాలు
- ఉన్నత విద్యాపరంగా ఉండే అవకాశాలు



14-15 ఏళ్లు

స్టెమ్ కోర్సులను ఎంచుకోవాలనే నిర్ణయానికి బాలికలు వచ్చే సగటు వయసు

ఇంజనీర్ టాప్

స్టెమ్‌లో ఉండే వృత్తుల పరంగా చూస్తే ఇంజనీర్ టాప్ స్థానంలో ఉంది. దాదాపు 40 శాతం మంది బాలికలు ఇంజనీర్‌గా స్థిరపడటానికి ఇష్టపడుతున్నారు. అందులో 29 శాతం మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఓటేశారు. తరవాతి స్థానాల్లో డాక్టర్ (29 శాతం), సైంటిస్ట్ (24 శాతం) వృత్తులను ఎంచుకోవడానికి ఇష్టపడుతున్నారు.

సర్వే ఇలా

మాస్టర్ కార్డ్ సంస్థ 'గర్ల్స్ ఇన్ టెక్' పేరుతో ఆన్‌లైన్‌లో ఈ సర్వేను చేపట్టింది. ఇండియా, ఆస్ట్రేలియా, చైనా, ఇండోనేషియా, సింగపూర్, మలేషియా దేశాల్లో 12 - 25 ఏళ్ల వయసు ఉన్న బాలికల అభిప్రాయాలతో సర్వే నివేదికను రూపొందించారు.

స్టెమ్ కోర్సులకు దేశంలో క్రమంగా ఆదరణ పెరుగుతోంది. శాస్త్ర పరిశోధన రంగాలకు లభిస్తున్న ప్రాముఖ్యం, ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులు, ప్రత్యేక పథకాలు.. ఇవన్నీ కలిసి సైన్స్ కోర్సులకు డిమాండ్‌ను పెంచుతున్నాయి. దేశ, విదేశాల్లో ఇప్పటికీ ఇంజనీరింగ్ నిపుణులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఉన్నత విద్య పరంగా స్టెమ్ కోర్సుల్లో చాలా స్పెషలైజేషన్స్ ఉంటాయి. వీటన్నిటి వల్ల దేశంలో స్టెమ్ కోర్సులకు ఆకర్షితులవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

భవిష్యత్‌కు కీలకం

2022 నాటికి దేశంలోని జనాభాలో అత్యధిక మంది యువతే ఉంటారు. ఆ సమయంలో దేశాభివృద్ధిలో పురుషులతో సమానంగా మహిళల పాత్ర కీలకంగా మారుతుంది. ప్రస్తుతం సామాజిక, ఆర్థికాభివృద్ధి అనేది టెక్నాలజీ రంగంతో ముడిపడి ఉంది. కాబట్టి మహిళలను శాస్త్రవేత్తలుగా, టెక్నాలజిస్టులుగా, ఇంజనీర్లుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో విద్య నుంచి కెరీర్ వరకు మహిళలకు తగినన్ని అవకాశాలు కల్పించాలి. దీనికి అనుగుణంగా భావితరాలను సిద్ధం చేసే ఉద్దేశంతో ఈ సర్వేను చేపట్టినట్లు మాస్టర్ కార్డ్ సంస్థ పేర్కొంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహం

స్టెమ్ కోర్సులకు బాలికలు ప్రాముఖ్యం ఇవ్వడానికి ప్రధాన కారణం తల్లిదండ్రులు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 46 శాతం మంది స్టెమ్ కోర్సులను ఎంచుకోవడానికి ఇష్టపడుతున్నారు. అధ్యాపకులు, కౌన్సెలర్ల సూచనల మేరకు 13 శాతం మంది బాలికలు స్టెమ్ కోర్సులను ఎంపిక చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. హోం వర్క్, ప్రాజెక్ట్ వర్క్ వంటి అంశాల్లో తల్లిదండ్రులు, అధ్యాపకుల నుంచి లభించే సహాయం స్టెమ్ కోర్సులను అనుకూలం అని అధిక శాతం మంది బాలికలు భావిస్తున్నారు.

38 శాతం మంది అనాసక్తి

సర్వేలో పాల్గొన్న బాలికల్లో 38 శాతం మంది స్టెమ్ కోర్సుల పట్ల అనాసక్తిని ప్రదర్శించడం విశేషం. ఆ రంగాల్లో పురుషుల ఆధిక్యం ఎక్కువ ఉంటుందనే ప్రధాన కారణంతో స్టెమ్ కోర్సులకు ఇష్టపడని వారి సంఖ్య 46 శాతంగా ఉంది. అలాగే తల్లిదండ్రులు ప్రోత్సహించకపోవడంతో స్టెమ్ కోర్సులను ఎంచుకోవడం లేదని 31 శాతం మంది చెప్పారు.

అమెరికాలో డిమాండ్

అమెరికాలో స్టెమ్ రంగంలో నిపుణుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. హయ్యర్ డిగ్రీ స్థాయిలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. దీంతో భవిష్యత్ అవసరాలకు పోటీ పడే విధంగా స్టెమ్ అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తోంది. ముఖ్యంగా బోధన విభాగంలో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. సైన్సెస్, మ్యాథమెటిక్స్‌లలో బోధన సిబ్బందికి మంచి అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి. తరవాతి స్థానంలో పరిశోధన రంగాలు ఉన్నాయి.

జాబ్ కార్నర్

డిప్లొమా ట్రైనీలు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **44**
- పోస్టులు: డిప్లొమా ట్రైనీలు (ఎలక్ట్రికల్) 40, జూనియర్ ఆఫీసర్ ట్రైనీ (హెచ్‌ఆర్) 4
- అర్హత: డిప్లొమా ట్రైనీ పోస్టులకు 70 శాతం మార్కులతో డిప్లొమా (ఎలక్ట్రికల్), జూనియర్ ఆఫీసర్ ట్రైనీ పోస్టులకు 50 శాతం మార్కులతో రెండేళ్ల పీజీ డిప్లొమా (పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఎంఎస్‌డబ్ల్యు) పూర్తిచేసి ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 27 ఏళ్లు
- ఎంపిక: రాత పరీక్ష / కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా. జూనియర్ ఆఫీసర్లకు కంప్యూటర్ స్కిల్ టెస్ట్ కూడా ఉంటుంది.
- రాత పరీక్ష వివరాలు: ఇందులో రెండు పార్టులు ఉంటాయి. పార్టు 1లో సంబంధిత విభాగం నుంచి టెక్నికల్ / ప్రొఫెషనల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఇస్తారు. పార్టు 2లో ఆప్టిట్యూడ్ టెస్ట్ కు సంబంధించిన ఒకాబులరీ, వెర్బల్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డేటా సఫిషియెన్సీ & ఇంటర్‌ప్రిటేషన్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పార్టు 1లో 120 ప్రశ్నలు, పార్టు 2లో 50 ప్రశ్నలు ఇస్తారు. రెండు పార్టులకు కలిపి పరీక్ష సమయం 2 గంటలు ఉంటుంది. ఎంపిక ప్రక్రియలో రాత పరీక్షకు 100 శాతం వెయిటేజీ ఇస్తారు. జూనియర్ ఆఫీసర్లు స్కిల్ టెస్ట్‌లో అర్హత పొందితే చాలు.
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 13
- వెబ్‌సైట్: www.powergridindia.com

మతాల్లో సంస్కరణలు లక్ష్యంగా..


పోటీ పరీక్షల ప్రత్యేకం
హిస్టరీ

హిందూ మత సంస్కరణోద్యమాలు

- **గాంధీజీ:** గాంధీ కుల వ్యవస్థను, అస్పృశ్యతను ఖండించాడు. ఇది ఒక పాపమని చెప్పాడు. గాంధీ వెనకబడిన (దళిత/ నిమ్న/ అణగారిన) వర్గాలవారిని మొదటగా హరిజనులని పిలిచారు.
- **ఆది హిందూ ఉద్యమం:** ఇది జాతీయ స్థాయిలో జరిగిన మొదటి దళిత ఉద్యమం. 'పంచములు' అనే పదాన్ని దళితులకు వాడకుండా ఆది హిందువులుగా పిలవాలని నిర్ణయించారు. ఈ ఉద్యమం ప్రధానంగా కాన్పూర్‌లో జరిగింది. ఈ ఉద్యమాన్ని హైదరాబాద్‌లో 1906లో ఎం. భాగ్య రెడ్డి వర్మ ప్రారంభించారు. ఈయన దళితుల అభివృద్ధికి జగన్ మిత్ర మండలిని స్థాపించారు. ఆల్ ఇండియా ఆది హిందూ మహాసభ లక్నో (1931)లో భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షతన జరిగింది.
- **ప్రజా మిత్ర మండలి (మైసూర్ - 1917):** కట్టమంచి రామలింగారెడ్డి ప్రజామిత్ర మండలిని స్థాపించారు. ఇది మైసూరులో ప్రారంభమైన మొదటి రాజకీయ సంస్థ. బ్రాహ్మణ వ్యతిరేకతకు ఇది వేదికగా నిలిచింది. సిఆర్ రెడ్డి, ఆంధ్రా యూనివర్సిటీకి మొదటి వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. ఈయనకు కళాప్రపూర్ణ అనే బిరుదు ఉంది. ఈయన ముసలమ్మ మరణం, కవితత్వ విచారం, నవయామిని అనే గ్రంథాలను రచించారు.

సిక్కు మత సంస్కరణోద్యమాలు

- **సింగ్ సభ ఉద్యమం (1873 - 74):** ఈ ఉద్యమాన్ని అమృత్‌సర్‌లో సిక్కు నాయకులు ప్రారంభించారు. సిక్కుల్లో పాశ్చాత్య విద్యాభివృద్ధికి ఇది తోడ్పడింది.
- **కుకా ఉద్యమం (1849):** దీన్ని భగవత్ జవహర్‌లాల్ 1849లో ప్రారంభించారు. సిక్కుల సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు ఈ ఉద్యమం కృషి చేసింది.
- **నామ్‌దారీ ఉద్యమం:** ఈ ఉద్యమాన్ని రామ్‌సింగ్ ప్రారంభించారు. విగ్రహారాధనకు వ్యతిరేకంగా శిక్కులు నామాన్ని మాత్రమే జపించాలని ప్రచారం చేశారు.
- **నిరంకారీ ఉద్యమం:** ఈ ఉద్యమాన్ని బాబా దయాళ్‌దాస్ ప్రారంభించారు. మానవులు దేవుని ప్రతినిధులని చెప్పడాన్ని ఈ ఉద్యమం వ్యతిరేకించింది.
- **అకాలీ ఉద్యమం (గురుద్వారా ఉద్యమం 1920):** అకాలీ నాయకులు ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు.



సిక్కు గురుద్వారాలను మహంత్‌ల నుంచి విముక్తి చేయడమే ఈ ఉద్యమం లక్ష్యం. దీనికి గాంధీ మద్దతు లభించింది. ఎస్‌జిపిసి మొదటి అధ్యక్షుడు ఖరక్ సింగ్. ఈ ఉద్యమ ఫలితంగా 1922లో సిక్కు గురుద్వార చట్టాన్ని చేశారు.

పార్శీ మతంలో సంస్కరణలు

పార్శీ మతంలో బహుభార్యత్వం, పరదా పద్ధతి వంటి దురాచారాలు ఉండేవి. మహిళలకు ఆస్తి హక్కు ఉండేది కాదు. పార్శీల్లో సంస్కరణల కోసం 1851లో దాదాబాయి నౌరోజీ, ఎస్ఎస్ బెంగాలీ, నౌరోజీ ఫర్దూంజి, జె.బి.వాచాలు ప్రయత్నించారు. ఎం. మలబారి 1885లో సేవాసదన్ అనే సంస్థను స్థాపించారు.

బాంబే యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన మలబారి ఈస్ట్ అండ్ వెస్ట్, మహాసాప్ బాల్య వివాహ్ అనే పత్రికలను స్థాపించారు. ఈయన కృషి వల్ల బాల్య వివాహాల నిర్మూలనకు ఏజ్ ఆఫ్ కన్‌సెంట్ యాక్ట్ - 1891 చేశారు. దీని ప్రకారం వధువుకు 12 ఏళ్లు, వరుడికి 14 ఏళ్లు వివాహ వయసుగా నిర్ణయించారు.

ముస్లిం మత సంస్కరణోద్యమాలు

- **వహాబీ ఉద్యమం (1840):** వహాబీ ఉద్యమం పంజాబ్‌లో ప్రారంభమైంది. అరబ్బీ మత సంస్కర్త అయిన అబ్దుల్ వహాబీ అనుచరులే వహాబీలు. రాయ్‌బరేలీకి చెందిన ఫకీర్ అహ్మద్ బాల్వీ భారతదేశంలో వహాబీ ఉద్యమాన్ని స్థాపించాడు. ఈ ఉద్యమాన్ని మొదటి వ్యవసాయిక తిరుగుబాటుగా, సిక్కుల పవిత్ర యుద్ధంగా పరిగణిస్తారు.
- **దియోబంద్ ఉద్యమం (దారుల్ ఉలామ్ - 1866):** దియోబంద్ కేంద్రంగా సహరాన్ పూర్‌లో మౌలానా హుస్సేన్ అల్మాట్ ఈ ఉద్యమాన్ని 1866లో ప్రారంభించారు. ఇది ఇస్లాంలో ఉదార దృక్పథం ఉన్న ఉద్యమం. ఈ ఉద్యమం ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పాటును స్వాగతించింది. ఈ ఉద్యమం నుంచి వచ్చిన నాయకుడే మౌలానా అబుల్ కలాం ఆజాద్.
- **అహల్ - ఇ - ఖురాన్ (ఖురాన్ ప్రజలు):** మౌల్వి అబ్దుల్లా చక్రల్వి ఈ ఉద్యమాన్ని పంజాబ్‌లో ప్రారంభించాడు. విశ్వంలోని మానవులంతా ఒకటే అనే సూత్రంపై ఈ ఉద్యమం ఆధారపడింది. పాశ్చాత్య ఉదారవాద విద్యావిధానాన్ని భారతీయ ముస్లింలలో వ్యాప్తి చేయడం దీని లక్ష్యం.
- **అర్హర్ ఉద్యమం:** ఈ ఉద్యమ నాయకులు మహ్మద్ అలీం, హకీం, అజ్మల్ ఖాన్, హసన్ ఇమాం. అలీఘర్ పాఠశాల విధి విధానాల పట్ల అయిష్టత చూపడంతోపాటు జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.
- **అలీఘర్ ఉద్యమం (1817 - 1818):** సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ముస్లిం సంఘ సంస్కర్తల్లో మొదటివాడు. ముస్లింల అభివృద్ధికి బ్రిటిష్‌వారి సహాయం కోరాడు. 1857 తిరుగుబాటును సిపాయిల తిరుగుబాటు అని పేర్కొన్నాడు. 1857 తిరుగుబాటుకు సంబంధించి ద కాజెస్ ఆఫ్ ఇండియన్ మ్యూటిని అనే గ్రంథాన్ని రచించాడు. ముస్లింల విద్యాభివృద్ధికి ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌లో మహ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ (1875) పాఠశాలను స్థాపించారు. మొదటి ప్రిన్సిపాల్ బేక్. ఈ పాఠశాలనే 1920 నాటికి అలీఘర్ విశ్వవిద్యాలయంగా మారింది. దీనికి మొదటి విసి షాజహాన్ బేగం. అహ్మద్ ఖాన్, బ్రిటిషర్ల సహాయంతో ముస్లింల అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా వారిలో ఆధునిక విజ్ఞానం, ఆంగ్ల విద్యా వ్యాప్తి కోసం శ్రమించాడు. ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. 1864లో విజ్ఞాన శాస్త్ర సంఘాన్ని నెలకొల్పాడు. 1888లో ఐక్య దేశాభిమానుల సంఘాన్ని స్థాపించాడు. హిందువులు, ముస్లింలు భారతదేశానికి రెండు కళ్లవంటివారని అన్నాడు.
- **మహ్మద్ ఇక్బాల్:** విద్యాభివృద్ధి ద్వారా ముస్లింలలో సంస్కరణలు తీసుకురావచ్చని భావించాడు. 'సారే జహాసే అచ్ఛా' అనే గీతాన్ని రచించాడు. ఈ గీతానికి శాస్త్రి విష్ణు దిగంబర పలుస్కార్ స్వర కల్పన చేశారు. పంజాబ్, కశ్మీర్, సింధు, బెలూచిస్థాన్‌లను కలిపి పాకిస్థాన్ అనే ముస్లిం దేశాన్ని ఏర్పాటు చేయాలని మొదటగా పేర్కొన్నాడు.

బి.వి. నారాయణరెడ్డి



పులి జాడ లేదు.. జింకలకు కొదవ లేదు!

- నాగార్జున్‌సాగర్ డివిజన్‌లో ఇదీ పరిస్థితి
- వేలల్లో జింకలు, అడవి పందులు.. గణనలో వెల్లడి

నల్లగొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ టైగర్ ఫారెస్టు రేంజ్, నాగార్జునసాగర్ డివిజన్ పరిధిలోని అడవుల్లో పులి జాడ లేదని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. జింకలు, అడవి పందుల సంఖ్య మాత్రం గణనీయంగా పెరిగిందని తేల్చారు. ఈ వివరాలను డివిజన్ల వారీగా ప్రత్యేక యాప్ ద్వారా డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపారు. నల్లగొండ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ ఫారెస్టు రేంజ్, సాగర్ డివిజన్ పరిధిలో 28వేల హెక్టార్లకుపైగా అటవీ ప్రాంతంలో జనవరి 22 నుంచి 29 వరకు గణన చేపట్టారు. ఈ మేరకు అడవిలో పులి జాడ లేనేలేదని తేలింది. చిరుతలు గతంలో 22 ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 26 వరకు పెరిగింది. ఎలుగుబంట్ల సంఖ్య 30 నుంచి 50కి, రేసు కుక్కల సంఖ్య 50 నుంచి 150కి చేరింది. ఇక జింకలు, తోడేళ్లు, మనుబోతులు, అడవి పందులు వేలల్లో ఉన్నట్టుగా వెల్లడైంది. కాగా, వేటగాళ్ల బారి నుంచి అడవి జంతువులను కాపాడేందుకు 25 సీసీ కెమెరాలను అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయడం, నిఘా కోసం వాచ్ టవర్ ఏర్పాటు మంచి ఫలితాలు ఇచ్చిందని అధికారులు తెలిపారు.


నల్లగొండ జిల్లా చందంపేట మండలం నల్లమల అడవిలో నీటి తొట్ల వద్ద దుప్పులు, నెమళ్లు

సున్నపురాయిని తవ్వేస్తున్నారు

- జోగులాంబ జిల్లాలో వందల ఎకరాల్లో నిల్వలు.. మార్బుల్, సిమెంట్ పరిశ్రమలకు ముడిసరుకు
- కోట్లు విలువ చేసే గనులు.. కొల్లగొడుతున్న అక్రమార్కులు


అక్రమంగా తవ్వుతున్న దృశ్యం

గద్వాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వందలాది మందికి ఉపాధిని, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చిపెట్టే సున్నపురాయి (లైమ్‌స్టోన్) నిక్షేపాలు అక్రమార్కుల పాలవుతున్నాయి. వారి దాహార్తికి అమూల్యమైన భూగర్భ సంపద తరిగిపోతోంది. పట్టా భూములని కొందరు, పంచాయతీ పరిధిలో ఉన్నాయని ఇంకొందరు అందినకాడికి తవ్వుకొని తరలించుకుపోతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గంలో వందల ఎకరాల్లో వందల కోట్ల విలువైన సున్నపురాయి నిల్వలున్నాయి. ఉండవల్లి, మానవపాడు, ఆలంపూర్ మండలాల్లో.. కృష్ణా, తుంగభద్ర నదుల పరీవాహక ప్రాంతాల్లో.. శ్రీశైలం బ్యాక్ వాటర్ కింద ముంపునకు గురైన భూముల్లో ఈ నిల్వలు ఉన్నాయి. ఇక్కడ ఈ ప్రాంతాల్లో దశాబ్దాలుగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. సున్నపురాయిని మార్బుల్, సిమెంట్ పరిశ్రమల్లో ముడిసరుకుగా ఉపయోగిస్తారు. అయితే.. ఈ ప్రాంతాల్లో ఎలాంటి నిఘా లేకపోవడంతో అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. ట్రాక్టర్ లోడుకు రూ.3వేల నుంచి రూ.5వేల వేల చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు. గద్వాల జిల్లాలోని ఉండవల్లి, ఆలంపూర్, మానవపాడు, ఇటిక్యాల, అయిజ మండలాల్లోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు గృహ నిర్మాణాల కోసం ఇటుకల రూపంలో లైమ్‌స్టోన్ నిల్వలను వాడుకుంటున్నారు. అక్రమ తవ్వకాలను అరికట్టడంలో, నిల్వలను సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర భూగర్భ గనుల శాఖ విఫలమవుతోందనే ఆరోపణలున్నాయి. కాగా, మినరల్స్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ ఆధ్వర్యంలో పలు జిల్లాలో లైమ్‌స్టోన్‌పై పరిశోధనలు జరిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడు బ్లాక్‌లు, నల్లగొండలో ఎనిమిది, ఆదిలాబాద్‌లో 13, కరీంనగర్‌లో నాలుగు, రంగారెడ్డిలో రెండు బ్లాక్‌లు ఉన్నట్టు నిర్ధారించారు. వీటిని వినియోగంలోకి వస్తే జిల్లా పారిశ్రామికంగా పురోగతి సాధించే అవకాశం ఉంది. ప్రభుత్వం అనుమతిస్తే లైమ్‌స్టోన్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని గనులశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రాగటూర్‌లో లైమ్ స్టోన్ నిల్వలు


మా చిన్నప్పటి నుంచి తవ్వుకుంటున్నాం



మా చిన్నప్పటి నుంచి ఈ రాళ్లను వాడుకుంటున్నాం. ఇలాంటి నిల్వలతో ఉపయోగం ఉంటుందని తెలియదు. ఈ రాళ్లతో సిమెంట్ తయారవుతుందని తెలియదు. సిమెంట్ పరిశ్రమ వస్తే మా పిల్లగాళ్లకు ఉద్యోగాలు వస్తాయి.

- మద్దిలేటి, ప్రాగటూరు, ఉండవల్లి


కొత్తకోటలో నీటితో కళకళలాడుతున్న శంకరసముద్రం

సప్త సముద్రాలకు జలకళ!

‘ఎత్తిపోతల’తో నిండిన చెరువులు.. సంస్థానాధీశుల కాలంలో నిర్మాణం.. 30 ఏళ్లుగా నీటి జాడే లేదు

- ప్రస్తుతం ‘కృష్ణా’ నీటితో కళకళ
- ఆయకట్టుకు సమృద్ధిగా నీరు


ఘనపురం మండలంలోని గణపసముద్రం

వనపర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సప్త సముద్రాలు ఎండిపోయాయి! దశాబ్దాలుగా నీటి జాడ లేక నోళ్లు తెరిచాయి! సముద్రాలేంటి..? ఎండిపోవడమేంటి..? అనుకుంటున్నారా..? గతంలో వనపర్తి సంస్థానంగా ఉండేది. ఈ ప్రాంతం సముద్రమట్టానికి దాదాపు 600 మీటర్ల ఎత్తులో ఉండడం, సమీపంలో సముద్రాలు లేకపోవడంతో వర్షాలు సమృద్ధిగా కురిసేవి కాదు. రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో అప్పటి వనపర్తి, దాని ఉప సంస్థానాల రాజ వంశీయులు సముద్రాల పేరుతో చెరువులను తవ్వించారు. అవే సప్తసముద్రాలు! క్రీ.శ 1592 నుంచి 1922 వరకు వనపర్తి సంస్థానం పరిధిలో 7 చెరువుల నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం సంస్థానాలూ పోయాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో తీవ్ర వర్షాభావం నెలకొనడంతో.. 30 ఏళ్లుగా సప్తసముద్రాల్లోకి నీరు చేరలేదు. తెలంగాణ ప్రభుత్వం తాజాగా ఎత్తిపోతల ప్రాజెక్టుల నీటితో చెరువులను నింపడంతో సప్తసముద్రాలు మళ్లీ జలకళ సంతరించుకున్నాయి. సాగుకు నీరందుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వలస వెళ్లిన వారు తిరిగొస్తున్నారు

సప్తసముద్రాల్లో నీరు కరువై ఖిల్లాఘనపురం మండలంలోని గణపసముద్రం, కొత్తకోట మండలంలోని శంకరసముద్రం కింద ఉన్న ఆయకట్టు రైతులు వలసబాట పట్టారు. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వస్తోంది. కృష్ణానదిపై నిర్మించిన పలు ఎత్తిపోతల పథకాలకు చెరువులను అనుసంధానం చేయడంతో పాత ఆయకట్టుకు నీరందుతోంది. పంటలు పండుతున్నాయి. వలస వెళ్లిన రైతులు తిరిగి వస్తున్నారు. ఐదు చెరువులను జూరాల ప్రాజెక్టు ఆధారంగా నిర్మించిన రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం ఫేజ్-2 కింద అనుసంధానించారు. పెబ్బేరు మండలంలోని వెంకటాపూర్ వద్ద ఉన్న రామసముద్రాన్ని జూరాల ఎడమ కాల్వకు, గణపసముద్రాన్ని కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి అనుసంధానించారు. ఫలితంగా సప్త సముద్రాలు నీటితో కళకళలాడుతున్నాయి.

ఇదీ చరిత్ర..

కల్యాణి చాళుక్యులతో ప్రారంభమైన చెరువుల నిర్మాణం కాకతీయుల కాలంలో ఉద్యమంగా కొనసాగింది. ఇందుకు ఉదాహరణ వనపర్తి, సూగురు సంస్థానాల పరిధిలోని సప్తసముద్రాల నిర్మాణమే! మొత్తం 7 తటాకాలను నిర్మించగా అవన్నీ వర్షాలు వస్తేనే నిండేవి. తొలుత అష్టభాషా బహరి గోపాలరావు అనే రాజు శ్రీరంగాపూర్ మండలకేంద్రానికి ఆనుకుని రంగసముద్రం, అదే మండలంలోని తాటిపాములలో వీర సముద్రాన్ని నిర్మించారు. ఖిల్లాఘనపురంలో గణపసముద్రాన్ని నిర్మించారు. ఈ మూడు చెరువుల కింద సుమారు 40వేల ఎకరాల ఆయకట్టు ఉండేది. అంతకుముందే కొత్తకోట మండలంలో సంకిరెడ్డిపల్లి పెద వెంకటరెడ్డి అనే సామంతరాజు 1592-1625 మధ్య కృష్ణసముద్రాన్ని నిర్మించారు. అలాగే రాణి శంకరమ్మ నేతృత్వంలో కొత్తకోట మండలం కానాయపల్లి వద్ద 1866-1892 మధ్య శంకర సముద్రాన్ని నిర్మించారు. పెబ్బేరు మండలంలోని వెంకటాపూర్‌లో 1625-1653 మధ్యకాలంలో ఇమ్మడి వెంకటరెడ్డి అనే రాజు రామసముద్రాన్ని నిర్మించారు. చివరగా వనపర్తి సంస్థానాధీశుడు రెండో రామేశ్వరరావు పెబ్బేరులో మహభూపాల్ సముద్రాన్ని నిర్మించారు.

జూరాల, భీమా రాకతో సాగు పెరిగింది

జూరాల, భీమా ప్రాజెక్టులు రావడంతో సప్త సముద్రాలు నీటితో నిండి సాగు పెరిగింది. ప్రస్తుతం రామ సముద్రం, వీర సముద్రం, మహభూపాల్ సముద్రాలు నీటితో కళకళలాడుతున్నాయి. పంటలు బాగా పండుతున్నాయి. రైతులంతా సంతోషంగా ఉన్నారు. వనపర్తి రాజులు తవ్విన చెరువులు ఇప్పుడు రైతులకు ఉపయోగపడుతున్నాయి.

- పందెం కృష్ణారెడ్డి, రైతు, పెబ్బేరు

వందేళ్లలో మూడుసార్లే నిండింది


గణపసముద్రం గడిచిన వందేళ్లలో మూడు సార్లు మాత్రమే నిండింది. 1964, 1981లో నిండగా.. మళ్లీ 37 ఏళ్ల తర్వాత కేఎల్ఐ నీటితో కళకళలాడుతోంది. మరో ఐదు అడుగుల మేర నీరు వస్తే అలుగు పారుతుంది. చెరువులోకి నీరు రావడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందంగా ఉన్నారు.

- పట్టాభిరాములు, ఖిల్లాఘనపురం

మృత్యుదారులు మూతపడేదెప్పుడో!

సిబ్బందిలేని లెవెల్ క్రాసింగ్‌లతో ప్రమాదాలు

- దక్షిణమధ్య రైల్వేలో 350 యూఎంఎల్‌సీలు.. తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తున్న రైల్వేశాఖ
- అరకొరగా నిధుల విడుదల.. నత్తనడకన పనులు


జగిత్యాల జిల్లా పరిధిలోని అంతర్గాం శివారులో రైల్వే గేటు లేని ట్రాక్

(ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)

మెదక్ జిల్లా మాసాయిపేట సమీపంలో కాపలా సిబ్బందిలేని రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఓ స్కూల్ బస్సును రైలు ఢీకొని 16 మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారు. 2015 జనవరిలో ఈ ఘటన జరిగింది. దీంతో దేశంలోని అన్‌మ్యాన్డ్ లెవెల్ క్రాసింగ్ (యూఎంఎల్ సీ)లపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. యూఎంఎల్‌సీల వద్ద సిబ్బందిని నియమించడమో, లేక వాటిని తొలగించడమో చేయాలన్న డిమాండ్లు వచ్చాయి. కానీ, ఈ ఘటన జరిగి మూడేళ్లు దాటినా.. రైల్వే శాఖ మేల్కొన్న సూచనలు కనిపించడం లేదు. మృత్యు దారులుగా మారిన యూఎంఎల్‌సీలను తొలగించే ప్రక్రియ నత్తనడకనే సాగుతోంది. యూఎంఎల్‌సీలను దశల వారీగా తొలగిస్తామని 2009 ఏప్రిల్ 1న అప్పటి రైల్వేశాఖ మంత్రి మమతా బెనర్జీ లోక్‌సభలో చేసిన ప్రకటన మొదలుకొని.. ఆ తర్వాత రైల్వే మంత్రులుగా పనిచేసిన వారందరూ ఇలాంటి ప్రకటనలే చేశారు. కానీ, ఇందుకు అరకొర నిధులు మాత్రమే కేటాయిస్తున్నారు. 2014 జూలై నాటికి దక్షిణమధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో సిబ్బంది లేని రైల్వే క్రాసింగ్‌లు 1164 వరకు ఉన్నాయి. ఆ తర్వాత వీటి సంఖ్యను చాలావరకు తగ్గించినా.. ఇంకా 350 వరకు యూఎంఎల్‌సీలు అలాగే కొనసాగుతున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం!

సిబ్బంది లేని లెవెల్ క్రాసింగ్‌ల తొలగింపు లేదా ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణం కోసం రైల్వే శాఖ ఏటా బడ్జెట్‌లో కోట్లాది రూపాయలను కేటాయిస్తోంది. కానీ, ఆ స్థాయిలో నిధుల విడుదల మాత్రం జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు కూడా జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. 2017 నాటికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని యూఎంఎల్‌సీలను తొలగిస్తామని 2014లో రైల్వేశాఖ ప్రకటించగా.. చాలా చోట్ల ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. సికింద్రాబాద్ సమీపంలోని అమ్ముగూడ బైపాస్ రోడ్డు, ఖమ్మం జిల్లాలోని పాండురంగాపురం వంటి చోట్ల యూఎంఎల్‌సీలే కొనసాగుతున్నాయి. పలు చోట్ల గేట్‌మిత్రల పేరిట శిక్షణ లేని ప్రైవేటు వ్యక్తులతో నడిపిస్తున్నారు. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారి కుటుంబాలకు కనీసం నష్టపరిహారం కూడా ఇచ్చే పరిస్థితి లేదు. ఇలాంటి ప్రమాదాలకు తమ బాధ్యత ఉండబోదని రైల్వే వర్గాలు చేతులు దులుపుకొంటున్నాయి. మరోవైపు ప్రమాదాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపంపైనా విమర్శలు వస్తున్నాయి. పోలీసులు, రైల్వే సిబ్బంది సాయంతో రాష్ట్ర రవాణాశాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం ద్వారా భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాలి. అవసరమైతే ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణానికి సిఫార్సులు చేయాలి. కానీ, ఈ సర్వేలు సక్రమంగా జరగడంలేదని, దుర్ఘటనలు జరిగిన సందర్భాల్లో హడావుడి చేయడం తప్ప.. తర్వాత వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే, దక్షిణమధ్య రైల్వే పరిధిలో 2018 నాటికి యూఎంఎల్‌సీలను పూర్తిగా తొలగిస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.



మైనింగ్ వర్సిటీ ఏదీ?


కొత్తగూడెంలో మైనింగ్ వర్సిటీ ఏర్పాటు చేయాల్సిన ఇంజనీరింగ్ కళాశాల భవనం

- కొత్తగూడెంలో ఏర్పాటుకు ప్రభుత్వ హామీ
- అధ్యయన కమిటీ నివేదిక ఇచ్చి ఏడాది పూర్తి
- ఇంకా పెండింగ్‌లోనే వర్సిటీ ఫైలు
- నేటికీ ముందుకు పడని అడుగులు

(ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం)

కొత్తగూడెంలో మైనింగ్ వర్సిటీ ఏర్పాటు ప్రక్రియ మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. సింగరేణి సంస్థ ఉన్న ప్రాంతం కావడం, ఇక్కడ మైనింగ్ వర్సిటీ ఏర్పాటు ఆవశ్యకత ఉండటంతో ప్రభుత్వం కూడా అందుకు చర్యలు తీసుకుంది. కానీ, అవి ముందుకు సాగడంలేదు. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో పర్యటించిన సీఎం కేసీఆర్.. ఇక్కడ మైనింగ్ వర్సిటీ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అందుకు కావాల్సిన మౌలిక వసతులు, సదుపాయాలపై అధ్యయనం చేయాలంటూ రెండేళ్ల క్రితం ఉన్నత స్థాయి కమిటీని నియమించారు. ఈ బృందం కొత్తగూడెంలో పర్యటించి.. ఏడాది క్రితం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. కానీ, నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వాస్తవానికి ఒకప్పుడు హైదరాబాద్ యూనివర్సిటీలో మైనింగ్ కోర్సు ఉండేది. అయితే సింగరేణి సంస్థ కొత్తగూడెం ప్రాంతంలో ఉండడం, మైనింగ్ సాంకేతిక విద్య అవసరం కావడంతో ఇక్కడే అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పీజీ కోర్సులను కూడా ఇక్కడికి తరలించి కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్ (కేఎస్ఎం)ను ఏర్పాటు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఉన్న కేఎస్ఎంను.. 1994లో కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి బదలాయించారు. కేఎస్ఎంగా ఉన్న పేరును యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌గా మార్చారు. బీటెక్ (మైనింగ్) కోర్సును కొనసాగించారు. 1996లో ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ కోర్సులను పరిచయం చేశారు. 2011లో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్ గ్రూప్‌ను ప్రవేశపెట్టి కళాశాలలో ఇంజనీరింగ్‌కు సంబంధించిన విద్యను అందుబాటులోకి తెచ్చారు.

నెరవేరని హామీ..

కొత్తగూడెంలో మైనింగ్ వర్సిటీ ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన ఆరుగురు సభ్యుల కమిటీ ఇక్కడ పర్యటించి ప్రభుత్వ స్థలంలోని భవనాలు, మౌలిక వసతులు, ఫ్యాకల్టీ తదితర అంశాలను పరిశీలించింది. కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐకి సంబంధించిన కళాశాలను కూడా ఈ వర్సిటీ పరిధిలోకి తేవాలని సూచనప్రాయంగా నిర్ణయించింది. మైనింగ్ ఇంజనీరింగ్ వర్సిటీ కంటే సాంకేతిక విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేస్తే ఇంజనీరింగ్, మైనింగ్ కోర్సులకు అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడింది. ఈమేరకు ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ఏడాది క్రితం నివేదిక సమర్పించింది. వర్సిటీ ఏర్పాటు ఫైలు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాంతంలో మైనింగ్ వర్సిటీ ఏర్పాటుకు త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ వస్తుందని స్థానిక ఎమ్మెల్యే వెంకట్రావు ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు.

అసైన్డ్ ఆక్రమణలకు చట్టబద్ధత: సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): "ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూములకు కూడా చట్టబద్ధత కల్పించండి. అసైనీల చేతుల్లో కాకుండా మూడో వ్యక్తుల చేతుల్లో ఉంటే ఆ భూములను స్వాధీనం చేసుకోండి. వారిలో అర్హులకు రీ అసైన్ చేయండి. ఇతర పట్టాదారులతోపాటు అసైన్డ్ భూములు కలిగి ఉన్న వారికి కూడా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయండి. వారి పేరు మీద పాస్ పుస్తకాలు తయారు చేయండి" అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. అసైనీల అధీనంలో ఉన్న భూములను గుర్తించి, వాటి యాజమాన్యంపై స్పష్టత ఇవ్వాలని స్పష్టం చేశారు. కొత్త పాస్ పుస్తకాల పంపిణీపై ప్రగతి భవన్‌లో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పాస్ బుక్‌ల ముద్రణను నామినేషన్ ప్రాతిపదికన సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు అప్పగించామని, తొలుత రూ.200కే ముద్రించడానికి ముందుకొచ్చి, ఇప్పుడు రూ.250 డిమాండ్ చేస్తోందని, మార్చి 11వ తేదీకల్లా ముద్రణ సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దాంతో, పాస్ పుస్తకాల ముద్రణలో తొందరపాటు వద్దని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి ఎంట్రీనీ ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వ్యవసాయ భూమి ఉన్న రైతుకు అదే గ్రామంలో వ్యవసాయేతర భూమి ఉంటే, ఆ వివరాలు కూడా పాస్ బుక్‌లో నమోదు చేయాలని, ఇందుకు అదనపు కాలమ్ పెట్టాలని నిర్దేశించారు. మార్చి 11నే పాస్ పుస్తకాలన్నీ పంపిణీ చేసి తీరాలనే తొందరలో పొరపాట్లు జరిగే అవకాశం ఉందని, మార్పులు చేస్తుండడంతో కొంత ఆలస్యమైనా పరవాలేదని సీఎం స్పష్టం చేశారు. "అసైన్డ్ ఆక్రమణలు క్రమబద్ధీకరించిన తర్వాత (రీ అసైన్ చేసిన తర్వాత), ఆ వివరాలతో కొత్త అసైనీలకు పాస్ పుస్తకాలు అందించాలి. ఖాతాల్లో పట్టాదారుల వివరాలు సరిగ్గా ఉన్నాయో లేవో పరిశీలించిన తర్వాతే ముద్రణ ప్రారంభించండి. పాస్ పుస్తకంలో నమోదు చేసే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించడానికి కొంత సమయం తీసుకున్నా అభ్యంతరం లేదు" అని స్పష్టం చేశారు. భూ రికార్డుల ప్రక్షాళనను రెవెన్యూ యంత్రాంగం రేయింబవళ్లు ఎంతో శ్రమకోర్చి విజయవంతం చేసిందంటూ సీఎం వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రికార్డుల ప్రక్షాళన తర్వాత వచ్చిన వివరాలను 'ధరణి' వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నామని, వాటి ఆధారంగానే కొత్త పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తామని ప్రకటించారు.

మార్చి నెలాఖరుకు గ్రామాలన్నింటికీ మంచినీళ్లు: సీఎం

రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మార్చి 31 నాటికి భగీరథ మంచినీళ్లు చేరాలని సీఎం కేసీఆర్ నిర్దేశించారు. మిషన్ భగీరథపై ప్రగతి భవన్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు.గ్రామాలకు పైపులైన్లు వేస్తూనే, సమాంతరంగా అంతర్గత పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టాలని చెప్పారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. మార్చి చివరికి ఓఆర్ఆర్ లోపలి గ్రామాలకు కూడా ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయాలన్నారు.

● ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశాలు ఎంసెట్‌తోనే..

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్ ప్రవేశ పరీక్ష ద్వారానే ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఎంసెట్ పరీక్ష నిబంధనలను సవరిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజనీరింగ్ తరహాలోనే బీఎస్సీ (ఫారెస్ట్రీ) కోర్సు కూడా నాలుగేళ్లు ఉంటుంది. గతేడాది ప్రవేశపెట్టిన కోర్సులో ప్రవేశాలను ఇంటర్ మార్కుల ఆధారంగా కల్పిస్తున్నారు. నూతన నిబంధనతో 2018-19 విద్యా సంవత్సరం నుంచి ఎంసెట్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు.

● 'జీవన్ ప్రమాణ్'తో ప్రభుత్వ పెన్షనర్లకు ఊరట

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షన్‌దారులకు గొప్ప ఊరట. తమ పెన్షన్ల కోసం ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లి 'పెన్షనర్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల'ను అందజేయాల్సిన అవసరం లేదు. తమ దగ్గర్లోని మీ-సేవా కేంద్రాల ద్వారా పంపిస్తే చాలు... వారికి పెన్షన్లు అందుతాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'జీవన్ ప్రమాణ్' విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పెన్షన్‌దారులందరూ మీ-సేవా కేంద్రాల్లో సర్టిఫికెట్లను సమర్పించాలని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ కేఎస్ఆర్‌సీ మూర్తి తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే... మీ-సేవా సహాయ కేంద్రం నెంబర్ 1100 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1800425110కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

● టీవీఎస్ రాష్ట్ర మహాసభలకు హైకోర్టు అనుమతి

హైదరాబాద్/పెద్దపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థి సంఘం(టీవీఎస్) మూడో రాష్ట్ర మహాసభలకు హైకోర్టు అనుమతించింది. ఈనెల 26న పెద్దపల్లిలో ఈ సభలు జరుగనున్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సమావేశం నిర్వహించాలని నిర్వాహకులకు హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సభకు అనుమతి కోసం తాము దరఖాస్తు చేసినా పోలీసులు స్పందించడం లేదంటూ సంఘం అధ్యక్షుడు కోట శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

● డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ సీఐ

కామారెడ్డి, ఫిబ్రవరి 23 : తాగి వాహనాలను నడిపే ప్రబుద్ధులకు బుద్ధి చెప్పాల్సిన పోలీసే.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయాడు. ఆపినందుకు ఊగిపోతూ వీరంగం వేశాడు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందీ ఘటన. ఠాణా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై సదాశివనగర్ పోలీసులు గురువారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి సీఐగా పనిచేస్తున్న డి.కృష్ణ ఆ సమయంలో తాగి, వాహనాన్ని నడుపుకొంటూ నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్నారు. ఆయన్ను ఆపి తనిఖీ చేయగా తాగినట్టు తేలింది. అయితే, తాను సీఐనంటూ ఆయన వీరంగం వేయడంతో స్థానిక ఎస్సై నాగరాజు ఉన్నతాధికారులను సంప్రదించారు. చట్టప్రకారం కేసు పెట్టాలని స్పష్టం చేయడంతో.. ఎస్సై కేసు నమోదు చేశారు. కామారెడ్డి ఎస్పీ శ్వేతారెడ్డి దీనిపై నిజామాబాద్ కమిషనర్ కార్తికేయకు సమాచారాన్ని అందించారు. వెంటనే సీఐ కృష్ణను ధర్పల్లి నుంచి హెడ్‌క్వార్టర్‌లోని ఏఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● తాగుబోతు తండ్రి.. నాకొద్దు : బాలుడి ఫిర్యాదు


గాయపడ్డ బాలుడు

జమ్మికుంట, ఫిబ్రవరి 23: కన్న కొడుకును కడుపులో పెట్టుకుని దాచుకోవాల్సిన తండ్రి.. వాతలు తేలేలా, చర్మం కమిలిపోయేలా గొడ్డును బాదినట్టు బాదాడు. దీంతో ఆ బాలుడు.. 'ఈ తాగుబోతు తండ్రి నాకొద్దు' అంటూ పోలీసులను ఆశ్రయించాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పటణ పరిధిలోని మోత్కుల గూడెంలో జరిగిందీ ఘటన. మోత్కుల గూడేనికి చెందిన మొలుగూరి శ్రీనివాస్-రమ్య దంపతులకు కుమార్తె నిరోష, కుమారుడు శశికుమార్ ఉన్నారు. శ్రీనివాస్ సెంట్రింగ్, రమ్య కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకొన్న శ్రీనివాస్ ఆమెను ఇష్టం వచ్చినట్లు చితకబాదుతున్నాడు. కుమార్తె, కుమారుడు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారినీ కొడుతున్నాడు. దీంతో కుమార్తె నిరోషను తల్లి కస్తూర్బా పాఠశాలలో చేర్పించింది. శుక్రవారం కుమారుడు ఎప్పటిలాగే స్కూల్ నుంచి ఇంటికి రాగానే.. 'పర్సులో డబ్బులు తీశావు' అంటూ శ్రీనివాస్ అతణ్ని కర్ర, బెల్టుతో తీవ్రంగా కొట్టాడు. అడ్డుకున్న భార్యనూ చావబాదాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న తల్లి, కొడుకు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● విద్యార్థినికి నీలిచిత్రం చూపిన టీచర్

చేర్యాల, ఫిబ్రవరి 23: విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు.. తరగతిగదిలోనే ఓ విద్యార్థినికి బూతు చిత్రాలు చూపాడు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం నాగపురి గ్రామంలోని ఒక ఉన్నత పాఠశాలలో ఈ ఘటన జరిగినట్టు సమాచారం. చాలాకాలంగా ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ఉపాధ్యాయుడు.. తొమ్మిదో తరగతి చదువుతున్న ఒక బాలికకు తన సెల్‌ఫోన్‌లో నీలిచిత్రాలు చూపగా ఆమె హెచ్ఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అతడిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో బాలిక కుటుంబసభ్యులు తమకు తెలిసిన పోలీసు అధికారిని ఆశ్రయించగా.. తమదైన శైలిలో 'బుద్ధి' చెప్పినట్లు తెలుస్తోంది. రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న ఆ ఉపాధ్యాయుడు ఇలాంటి వ్యవహారాల్లో దొరికిపోయి జరిమానా చెల్లించినట్లు ఆరోపణలున్నాయి.

రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ

- ఉచితంగా బోరు బావులు
- మేనిఫెస్టోలో ప్రకటిస్తాం : లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రుణ మాఫీ పథకం ప్రధాన రాజకీయపక్షాలకు మరోసారి ఎన్నికల ప్రచారాస్త్రం కాబోతోంది. టీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదని విమర్శిస్తున్న కాంగ్రెస్.. తాము అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల మేర రుణ మాఫీ చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. తాజాగా, భారతీయ జనతా పార్టీ కూడా అదే బాటలో పయనిస్తోంది. తాము అధికారంలోకి వస్తే రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటిస్తోంది. మరో అడుగు ముందుకేసి పంట రుణాలపై బ్యాంకులకు రైతులు చెల్లించే వడ్డీని తమ ప్రభుత్వమే చెల్లిస్తుందని, రైతులకు ఉచితంగా బోరు బావులు వేసిస్తామని హామీ ఇవ్వబోతోంది. పగటిపూట 9 గంటల నిరంతర విద్యుత్తు, రైతు పెట్టిన పెట్టుబడికి 50శాతం అదనంగా లాభం చేకూరేలా రూ. 5వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయిస్తామని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే రైతులను ఆదుకునేందుకు స్థిరీకరణ నిధి తదితర అంశాలను మేనిఫెస్టోలో ప్రస్తావించబోతున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు, శాస్త్రవేత్తలతో కమిటీలు ఏర్పాటు చేసి సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. వ్యవసాయం పండుగ అనుకునే విధంగా రైతులకు ప్రయోజనాలు కల్పిస్తామని, నిరుద్యోగ యువతను ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకుంటామని లక్ష్మణ్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

● ఇటు రాష్ట్రంలో



● అటు దేశ రాజధానిలో





1)జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన రైతులు; 2)కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతు; 3) ఢిల్లీకి వస్తున్న మధ్యప్రదేశ్ రైతులను ఫరీదాబాద్ వద్ద ఆపేసిన దృశ్యం

రోడ్డెక్కిన రైతన్న

పంటలకు మద్దతు ధర కల్పించాలంటూ ఆందోళనలు

- జగిత్యాలలో కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా
- వరి, పసుపు, మొక్కజొన్నకు మద్దతు ధరకు డిమాండ్
- భైంసాలో రోడ్డెక్కిన కంది రైతులు.. పాలమూరులో పల్లి రైతుల గుస్సా
- మార్కెట్ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రైతుల ఓపిక ఆగ్రహంగా మారింది! మద్దతు ధరపై రోడ్డెక్కి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించే స్థాయిలో పెల్లుబికింది. పంటలకు మద్దతు ధర ఇవ్వాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు శుక్రవారం ఆందోళనలు నిర్వహించారు. వరి, మొక్కజొన్న, పసుపు పంటలకు మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలో రైతులు మహాధర్నా నిర్వహించారు. ఏకంగా ఐదు కిలోమీటర్ల మేర ర్యాలీ చేపట్టారు. తర్వాత కలెక్టరేట్ ఎదుట నాలుగు గంటల పాటు ధర్నా నిర్వహించారు. పసుపునకు క్వింటాకు రూ.15 వేలు, వరి, మొక్కజొన్న పంటలకు క్వింటాకు రూ.2500 గిట్టుబాటు ధర కల్పించాలంటూ నినాదాలు చేశారు. జిల్లాలోని రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతులు ఉదయం 10 గంటలకే జగిత్యాలకు తరలి వచ్చారు. ఒక దశలో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో కలెక్టరేట్ గేటు ఎక్కి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ దశలో పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం జాయింట్ కలెక్టర్ రాజేశానికి జిల్లా రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. వేరుశనగకు మద్దతు ధర దక్కలేదంటూ మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కొందరు రైతులు.. మార్కెట్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం మార్కెట్ బయట, రైల్వేగేట్ ఎదుట ధర్నా చేశారు. గురువారం మార్కెట్‌కు సెలవు ప్రకటించడంతో శుక్రవారం సుమారు 30వేల బస్తాల వేరుశనగ మార్కెట్‌కు వచ్చింది. సరుకు భారీగా రావడంతో వ్యాపారులు టెండర్‌వేసే క్రమంలో ఉద్దేశపూర్వకంగా తక్కువ ధరను నిర్ణయించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 3.30గంటలకు లాట్లవారీగా ధరలను ప్రకటించడంతో కనీస మద్దతు ధర రూ. 4450 కంటే తక్కువ వచ్చిన రైతులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. కంది రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కారు. నిర్మల్ జిల్లా భైంసా మార్కెట్ యార్డ్‌లో తమ కొనుగోళ్ల లక్ష్యం పూర్తయిందంటూ వ్యాపారులు కేంద్రాలను మూసివేయడంతో కంది రైతులు ఆందోళనకు దిగారు. అధికారుల వైఖరికి నిరసనగా భారీ ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. జామాయిల్, సుబాబుల్‌కు గిట్టుబాట ధర కోసం ఖమ్మం జిల్లా రైతులు రోడ్డెక్కనున్నారు. మంత్రులు తమ్మల, హరీశ్ సమక్షంలో జామాయిల్, సుబాబుల్‌ను టన్నుకు రూ.4వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేస్తామని బీపీఎల్ యాజమాన్యం అంగీకరించిందని ఏన్కూరులో అఖిలపక్షం రైతులు చెప్పారు. గిట్టుబాటు ధర డిమాండ్ కోసం 25న లారీలను పేపర్‌మిల్లుకు వెళ్లకుండా అడ్డుకుంటామని ప్రకటించారు.

కలకలం రేపిన రైతు ఆత్మహత్యాయత్నం

జగిత్యాలలో నిర్వహించిన రైతుల మహా ధర్నాలో మల్యాల మండలం రామన్నపేటకు చెందిన ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం కలకలం రేపింది. కలెక్టరేట్ ఎదుట సుదీర్ఘ సమయం పాటు ధర్నా చేసినా.. కలెక్టర్ రాకపోవడంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబికింది. అంతలో జాయింట్ కలెక్టర్ వస్తున్నారని పోలీసులు సమాచారం ఇవ్వగా.. రైతులంతా గేటు వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలోనే రామన్నపేటకు చెందిన కాటిపెల్లి రాజరెడ్డి ప్రధాన గేటుకు ఉన్న ఇనుప ఊచలకు కండువాతో ఉరివేసుకునేందుకు ప్రయత్నించాడు. తోటి రైతులు, పోలీసులు అడ్డుకోవడంతో గండం తప్పింది.

ఢిల్లీ గుండెలపై గర్జన

మద్దతు, మాఫీ, సాగు భద్రత కోసం కదం తొక్కిన ఐదు రాష్ట్రాల రైతులు

- 'ఢిల్లీ ఘెరావ్' పేరిట భారీ నిరసన
- హైవేలపై కర్రలు పట్టిన మహిళలు
- ఢిల్లీ సరిహద్దుల్లో ఆపేసిన బలగాలు
- రాజస్థాన్‌లో అసెంబ్లీ, సచివాలయం
- ముట్టడికి రైతుల యత్నం..ఉద్రిక్తత

న్యూఢిల్లీ, చండీగఢ్, జైపూర్, ఫిబ్రవరి 23: ఢిల్లీ గుండెలపై రైతాంగం గర్జించింది. దేశ రాజధానికి దారి తీసే జాతీయ రహదారులను దిగ్బంధించింది.. మద్దతు ధర, రుణమాఫీ, సాగు భద్రతపై నిరసనల దరువు వినిపించింది. దాదాపు 62 రైతు సంఘాల పిలుపుతో శుక్రవారం 'ఘెరావ్ ఢిల్లీ' కార్యక్రమానికి వేలాదిమంది రైతులు కదిలారు. రైతులకు మద్దతు, ఉత్పాదక ప్రోత్సాహకాలు, పంటకు గ్యారంటీ తదితర అంశాలపై ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ చేసిన సూచనలను వెంటనే అమలు చేయాలంటూ.. హరియాణా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతులు శుక్రవారం రోడ్డెక్కారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ విధానాలపై నిరసనగళం గట్టిగా వినిపించారు. హరియాణాలోని జింద్ జిల్లా మీదుగా, ఢిల్లీ సరిహద్దులోని ఫరీదాబాద్ దాకా భారీ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులను తోసుకొని ముందుకు వెళ్లడానికి రైతులు తీవ్రంగా ప్రయత్నించారు. దీంతో కొన్నిగంటల పాటు ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

ఢిల్లీ దారుల్లో..

"పండించడానికి పెట్టుబడి లేదు..పంటకు మార్కెట్‌లో రేటు లేదు.. ఇంక మేం ఎలా బతకాలి?" అని మహిళలు ఆవేశంగా ప్రశ్నించారు. వీరంతా గురువారం సాయంత్రానికే ఉద్యమ కూడలి జింద్ జిల్లాకు చేరుకొన్నారు. ఢిల్లీకి పాలు, పెరుగు, కూరగాయాలను మోసుకుపోయే జాతీయరహదారి జింద్-హన్సీ మీదుగా పోతుంది. ఈ రహదారిపై పెద్దఎత్తున మహిళా రైతులు బైఠాయించారు. పరిస్థితి అదుపు తప్పుతున్నదని గ్రహించిన హరియాణా ప్రభుత్వం.. 25 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలను జాతీయరహదారిపై మోహరించింది.

అసెంబ్లీ ముట్టడి యత్నం

రాజస్థాన్‌లో రైతులు తమకు పూర్తిస్థాయి రుణమాఫీ వర్తింపజేయాలని ఉద్యమించారు. యాభై వేలు దాకా రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే, తమ రుణాలను పూర్తిగా తీసివేయాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జైపూర్‌లోని రాష్ట్ర అసెంబ్లీ భవనం వద్దకు దూసుకెళ్లడానికి రైతులు ప్రయత్నించారు. అసెంబ్లీ వద్ద ఘెరావ్‌కు ప్రయత్నించిన రైతులను పోలీసులు కొద్దిసేపు అదుపులోకి తీసుకొని వదిలిపెట్టారు. కొందరు మహిళలు సచివాలయం వద్ద ధర్నాకు ప్రయత్నించగా, వారిని పోలీసులు చెల్లాచెదురు చేశారు. వీరంతా కలిసి జైపూర్- సికార్ జాతీయ రహదారి వద్దకు చేరుకొన్నారు. ఈ రహదారిని దిగ్బంధించి చాలాసేపు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో కొన్ని గంటలపాటు 5 వేలకు పైగా వాహనాలు నిలిచిపోయాయి.

ఆధార్ భయం!



నంబర్ ఇచ్చేందుకు వీవీఐపీల వెనకడుగు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):

'మా వీఆర్వో ఉదయం నుంచీ తిరుగుతున్నా ఒక్కరూ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు ఇవ్వడం లేదు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదు'- ఇది శివారు జిల్లాలోని కీలక మండల తహసీల్దార్ వ్యాఖ్య. 'భూములన్నీ వ్యాపార వర్గాలు కొన్నాయి. భూముల్లో ఉంటున్న వారి కార్డు అడుగుతుంటే సార్ విదేశాల్లో ఉన్నారు' అంటూ జవాబు వస్తోంది.. ఇది పొరుగు జిల్లాలోని డిప్యూటీ కలెక్టర్ ఆవేదన

పట్టాదార్ పాస్ పుస్తకం ఇచ్చేందుకు అవసరమైన ఆధార్, ఫోన్ నంబర్లు ఇచ్చేందుకు వీవీఐపీలు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తమ బినామీ బాగోతాల గుట్టు రట్టు అవుతుందని భయపడుతున్నారు. ఇన్నాళ్లూ గుట్టుగా దాచుకున్న భూముల వివరాలు బయటికి వచ్చేస్తాయని ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ శివారుతోపాటు వివిధ ప్రాంతాల్లో పోగేసుకున్న భూముల బండారం బయటపడుతుందని గుర్తించి ఆధార్ నంబరు తెలిపేందుకు ముఖం చాటేస్తున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు తీసుకోవడానికీ వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం అందించే పంట సాయాన్ని వద్దనుకుంటున్నారు. భూ రికార్డుల నవీకరణ, శుద్ధీకరణతో రాష్ట్రంలో భూముల వివరాలన్నీ బయటికి వచ్చాయి. వీరందరికీ ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 11న పంపిణీ చేయాలని సంకల్పించింది. అయితే, పాస్ పుస్తకం ముద్రించాలంటే ఆధార్ వివరాలు తప్పనిసరి. ఆధార్ నంబరును పాస్ పుస్తకంలో పేర్కొంటారు. ఆధార్ కార్డులోని ఫొటోనే పాస్ పుస్తకం తొలి పేజీలో ముద్రిస్తారు. అందుకే, ప్రతి రైతు నుంచి ఆధార్ వివరాలు సేకరించేందుకు 2 వారాలుగా వీఆర్వోలు ఇంటింటికీ తిరుగుతున్నారు. సాధారణ రైతులంతా వివరాలను ఇచ్చేస్తున్నారు. కానీ, బడా బాబులు ససేమిరా అంటున్నారు. ఆధార్ నంబర్‌తో లెక్కలు తీస్తే భవిష్యత్తులో తమ భూ బాగోతం బయటపడుతుందని భయపడుతున్నారు.

బినామీలకే భయం

తెలంగాణలో ప్రధానం గా హైదరాబాద్ చుట్టూ, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, నల్లగొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో బడా బాబులకు ఫామ్ హౌస్‌లున్నాయి. ఇక్కడ పెద్దఎత్తున భూములను వీవీఐపీలు కొనుగోలు చేశారు. ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, బడా వ్యాపారవేత్తలు భారీగా భూములను పోగేసుకున్నారు. ఒక్కొక్కరికీ నాలుగైదుచోట్ల, మరికొంత మందికి 10, 12 చోట్ల భూములున్నాయి.తమ ఆస్తిపాస్తులకు సంబంధించి వీరంతా ఏటా వార్షిక ప్రాపర్టీ స్టేట్‌మెంట్ (ఏపీఆర్) సమర్పిస్తారు. ఆదాయ పన్ను రిటర్న్‌లో ఈ భూముల వివరాలు అందులో ఉండ వు. ఇవన్నీ బినామీ ఆస్తులు కనక.. వీటి రికార్డులకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవడం వీరి కి సుతరామూ ఇష్టం ఉండడం లేదు. అందుకే, 'ఆధార్ కార్డు ఇవ్వండి సార్' అంటూ వీఆర్వోలు మొరపెట్టుకుంటున్నా స్పందించడం లేదు. పలు జిల్లాల్లో 20% వరకూ భూ కమతాలకు ఆధార్ అనుసంధానం కాలేదు.మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో కేవలం 65.4 శాతం ఖాతాలే అనుసంధానం కాగా.. రంగారెడ్డి జిల్లాలో 72.99 శాతానికే పరిమితమైంది. దాంతో, ఇంతమంది ఆధార్ నంబరు ఇవ్వడానికి నిరాకరించడం ఏమిటి? వీరికి పాస్ బుక్ వద్దా!? పంట సాయం వద్దా!? వీరంతా ఎందుకు నిరాకరిస్తున్నారు? అని క్షేత్రస్థాయిలో ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. వీరంతా వీవీఐపీ బాపతేనని తేటతెల్లమైంది.

పాస్ పుస్తకంపై టెన్షన్

పట్టాదార్ పాస్ పుస్తకం ముద్రణ అధికారుల్లో గుబులు పుట్టిస్తోంది. మార్చి ఐదో తేదీకల్లా జిల్లాలకు వీటిని చేర్చాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. ముద్రణ బాధ్యతను జాతీయ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు అప్పగించింది. పనులు అప్పగించి వారం అవుతున్నా ముద్రణ మొదలు కాలేదు. దాంతో, వీటి బాధ్యతలు చూస్తున్న తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్, రెవెన్యూ అధికారులకు గుబులు పట్టుకుంది. బహిరంగ టెండర్‌లో రూ.200కే అన్ని రక్షణ చర్యలతో పాస్ పుస్తకం ముద్రిస్తామని ముందుకొచ్చిన ప్రెస్.. ఇప్పుడు రూ.250 ఇవ్వాలంటూ తాజాగా ప్రభుత్వానికి లేఖ రాసింది. ఒక్కో పాస్ బుక్‌కు రూ.250గా ధర ఖరారు చేస్తే ముద్రణ ప్రారంభిస్తామని వారు స్పష్టం చేసినట్లు సమాచారం.

ఆధార్ ఇస్తే..

ఆధార్ వివరాలు ఇస్తే చాలు.. అతనికి ఎన్ని ఆస్తులు ఉన్నాయో ఆ లెక్కలన్నీ కళ్లముందు కనిపిస్తాయి. అందుకే ఆధార్ వివరాలు ఇవ్వడానికి వీరంతా నిరాకరిస్తున్నారు. వాస్తవానికి, ప్రస్తుతం భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఆధార్‌తోపాటు పాన్ వివరాలు తప్పనిసరి. అక్రమాస్తులతో పోగేసుకున్నవి కావడంతో ఈ భూములు వారి పేరిట ఉండవు. వీరంతా ఆధార్ వివరాలు సమర్పించకుండా ఉండడానికి బినామీ లావాదేవీల నిషేధ చట్టమే కారణమని గుర్తించారు. ఈ సవరణ చట్టం 2016 నవంబరు నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం, ఆస్తులను పిల్లలు, భార్య పేరిట కాకుండా ఇతరుల పేరిట కొనుగోలు చేయడం చట్టవిరుద్ధం. ఆదాయం ఆధారంగానే ఆస్తులు చూపించాలి. కానీ, వీవీఐపీలు తమ నల్లధనాన్ని రియల్ ఎస్టేట్‌లో పెడుతున్నారు. దాంతో, నోట్ల రద్దు తర్వాత బినామీ చట్టంపై కేంద్రం క్రియాశీలంగా కదిలింది. బినామీ ఆస్తులను గుర్తిస్తే స్వాధీనం చేసుకోవడమే కాకుండా జరిమానాతోపాటు జైలుశిక్ష పడే అవకాశాలున్నాయి. దాంతో, స్థిరాస్తుల వివరాలను బయట పెట్టకుండా దాచి పెట్టుకోవడానికే బడాబాబులు మొగ్గు చూపుతున్నారు.

ఆధార్ ఇవ్వకపోతే బినామీలే

- భూ యజమానులకు సీఎం హెచ్చరిక
- పాస్ బుక్‌కు అనుసంధానం చేయాల్సిందేనని వ్యాఖ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భూ రికార్డుల నవీకరణకు ఆధార్ వివరాలు అందించకపోతే ఆ భూములను బినామీ ఆస్తులుగా గుర్తిస్తామని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. పాస్ పుస్తకానికి ఆధార్ నంబరును కచ్చితంగా అనుసంధానం చేయాలని, ఆధార్ కార్డులోని ఫొటోనే పాస్ బుక్‌లో ముందు పేజీలో ఉంటుందని స్పష్టం చేశారు. భూ రికార్డుల నవీకరణ పూర్తయిందని, అన్ని ఖాతాలకు ఆధార్ వివరాలు సేకరిస్తున్నామని, అయితే, శివారు జిల్లాలు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి తదితర జిల్లాల్లో భూ యజమానులు ఆధార్ వివరాలను ఇవ్వడం లేదని అధికారులు నివేదించారు. దీనిపై సీఎం తీవ్రంగా స్పందించారు. భూ రికార్డులకు ఆధార్ నంబరును లింక్ చేయడానికి కొంతమంది ముందుకు రావడం లేదని, ఇప్పటికైనా వారు ఆధార్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలని, లేకపోతే ఆ భూములను బినామీ ఆస్తులుగా గుర్తించాల్సి వస్తుందని ప్రకటించారు. పట్టాదార్ పాస్ పుస్తకాలపై శుక్రవారం ప్రగతి భవన్‌లో నిర్వహించిన సమీక్షలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భూ రికార్డులను పక్కాగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఆధార్ నంబరును అనుసంధానం చేయాలని నిర్ణయించామని, మేడ్చల్, రంగారెడ్డితోపాటు కొన్ని జిల్లాల్లో కొందరు ఆధార్ నంబరును అనుసంధానం చేయించుకోలేదని, నంబరు ఇవ్వని వారిని బినామీలుగా గుర్తిస్తామన్నారు.

జిల్లాలు	ఖాతాలు	ఆధార్ ఇచ్చిన శాతం	మొబైల్ నెంబర్లిచ్చిన %
మేడ్చల్ మల్కాజ్‌గిరి	65,022	32,289 (65.4%)	39.16 %
యాదాద్రి భువనగిరి	244,881	1,76,354 (72.02%)	53.30 %
రంగారెడ్డి	3,39,949	2,70,033 (72.99%)	63.27 %
వికారాబాద్	2,65,157	1,86,715 (70.42%)	38.98 %
సంగారెడ్డి	3,56,567	2,63,376 (73.86%)	41.13 %
సిద్దిపేట	3,50,192	2,38.496(68.10%)	43.87 %
మెదక్	2,62,156	1,98,405(75.68%)	58.06 %

చట్టపరంగా చర్యలకు ఆర్‌జియో హెచ్చరిక

న్యూఢిల్లీ : టెలికామ్ కంపెనీల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం రచ్చకెక్కింది. ట్రాయ్ తమకు అనుకూలంగా వ్యవహరిస్తుందంటూ సిఒఎఐ చేస్తున్న ఆరోపణలపై రిలయన్స్ జియో తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఎయిర్‌టెల్ వంటి సభ్య కంపెనీలకు వంతపాడుతూ తమ ప్రతిష్ఠను దెబ్బతీసే ఈ దురుద్దేశపూరిత వ్యాఖ్యలను కాయ్ చేస్తోందని జియో ఆరోపించింది. ఈ అనుచిత వైఖరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కొందరు సభ్యుల ప్రోద్బలంతో కాయ్ జారీ చేస్తున్న ప్రకటనలు తమ ప్రతిష్ఠను మంటగలిపేట్టుగా ఉన్నాయని, కస్టమర్లలో తమ పట్ల ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేట్టుగా ఉన్నాయని ఆర్‌జియో పేర్కొంది. కాయ్, మరికొందరు టెలికామ్ ఆపరేటర్లపై పరువు నష్టం దావా వేసేందుకు వెనకాడమని హెచ్చరించింది.

ఫార్మా పరిశోధనలకు జుగాడ్ ఫార్ములా

చౌక ఔషధాలే ఆర్ అండ్ డి లక్ష్యం కావాలి.. సిఇఒల కాన్‌క్లేవ్‌లో తెలంగాణ ఐటి మంత్రి కెటిఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తక్కువ పెట్టుబడులు, అందుబాటులో ఉన్న వనరులతోనే చౌక ఔషధాలను ఆవిష్కరించగలిగే జుగాడ్ ఫార్ములా అవసరమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు అన్నారు. ప్రభుత్వాలకు ఆలోచనలకు కొదవలేకపోయినప్పటికీ పరిశోధనల కోసం భారీగా పెట్టుబడులు పెట్టే వెసులుబాటు లేదన్నారు. కాబట్టి సంస్థలే పెట్టుబడుల పెట్టేందుకు ముందుకు రావాలన్నారు. బయోఏషియా సదస్సులో జరిగిన ఫార్మా సిఇఒల కాంక్లేవ్‌లో మంత్రి మాట్లాడుతూ.. భారత ఔషధ రంగం అంతర్జాతీయంగా పోటీపడుతున్నదన్న విషయాన్ని ఆకలింపు చేసుకోవడంలో కొన్నిసార్లు ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు.

స్పెషాలిటీ డ్రగ్స్, నూతన ఆవిష్కరణలపై మరింత కృషి చేయడంతోపాటు గ్లోబల్ మార్కెట్లో పోటీని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోగలిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్థలకు తగిన వ్యాపార నిర్వహణ వాతావరణాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే ఈ ఇండస్ట్రీ గత రెండు దశాబ్దాల్లో కనబర్చిన వ్యాపార వృద్ధిని కొనసాగించలేకపోవచ్చని, గతంలోలాగ ఉద్యోగావకాశాలు కల్పించలేకపోవచ్చన్నారు.

ఫార్మా రంగ అభివృద్ధికి అన్ని విధాలా కృషి

ఫార్మా పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రధానంగా మూడు విధాలుగా కృషి చేస్తోందని కెటిఆర్ తెలిపారు. హైదరాబాద్‌కు దగ్గర్లో ప్రపంచస్థాయి ప్రమాణాలు, మౌలిక వసతులతో కూడిన ఫార్మా సిటీని ఏర్పాటు చేస్తోందన్నారు. ఇది ప్రపంచంలో అతిపెద్ద ఫార్మా క్లస్టర్‌కానుందన్నారు. జినోమ్ వ్యాలీ విస్తరణ చేపట్టనున్నామని, ఇది ఔషధ ఆవిష్కరణలకు హబ్‌గా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాదు వ్యాపారాల్లో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఆర్ అండ్ డిలో పెట్టుబడులు పెరగాలి

పరిశోధన అవసరాల కోసం ప్రభుత్వాలు కేటాయిస్తున్న పెట్టుబడులు పెరగాల్సిన అవసరం ఉందని కెటిఆర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఇందుకుగాను కేటాయింపులు ఒకశాతంలోపేనన్నారు. కనీసం 5 శాతం వరకు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధనల కోసం ప్రభుత్వం ప్రైవేట్ సెక్టార్‌తో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం హైబ్రిడ్ మోడల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ప్రైవేట్ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు కల్పించగలగాలని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం సిసిఎంబి వంటి ప్రఖ్యాత పరిశోధన సంస్థలతో కలిసి నూతన ఆవిష్కరణల దిశగా కృషి చేస్తోందన్నారు. సిఇఒ కాంక్లేవ్‌లో 'భారత లైఫ్ సైన్సెస్ రంగంలో పురోగతికి చికిత్సా పత్రం' అనే అంశంపై జరిగిన చర్చలో ఫార్మా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు వ్యక్తపర్చిన అభిప్రాయాలు..

నియంత్రణ వ్యవస్థల్లో మార్పులు: డిసిజిఐ

ఏ పరిశ్రమైనా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే ముందస్తుగా అంచనా వేయగలిగిన, నిలకడైన నియమావళితోపాటు పారదర్శకత చాలా కీలకమని డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఇండియా (డిసిజిఐ) ఈశ్వర రెడ్డి అన్నారు. ఔషధ చట్టంలో నిబంధనలు ఎప్పటికప్పుడు మారుతూ రావడంతో ఇండస్ట్రీ ఇబ్బందులెదుర్కోవాల్సి వచ్చిందన్నారు. నియంత్రణ మండలిని ఈ విషయాన్ని గ్రహించి అన్ని రకాల ఔషధాలు, వైద్య పరికరాలకు సంబంధించి నియమావళిని క్రమబద్ధీకరించే దిశగా కృషి చేస్తోందన్నారు. మరికొద్ది నెలల్లో దేశంలోని నియంత్రణ వ్యవస్థలతోపాటు నియంత్రణ మండళ్ల నిర్వహణ తీరులోనూ గణనీయమైన మార్పు రానుందన్నారు. పరిశ్రమలో సాంకేతికపరమైన ఆధునీకరణలకు అనుగుణంగా నియంత్రణ మండలి కూడా అప్‌డేట్ కావాలని, పర్యవేక్షక సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోవాలన్నారు.



సిఇఒల కాన్‌క్లేవ్‌లో ఐటి మంత్రి కెటిఆర్, ఈశ్వర రెడ్డి, కిరణ్ మజుందార్ షా, సతీష్ రెడ్డి

మరిన్ని ప్రోత్సాహకాలివ్వాలి

అంతర్జాతీయంగా ఔషధాల ధరలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో దేశీయ జనరిక్స్, బయోసిమిలర్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా అన్నారు. అందుబాటులో ఉండే ఔషధాల కోసం మరింత కృషి జరగాలంటే భారీగా పెట్టుబడులు అవసరమన్నారు. ఫార్మా ఆర్ అండ్ డి పెట్టుబడులకు ప్రభుత్వం నుంచి తగినంత ప్రోత్సాహం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ఇన్వెస్ట్‌మెంట్లపై పన్ను మినహాయింపును ప్రస్తుతమున్న 150 శాతం నుంచి మళ్లీ 200 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ఔషధాల ఆవిష్కరణను ప్రోత్సహించగలిగే పెట్టుబడి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

నిబంధనల మార్పుతో పెట్టుబడులపై ప్రభావం

దేశంలో ఔషధ ధరల నియంత్రణ నిబంధనల్లో స్థిరత్వం అవసరమని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి అభిప్రాయపడ్డారు. నిలకడైన నిబంధనలు లేకపోవడం సంస్థల పెట్టుబడుల ప్రణాళికలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. నిబంధనల సవరణ విషయంలో నియంత్రణ మండలి ఇండస్ట్రీ వర్గాలతో కలిసి పని చేయాల్సిన అసవరం ఉందన్నారు. ఔషధ ఆవిష్కరణల విషయంలో చైనాతో పోలిస్తే భారత్ వెనకబడిందని సతీష్ రెడ్డి అన్నారు. అక్కడి ప్రభుత్వం ఫార్మా పరిశోధనలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. మన దేశంలో మాత్రం సంస్థలే పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని, ప్రభుత్వం కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ అండ్ డిలో ఇన్వెస్ట్ చేసే కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఫార్మా ఆవిష్కరణలకు ప్రత్యేక విభాగం

- జనరిక్‌ను ప్రత్యేకంగా నిర్వచించాల్సిన సమయం ఆసన్నమైంది
- డిసిజిఐ ఈశ్వర రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఇండియా (డిసిజిఐ) ఎస్ ఈశ్వర రెడ్డి తెలిపారు. మరో 2-3 వారాల్లో ఈ విభాగాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని బయోఏషియా సదస్సులో మీడియాతో చెప్పారు. ఆవిష్కరణలకు తగిన ప్రోత్సాహం లభించడం లేదని సదస్సులో పలువురు పరిశ్రమ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారని, అందుకే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు, తానే ఈ సెల్‌కు అధ్యక్షత వహించనున్నట్లు డిసిజిఐగా ఈమధ్యే బాధ్యతలు చేపట్టిన రెడ్డి వెల్లడించారు. తద్వారా ఫార్మా రంగ ఆవిష్కరణకర్తలకు, నియంత్రణ మండలికి మధ్య సంప్రదింపుల పరంగా నెలకొన్న అంతరాన్ని పూడ్చడంతోపాటు ఔషధాల ఆవిష్కరణ, వాటి కమర్షియలైజేషన్ పరంగావారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. ఈ విభాగం కోసం శాశ్వత ప్రాతిపదకన సిబ్బందిని నియమించడంతోపాటు అనుమతుల కోసం తగిన వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ప్రస్తుతం డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ చట్టంలో 'జనరిక్ ఔషధం' అని ప్రత్యేక పదమేదీ లేదని, కేవలం కొత్త ఔషధం, ఔషధం అనే నిర్వచనాలు మాత్రమే ఉన్నాయని రెడ్డి తెలిపారు. ఏదైనా ఔషధం నియంత్రణ మండలి అనుమతులు పొందినప్పటి నుంచి నాలుగేళ్ల వరకు కొత్తఔషధంగా పరిగణించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీ అంతర్జాతీయంగా విస్తరిస్తున్న తీరును బట్టి చూస్తే జనరిక్ ఔషధం అనే పదాన్ని ప్రత్యేకంగా నిర్వచించాల్సిన సమయం ఆసన్నమైందని రెడ్డి అభిప్రాయపడ్డారు. అయితే, ఇది ఎప్పటిలోగా సాధ్యపడవచ్చన్న విషయాన్ని మాత్రం ఆయన చెప్పలేనన్నారు.

ఫార్మా రంగానికి ఐర్లాండ్‌లో అపార అవకాశాలు

- ఐడిఎ ఐర్లాండ్ హెడ్ ఆండ్రూ వోగెలార్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారతీయ ఫార్మా కంపెనీలకు ఐర్లాండ్‌లో అపార అవకాశాలున్నాయని ఐడిఎ ఐర్లాండ్ హెడ్ ఆండ్రూ వోగెలార్ అన్నారు. శుక్రవారం నాడిక్కడ బయో ఏషియా సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరోపియన్ దేశాలు సహా అమెరికా మార్కెట్లలోకి సులువుగా అడుగుపెట్టేందుకు అవసరమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యుఎస్ ఎఫ్‌డిఎ, యూరోపియన్ నియంత్రణ మండలి నుంచి అనుమతులు త్వరితగతిన అందుకోవటమే కాకుండా ఫార్మా కంపెనీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అక్కడ ఉన్నాయని ఆండ్రూ చెప్పారు. ఇప్పటికే వోకార్డ్ వంటి సంస్థలతో పాటు మరికొన్ని బయోలాజికల్ కంపెనీలు ఐర్లాండ్‌లో తమ యూనిట్లను ప్రారంభించాయని తెలిపారు. ఎపిఐ, బల్క్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్ రంగాల్లో పెట్టుబడులకు పెద్దఎత్తున అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఐర్లాండ్‌లో పన్ను రేట్లు కూడా చాలా తక్కువని అన్నారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు ఐర్లాండ్ ఎంతో కీలకంగా ఉందని, గడచిన యాభై ఏళ్లలో ఈ రంగానికి అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

రెండేళ్లలో 500 'సెలెక్ట్' మొబైల్ స్టోర్లు

- రూ.200 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మొబైల్ రిటైల్ మార్కెట్లోకి 'సెలెక్ట్'పేరుతో మరో మొబైల్ రిటైల్ స్టోర్ బ్రాండ్ అడుగుపెట్టింది. తొలి దశలో 500 స్టోర్లను ఏర్పాటు చేయటం ద్వారా దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సెలెక్ట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై గురు చెప్పారు. శుక్రవారంనాడిక్కడ ఆయన దేశవ్యాప్తంగా రిటైల్ నెట్‌వర్క్ కలిగిన తొలి మల్టీ రిటైల్ బ్రాండ్ సెలెక్ట్ అని ఆయన తెలిపారు. మార్చి 15న హైదరాబాద్‌లో 23, తిరుపతిలో 2 స్టోర్లను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో 40 శాతానికి పైగా విక్రయాలు రిటైల్ స్టోర్ బ్రాండ్ ద్వారానే సాగుతుండగా, తూర్పు, ఉత్తరాది మార్కెట్లలో ఇలాంటి ఫార్మాట్లతో కూడిన స్టోర్లు లేవని ఆయన పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తొలుత దక్షిణాది మార్కెట్లో కార్యకలాపాలు ప్రారంభించి అనంతరం తూర్పు రాష్ట్రాల మార్కెట్లలోకి సెలెక్ట్‌ను విస్తరించాలని నిర్ణయించినట్లు గురు చెప్పారు. తొలి దశలో రెండేళ్ల వ్యవధిలో 500 స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం 200 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు గురు వెల్లడించారు. అంతర్గత వనరులు, బ్యాంకుల నుంచి ఈ మొత్తాలను సమీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కో స్టోర్ కోసం ప్రాంతాన్ని బట్టి 25 లక్షల రూపాయల నుంచి కోటి రూపాయల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. రెండో దశలో 200 స్టోర్లు మలి దశలో మరో 300 స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా సెలెక్ట్ స్టోర్లను 1000కి చేర్చనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో 750 స్టోర్లను ఉత్తరాది రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కంపెనీ ఏర్పాటు చేయనున్న స్టోర్ల కోసం సుమారు 3,000 మందిని తెలుగు రాష్ట్రాల నుంచే నియమించుకోనున్నట్లు గురు తెలిపారు.



నేటి నుంచే ఏపి భాగస్వామ్య సదస్సు

- విశాఖ వేదికగా నిర్వహణ
- రూ.3లక్షల కోట్ల ఒప్పందాలు లక్ష్యం

అమరావతి, విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు విశాఖపట్నం ముస్తాబైంది. వరుసగా మూడో ఏడాది ఈ ఆర్థిక నగరంలో శనివారం నుంచి పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయింది. గత రెండు సదస్సుల సందర్భంగా రూ. 14 లక్షల కోట్ల విలువైన ఎంఒయులను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకొంది. ఈ క్రమంలో ఈసారి రూ.మూడు లక్షల కోట్లకు పైగానే ఒప్పందాలు ఖరారు కానున్నాయని పరిశ్రమల శాఖ మంత్రి ఎన్ అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. సిఐఐ భాగస్వామ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్ ప్రభు, కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శితో సహా ఇతర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. 15 దేశాలకు చెందిన వాణిజ్య శాఖల మంత్రులు కూడా పాల్గొననున్నారు. గత రెండేళ్లలో 18 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 1,817 ప్రాజెక్టులకు సంబంధించి ఎంఒయులు కుదిరాయి. కియ, హెచ్‌సిఎల్, ఇసుజు, హీరో వంటి దిగ్గజ సంస్థలతో సహా పలు ఐటి ఆధారిత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో, ఈ ఏడాది మాత్రం వాస్తవ పారిశ్రామిక అవగాహనా ఒప్పందాలను మాత్రమే చేసుకోవాలన్న యోజనలో ఉంది. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చే సంస్థలతోనే అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

కాకినాడ పెట్రోకెమికల్స్ ప్లాంట్‌లో సౌదీ అరామ్కోకు వాటా!

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద ఉన్న 33,000 కోట్ల రూపాయల పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లో వాటాలను కొనుగోలు చేసేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ సంస్థ సౌదీ అరామ్కో ఆసక్తి చూపిస్తోందని పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. కాకినాడ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌తో పాటు మహారాష్ట్రలో 1.8 లక్షల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయదలిచిన రిఫైనరీలో కూడా వాటాను తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తోందని ఆయన చెప్పారు. సౌదీ అరేబియా ఇంధన శాఖ మంత్రి ఖలీద్ అల్ ఫలీహ్‌తో చర్చలు జరిపిన అనంతరం ఈ రెండు రిఫైనరీల్లో వాటాలను తీసుకునేందుకు ఆసక్తిని చూపించారని ప్రధాన్ తెలిపారు. ప్రస్తుతం వాటాల కొనుగోలుకు సంబంధించి విధివిధానాలపై చర్చించాల్సి ఉందని ఆయన చెప్పారు. కాకినాడలో 15 లక్షల టన్నుల సామర్థ్యం గల పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను హెచ్‌పిసిఎల్, గెయిల్ అభివృద్ధి చేస్తున్నాయి.

హైదరాబాద్‌లో ఆక్వా ఎక్స్‌పో

భీమవరం : ఆక్వా రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక టెక్నాలజీలపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు దక్షిణాసియా దేశాల స్థాయిలో మార్చి 15 నుంచి 17వ తేదీ వరకు ఆక్వా ఎక్స్ ఇండియా 2018 పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డెల్టా ఆక్వా రైతుల సంఘం అధ్యక్షులు వేగేశ్న రామచంద్రరాజు చెప్పారు. దీనికి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రభుత్వాలు, జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ, వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీతోపాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సహకారం అందిస్తున్నాయని తెలిపారు.ప్రస్తుతం రైతులు చేస్తున్న సాగులో మార్పులు తెస్తే మెరుగైన ఉత్పత్తి సాధించగలమన్నారు.

పాశమైలారంలో రూ.30 కోట్లతో కాలుష్య శుద్ధి ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): పాశమైలారం పారిశ్రామికవాడలోని ఫార్మా ఉత్పత్తులతో ఏర్పడే కాలుష్యాన్ని సమూలంగా నియంత్రించేందుకు టిఎస్‌ఐఐసి సుమారు రూ. 30 కోట్లతో సామూహిక కాలుష్య శుద్ధి యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది. మెదక్ జిల్లా పటాన్‌చెరు ప్రాంతంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో వెలిసిన పరిశ్రమలు వెలువరించే వ్యర్థ రసాయనాలు, మురుగుతో పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కలుషితమవుతున్నట్టు ఫిర్యాదులున్నాయి. దీనిపై అధ్యయనం జరిపిన కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ పాశమైలారంలోని ఫార్మా కంపెనీల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలతో దాదాపు అయిదారు కిలో మీటర్ల పరిసరాల్లోని భూగర్భ జలాలు, వ్యవసాయ భూములు కాలుష్యంతో నిండిపోతున్నట్టు నిర్ధారించారు. ఫార్మా కంపెనీలను తరలించడం సాధ్యం కానందున ఇక్కడే కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేయడానికి కామన్ అఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను (సిఇటిపి) ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో టిఎస్‌ఐఐసి ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది.

క్రూడ్ ధర హేతుబద్ధంగా ఉంచండి

- సౌదీకి భారత్ సూచన



న్యూఢిల్లీ : భారత్‌కు సరఫరా చేసే క్రూడాయిల్ ధర హేతుబద్ధంగా ఉండేలా చూడాలని సౌదీ అరేబియాను కేంద్రం అభ్యర్థించింది. ఇలా చేయడం వల్ల ప్రపంచంలోనే మూడో పెద్ద ఆయిల్ వినియోగదేశం అయిన భారత్‌కు క్రూడాయిల్ సరఫరా చేస్తున్న దేశాల్లో రియాద్ అగ్రస్థానం తిరిగి సాధించగలుగుతుందని తెలిపింది. ఆయిల్ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయం తెలిపారు. సౌదీ అరేబియా ఆయిల్ శాఖ మంత్రి ఖలీద్ అల్ ఫలీతో సమావేశమైన సందర్భంగా ఈ అంశం ప్రముఖంగా ప్రస్తావిస్తూ ఉభయులకు ప్రయోజనకరంగా ఉండే విధంగా ధర నిర్ణయం ఉండాలని కోరినట్టు చెప్పారు. సౌదీ అరేబియాను పక్కకు నెట్టి భారత్‌కు క్రూడాయిల్ సరఫరా చేసే ప్రధాన దేశంగా నంబర్ వన్ స్థానాన్ని 2017 సంవత్సరంలో ఇరాక్ ఆక్రమించింది. భారత్‌లో నిర్మాణంలో ఉన్న వ్యూహాత్మక ఆయిల్ రిజర్వ్‌లో కూడా సౌదీకి వాటా ఇవ్వడానికి ప్రతిపాదన చేసినట్టు ప్రధాన్ చెప్పారు. 60 లక్షల టన్నుల వ్యూహాత్మక ఆయిల్ రిజర్వ్ చేతిలో ఉంచుకునే లక్ష్యంతో భారత్ ఇప్పటికే మూడు ప్రదేశాల్లో నిల్వ వసతుల నిర్మాణం పూర్తి చేయగా నాలుగో వసతి కూడా నిర్మాణంలో ఉంది. అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీకి ఇచ్చిన మాదిరిగానే సౌదీ అరామ్కోకు వాటా ఇచ్చే విషయం మరింతగా చర్చించాలనుకుంటున్నామని, వారి నుంచి కూడా దానికి ఆసక్తి వ్యక్తం అయిందని ఆయన అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద క్రూడాయిల్ ఉత్పత్తి సంస్థ అయిన సౌదీ అరామ్కో మార్కెట్ వాటా పెంచుకోవడం, తమ క్రూడాయిల్‌కు నిలకడగా మార్కెట్ ఉండేలా చూసుకోవడం లక్ష్యంగా విదేశాల్లో ఆయిల్ రిఫైనరీల నిర్మాణంలో ఇన్వెస్ట్ చేస్తోంది. ప్రధానంగా ఇండోనేషియా, మలేషియాల్లో దీర్ఘకాలిక ఆయిల్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకుంది.

బిఎండబ్ల్యు మోటరాడ్ బైక్స్ ధరల తగ్గింపు

ముంబై : జర్మనీకి చెందిన బిఎండ బ్ల్యు గ్రూప్ సంస్థ బిఎండబ్ల్యు మోటరాడ్ తన ప్రీమియం మోటార్ సైకిళ్ల ధరలను 10 శాతం వరకు తగ్గించింది. అడ్వెంచర్, స్పోర్ట్, టూరింగ్, హెరిటేజ్, రోడ్‌స్టర్ కేటగిరీల్లో బైకులకు ఈ తగ్గింపు వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. ధరల తగ్గింపుతో మరికొంత మంది బైక్‌ల ప్రియులు బిఎండబ్ల్యు మోటార్‌సైకిళ్ల అనుభూతిని ఆస్వాదించే అవకాశం లభిస్తుందని బిఎండబ్ల్యు గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పవా తెలిపారు. గత ఏడాదిలో కంపెనీ తన ప్రీమియం బైక్‌ల విక్రయాలను దేశీయ మార్కెట్లో ప్రారంభించింది. 12 మోడళ్ల ద్వారా తొమ్మిది నెలల కాలంలోనే 252 బైక్‌లను విక్రయించింది. అహ్మదాబాద్, బెంగళూరు, ముంబై, పుణె, ఢిల్లీ, చెన్నై, కోచిలోని ఔట్‌లెట్ల ద్వారా బైక్‌లను కంపెనీ విక్రయిస్తోంది.

ఏసిసిఎ కోర్సులతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అకౌంటింగ్ విభాగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, కంపెనీల అవసరాలకు అనుగుణంగా కోర్సులను అందిస్తూ ఫైనాన్షియల్ ప్రొఫెషనల్స్‌కు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్టు లండన్ కేంద్రంగా ఉన్న అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఎసిసిఎ) ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ హెడ్ ఎండి సాజిద్ ఖాన్ తెలిపారు. తమ కోర్సులను ఆఫర్ చేసేందుకు గాను దేశీయంగా ఉన్న ఇనిస్టిట్యూషన్లు, యూనివర్సిటీలతో చేతులు కలుపుతున్నామని చెప్పారు. ఇప్పటికే దేశీయంగా సిఎ, సిఎస్, సిఎంఎ కోర్సులను ఆఫర్ చేస్తున్న 40 ఇనిస్టిట్యూట్లతో ఒప్పందం చేసుకున్నామని, 8 విశ్వవిద్యాలయాలతో కలిసి పని చేస్తున్నామని శుక్రవారంనాడిక్కడ ఎఫ్‌టాప్సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఇప్పటికే 600 మందికి ఎసిసిఎ సర్టిఫికేషన్ లభించిందని, వీరికి దేశ విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభించాయని చెప్పారు. మూడేళ్ల కాలపరిమితి ఉండే ఎసిసిఎ కోర్సులను పూర్తి చేయడం ద్వారా అకౌంటింగ్ రంగంలో ఉద్యోగాలను పొందవచ్చన్నారు. ఇప్పటికే సిఎ, ఐసిడబ్ల్యుఎఐలను పూర్తి చేసిన వారు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు. 181 దేశాల్లో ఎసిసిఎ కోర్సులను అందిస్తున్నామని, ఇప్పటికే రెండు లక్షల మంది క్వాలిఫైడ్ సభ్యులు ఉన్నట్టు ఆయన చెప్పారు.

'వాట్సప్ లీక్' వీరులెవరో నిగ్గు తేల్చండి

- హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు సెబి ఆదేశం

న్యూఢిల్లీ: బ్యాంకు ఆర్థిక ఫలితాలను వాట్సప్ ద్వారా లీక్ చేసిన వ్యవహారంలో ఎవరెవరు బాధ్యులో గుర్తించాలని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌ను సెబి ఆదేశించింది. బ్యాంకులో సరైన నియంత్రణ లేకపోవడం వల్లనే ఈ బాగోతం జరిగినట్టు ప్రాథమిక ఆధారాలున్నాయని తెలిపింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆర్థిక ఫలితాలు ప్రకటించడానికి ముందే అందులోని విషయాలన్నీ వాట్సప్ ద్వారా వెలుపలికి చేరిన ఈ కేసు సంచలనం సృష్టించింది. వెనువెంటనే ఆ అంశంపై స్పందించిన సెబి భవిష్యత్తులో ఇలాంటివి చోటు చేసుకోకుండా నివారించేందుకు అంతర్గత వ్యవస్థలను పటిష్ఠం చేయాలని అప్పుడే మందలించింది. అంతర్గత విధానాలు, వ్యవస్థల ప్రస్తుత స్థితి, స్వభావాన్ని తెలియచేస్తూ వాటిని ఎలా పటిష్ఠం చేశారో తెలిపే ఒక నివేదిక పంపాలని కూడా ఆదేశించింది. అలాగే ఆ వ్యవస్థలను రోజువారీగా పర్యవేక్షించే ఉద్యోగుల పేర్లు తెలియచేయాలని కోరింది.

దేశీ మార్కెట్లోకి మైక్రోపోర్ట్ మోకాలు, తుంటి ఇంప్లాంట్‌లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : అమెరికాకు చెందిన మైక్రోపోర్ట్ సంస్థ భారత మార్కెట్‌లో అత్యాధునికమైన మోకాలు, తుంటి ఇంప్లాంట్‌లను ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా మైక్రోపోర్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రియాజ్ దేశాయ్ మాట్లాడుతూ తాము ఇప్పటివరకు హృద్రోగులకు ఉపయోగించే స్టెంట్లు మాత్రమే మార్కెటింగ్ చేస్తున్నామని, తాజాగా మోకాలు, తుంటి ఇంప్లాంట్లతో ఉత్పత్తుల శ్రేణిని మరింతగా విస్తరిస్తున్నామని తెలిపారు. ఈ ఇంప్లాంట్లతో పాటు తమ ఉత్పత్తులను శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లో జరుగనున్న ఆర్థోప్లాస్టీ సదస్సులో ప్రదర్శించబోతున్నామని చెప్పారు. 60 సంవత్సరాలకు పైగా జాయింట్ ఇంప్లాంట్ల తయారీలో పని చేస్తున్న రైట్ మెడికల్‌కు చెందిన ఆర్థో రికాన్ వ్యాపారాన్ని కొనుగోలు చేశామని ఆయన అన్నారు.

అమెరికా, యూరప్ సహా పలు దేశాలకు చెందిన వైద్యులు తమ ఇంప్లాంట్లను విరివిగా ఉపయోగిస్తున్నారని, భారత్‌లో కూడా పలు ప్రధాన ఆస్పత్రులతో సహకార ఒప్పందాలు కుదుర్చుకుని భారతీయ రోగులకు కూడా వాటిని విస్తృతంగా అందుబాటులోకి తెస్తున్నామని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో కూడా కిమ్స్, గ్లోబల్, మాక్సిక్యూర్, సన్‌షైన్ వంటి ప్రముఖ ఆస్పత్రులతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. తమ ఇంప్లాంట్లు ప్రస్తుతం వివిధ ఆస్పత్రులు వినియోగిస్తున్న వాటి కన్నా చాలా ఆధునికమైనవని, సాధారణ ఇంప్లాంట్లు వేయించుకున్న రోగులు ఎత్తైన ప్రదేశాలు ఎక్కడం, జాగింగ్ వంటివి చేయకూడదని, కాని తమ ఇంప్లాంట్లు వేయించుకున్న వారు ఈ పనులన్నీ చేయవచ్చునని దేశాయ్ వివరించారు. శస్త్ర చికిత్స సమయంలో పెట్టే కోత నిడివి తగ్గడం వల్ల రోగి కోలుకునే సమయం కూడా తక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. వీటిని ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లోనే అందుబాటులో ఉంచుతున్నామని ఆయన తెలిపారు.



వైకింగ్ ఎయిర్‌తో మహీంద్రా ఒప్పందం

చిన్న నగరాల కనెక్టివిటీపై దృష్టి



ముంబై : దేశంలో చిన్న నగరాలకు కనెక్టివిటీ అవకాశాలు నానాటికీ పెరుగుతూ ఉండడంతో ఒకరికి ఒకరు పోటీ కాని విధానంలో ఆ రంగంలో సహకరించుకునేందుకు కెనడాకు చెందిన వైకింగ్ ఎయిర్‌తో దేశీయ కార్పొరేట్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా అనుబంధ సంస్థ మహీంద్రా ఏరోస్పేస్ ఒప్పందం కుదుర్చుకుంది. గుర్తించిన ప్రదేశాల్లో నిర్దిష్ట నిర్వహణాపరమైన అవసరాలకు అనుగుణంగా కస్టమర్లకు సేవలందించనున్నట్టు రెండు కంపెనీలు ప్రకటించాయి. కెనడాలోని విక్టోరియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న వైకింగ్ ఎయిర్ యుటిలిటీ విమాన సర్వీసుల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ఇటు భూమి మీద నుంచి, అటు నీటి ఉపరితలం నుంచి కూడా నడపగల 19 సీటర్ ప్రయాణికుల ట్విన్ ఇంజన్ టర్బోప్రాప్ సీరీస్ 400 ట్విన్ ఆటర్ విమానాలు ఉత్పత్తి చేస్తుంది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత పర్యటన సందర్భంగా రెండు కంపెనీల మధ్య అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగినట్టు మహీంద్రా ప్రకటించింది. భారతకు చెందిన భిన్న భౌగోళిక స్వభావం గల మార్కెట్ ఉభయ సంస్థలకు ఏరోస్పేస్ విభాగంలో పరస్పర లాభసాటి అయిన విధంగా సహకారం అందించుకునేందుకు ఎన్నో మార్గాలు ముందుంచిందని ఆ ప్రకటనలో తెలిపారు. వైకింగ్ ట్విన్ ఆటర్ సీరీస్ 400 విమానాలు, 8 నుంచి 10 సీట్లున్న మహీంద్రా ఎయిర్ వ్యాన్ భిన్న భౌగోళిక ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించే కస్టమర్లకు చక్కని ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను అందుబాటులోకి తెస్తాయని పేర్కొన్నారు. ప్రాంతీయ కనెక్టివిటీలో కార్యకలాపాలు సాగించే కస్టమర్ల అవసరాలను తమ విమానాలు తీరుస్తాయని, చిన్న నగరాలకు విమాన సర్వీసులు నడపడానికి ఉద్దేశించిన ఉడాన్ స్కీమ్ మరింత చొచ్చుకుపోయేందుకు దోహదకారిగా ఉంటాయని మహీంద్రా ఏరోస్పేస్ ప్రెసిడెంట్ ఎస్‌పి శుక్లా అన్నారు. ప్రస్తుతం తాము ఎనిమిది సీట్లుండే యుటిలిటీ పిస్టన్ విమానం మహీంద్రా ఎయిర్ వ్యాన్ 8, 20 సీట్లుండే టర్బోప్రాప్ యుటిలిటీ విమానం మహీంద్రా ఎయిర్ వ్యాన్ 10 తయారుచేస్తున్నామని, రానున్న కాలంలో వాటిని ఫ్లై అండ్ ఫ్లోట్ వెర్షన్లు రెండింటిలోనూ విడుదల చేయాలనుకుంటున్నామని ఆయన చెప్పారు. సీరీస్ 400 ట్విన్ ఆటర్ విమానాలకు, ప్రత్యేకించి సీ ప్లేన్‌లకు భారత్‌లో అవకాశాలు అపారంగా ఉన్నాయని తాము భావిస్తున్నట్టు వైకింగ్ ఎయిర్ సిఇఒ డేవిడ్ కర్టిస్ అన్నారు.

కెనడాలో టెక్ మహీంద్రా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

» రూ.510 కోట్ల రూపాయల పెట్టుబడి


న్యూఢిల్లీ : ఐటి సర్వీసుల దిగ్గజం టెక్ మహీంద్రా కెనడాలో కృత్రిమ మేధస్సు, బ్లాక్ చెయిన్ టెక్నాలజీపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ) ఏర్పాటుకు సంసిద్ధత ప్రకటించింది. ఇందుకోసం 10 కోట్ల కెనడియన్ డాలర్ల (రూ.510 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్టు తెలిపింది. వివిధ రంగాల్లో ఇన్నోవేషన్‌కు దోహదం చేస్తున్న ప్రత్యేకించి ఫిన్‌టెక్, స్మార్ట్‌సిటీలకు ఉపయోగపడే టెక్నాలజీలు రెండింటి పైన ఈ కేంద్రం దృష్టి సారిస్తుందని టెక్ మహీంద్రా ఒక ప్రకటనలో తెలిపింది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత పర్యటన సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. ఈ కేంద్రం ఏర్పాటుతో అటు కెనడియన్లకు, ఇటు ఇండియన్లకు కీలకమైన ఆ రెండు టెక్నాలజీలను అందుకోవడంతో పాటు ఆయా రంగాల్లో ప్రతిభను పెంచుకుని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి వీలు కలుగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు. కొత్త ఆవిష్కరణలకు కెనడా ఇస్తున్న ప్రాధాన్యం, అక్కడ ఉన్న ప్రతిభావంతుల సంఖ్య కారణంగా ఇలాంటి సిఒఇ ఏర్పాటు చేయడానికి కెనడా ఆకర్షణీయమైన ప్రదేశంగా తాము భావించినట్టు చెప్పింది. దీనివల్ల ఇన్వెస్ట్‌మెంట్ విభాగంతో పాటు వ్యాపార, విద్యా రంగాలతో కూడా విస్తృత సహకారానికి అవకాశం ఉంటుందని తెలిపింది.



భారత ప్రీమియం
బైక్ విభాగంపై కవసాకి ఆసక్తి

కోల్‌కతా : గత ఏడాది ఏప్రిల్‌లో బజాజ్ ఆటోతో బంధాన్ని తెగతెంపులు చేసుకున్న ఇండియా కవసాకి మోటార్ దేశంలో ప్రీమియం బైక్ల విభాగంలో వివిధ రకాల బైక్లు ప్రవేశపెట్టాలని ఆసక్తిగా ఉంది. దేశంలో అధిక ధర పలికే హైఎండ్ బైక్‌లకు గిరాకీ అధికంగా ఉన్నదని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యుతాకా యమషితా అన్నారు. డీమానిటైజేషన్, జిఎస్‌టి ప్రభావాలున్నప్పటికీ ప్రజల ఆదాయాలు పెరుగుతూ ఉండడం ప్రీమియం బైక్లకు కలిసి వచ్చే అంశమని, ఈ మార్కెట్ ఏడాదికి 30 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం ఇండియా కవసాకి మోటార్ పుణెలోని సొంత ప్యాక్టరీలో 300 సిసి నుంచి 1400 సిసి రేంజిలో బైకులను అసెంబుల్ చేసి మార్కెటింగ్ చేస్తోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు దేశంలో 1500 ప్రీమియం బైకులు విక్రయించినట్టు ఆయన చెప్పారు. దేశంలో డెవలప్‌మెంట్ సెంటర్లతో పాటు 22 డీలర్‌షిప్‌లు కూడా నడుపుతున్నట్టు ఆయన చెప్పారు.



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,480	31,430	31,500	31,350	30,580
(క్రితం ముగింపు)	31,450	—	31,470	31,300	30,540
22 క్యారెట్లు	29,150	29,150	28,980	29,070	29,120
(క్రితం ముగింపు)	29,120	—	28,750	28,980	29,090
వెండి (కిలో)	39,700	40,000	39,500	39,700	41,600
(క్రితం ముగింపు)	39,600	—	39,600	39,500	41,400



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	75.00	విజయవాడ	79.00
కరీంనగర్	76.00	గుంటూరు	79.00
వరంగల్	77.00	ఒంగోలు	81.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	75.00
కర్నూలు	75.00	నెల్లూరు	75.00
విశాఖపట్నం	83.00		
గోదావరి	78.00	అనంతపురం	76.00



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	355.00	చిత్తూరు	388.00
వరంగల్	357.00	చెన్నై	395.00
విజయవాడ	363.00	నమక్కల్	380.00
గోదావరి	363.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	365.00	ముంబై	400.00



ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.04	68.45
పౌండ్	82.35	95.52
యూరో	72.66	84.25
ఆస్ట్రేలియా డాలర్	46.21	53.48
బహ్రెయిన్ దినార్	159.88	183.22
కువైట్ దినార్	179.06	222.91
ఒమన్ రియాల్	156.56	179.12
సౌదీ రియాల్	15.69	18.61
సింగపూర్ డాలర్	44.70	52.95
యుఎఇ దిరమ్	16.07	18.78

కావేరి హాస్పిటల్స్ విస్తరణ

» హైదరాబాద్, బెంగళూరుల్లో హాస్పిటల్స్ ఏర్పాటు

» ఈ నెల 23 నుంచి 25 వరకు మెడికల్ ఎక్స్‌పో

» సిఇఒ మణివణ్ణన్ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : తమిళనాడు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కావేరి హాస్పిటల్స్, హైదరాబాద్‌లో హాస్పిటల్‌ను ఏర్పాటు చేసేందుకు రెడీ అవుతోంది. శుక్రవారం నాడిక్కడ మెడికల్ ఎక్విప్‌మెంట్ ట్రేడ్ ఫెయిర్ మెడికల్‌ఎక్స్‌పో ప్రారంభించిన సందర్భంగా మెడిఎక్స్‌పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ లిమిటెడ్ సిఇఒ, కావేరి హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ మణివణ్ణన్ వెల్లడించారు. ప్రస్తుతం తమిళనాడులో కావేరి హాస్పిటల్స్ 1000 పడకల సామర్థ్యం గల హాస్పిటల్స్‌ను నిర్వహిస్తోందని, కార్యకలాపాల విస్తరణలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు నగరాలకు విస్తరించాలని చూస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం హాస్పిటల్ టర్నోవర్ 350 కోట్ల రూపాయలుగా ఉందని వచ్చే మూడేళ్ల కాలంలో ఇది 1,000 కోట్ల రూపాయలకు చేరుకుంటుందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని హాస్పిటల్స్, మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను కొనుగోలు చేయడంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని బి2బి హాస్పిటల్ ఎక్విప్‌మెంట్ ఎక్స్‌పోను ప్రారంభించామని, ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో ఈ ఎక్స్‌పోను నిర్వహించడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 25 వరకు జరుగనున్న ఈ ఎక్స్‌పోలో 180 మంది ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని ఆయన చెప్పారు. కాగా ఈ ఎక్స్‌పో ద్వారా 30 కోట్ల రూపాయల వ్యాపారాన్ని అంచనా వేస్తున్నట్లు మణివణ్ణన్ తెలిపారు.

మళ్లీ 34000 ఎగువకు సెన్సెక్స్

మార్చి డెరివేటివ్స్‌కు శుభారంభం.. 323 పాయింట్లు అప్

ముంబై : స్టాక్ మార్కెట్ మార్చి నెల డెరివేటివ్స్ సీరీస్‌కి శుభారంభం పలికింది. కీలక సూచీలు రెండూ మంచి లాభాలతో ముగిశాయి. దీనికి తోడు రూపాయి మారకం పుంజుకుని 31 పైసలు బలపడడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌కు దోహదపడింది. ఉదయం ట్రేడింగ్‌లోనే పాజిటివ్‌గా ప్రారంభమైన సెన్సెక్స్ వెనువెంటనే ర్యాలీ బాట పట్టి కీలక స్థాయి 34000ని దాటింది. ఇంట్రాడేలో 34167.60 పాయింట్లను తాకి చివరికి 322.65 పాయింట్ల లాభంతో 34142.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ నెల 15వ తేదీ తర్వాత సెన్సెక్స్ నమోదు చేసిన గరిష్ఠ స్థాయి ఇదే. నిఫ్టీ కూడా 108.35 పాయింట్ల లాభంతో 10491.05 పాయింట్ల వద్ద క్లోజయింది. పిఎన్‌బి కుంభకోణంతో వరుస పతనాలు నమోదు చేస్తున్న మార్కెట్‌కు ఈ ర్యాలీ కాస్తంత ఊరట అయినప్పటికీ ఇది ప్రధానంగా ఓవర్‌సోల్డ్ స్థితి వల్ల వచ్చిందన్న విషయం గమనించాలని మార్కెట్ వర్గాలంటున్నాయి. అయితే అన్ని రంగాల్లోను కొనుగోళ్లు జరగడంతో పాటు మెటల్, ఫార్మా షేర్లు ఈ ర్యాలీకి అండగా నిలిచాయని వారు చెప్పారు. హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఆర్ఐఎల్, వేదాంత, ఐటిసి, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా ఇండెక్స్ జోరుకు దోహదపడ్డాయి. ఈ ర్యాలీ వచ్చే వారంలో కూడా కొనసాగవచ్చునని, 10600 వద్ద నిఫ్టీకి బలమైన నిరోధం ఉన్నదని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ అన్నారు.


• ఉత్తరప్రదేశ్‌లో 981 కోట్ల రూపాయల విలువ గల హైవే ప్రాజెక్టు కాంట్రాక్టు తమకు లభించినట్టు సద్భావ్ ఇంజనీరింగ్ ప్రకటించింది.

క్యుఐపి ద్వారా రూ.3,500 సమీకరణ

అర్హులైన సంస్థాగత ఇన్వెస్టర్లకు ఈక్విటీ షేర్లు కేటాయించడం ద్వారా 3500 కోట్ల రూపాయలు సమీకరించినట్టు మొబైల్ ఆపరేటర్ ఐడియా సెల్యులార్ ప్రకటించింది. ఒక్కోటి 82.50 రూపాయల ధరపై మొత్తం 42.42 కోట్ల ఈక్విటీ షేర్లను క్యుఐపి ద్వారా కేటాయించినట్టు తెలియచేసింది. ఇండస్ టవర్స్‌లో తమకు గల 11.15 శాతం షేర్లను కూడా విక్రయించే అవకాశం పరిశీలిస్తున్నామని, ఈ నిధులు వొడాఫోన్‌తో విలీనం అయ్యే ఉమ్మడి సంస్థ ఆర్థిక పటిష్ఠతకు దోహదపడతాయని ఆ ప్రకటనలో తెలిపింది.

జనవరిలో 84 పిఇ డీల్స్

జనవరి నెలలో గత ఏడాదితో పోల్చితే విలువపరంగా ప్రైవేట్ ఈక్విటీ డీల్స్ 23 శాతం పెరిగాయి. 98.3 కోట్ల డాలర్ల విలువ గల (రూ.) 84 పిఇ డీల్స్ చోటు చేసుకున్నాయి. గత ఏడాది జనవరిలో నమోదైన పిఇ డీల్స్ 81 కాగా వాటి విలువ 79.6 కోట్ల డాలర్లు (రూ.). గ్రాంట్ థార్న్‌టన్ సంస్థ ఈ వివరాలు ప్రకటించింది. ప్రధానంగా స్టార్టప్‌లలోకి అధికంగా నిధులు వచ్చాయని, విలువపరంగా 52 శాతం వాటా స్టార్టప్‌లదేనని కంపెనీ తెలిపింది.



ఐపిఒకి సెంబ్‌కార్ప్ దరఖాస్తు

విద్యుత్ రంగంలోని సెంబ్ కార్ప్ ఎనర్జీ ఇండియా పబ్లిక్ ఇష్యూ జారీకి సెబీ అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. సింగపూర్ ఎక్స్ఛేంజిలో లిస్టింగ్ అయిన సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ ప్రమోట్ చేసిన ఈ సంస్థ పునర్ వినియోగ ఇంధన వనరులు, థర్మల్ ప్రాజెక్టులు చేపడుతుంది. రుణ భారం తగ్గించుకుని ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోవడం కోసం 4,095 కోట్ల రూపాయల నిధులు సమీకరించనున్నట్టు సెంబ్‌కార్ప్ దరఖాస్తులో ప్రకటించింది. ఇష్యూలో భాగంగా 12,89,41,129 షేర్లను సెంబ్‌కార్ప్ యుటిలిటీస్, 1,78,93,065 షేర్లను గాయత్రి ఎనర్జీ వెంచర్స్ విక్రయిస్తాయని పేర్కొంది. గత డిసెంబరు నాటికి ఈ కంపెనీ 4.07 గిగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. ఇందులో 0.50 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

బిఎస్‌ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

[illegible]

ఎన్‌ఎస్‌ఇ-500 (NSE)

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

[illegible]

ఇది రైతు విజయం

సుప్రీం తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు.. ప్రాజెక్టులను ఆపేందుకు వందకుపైగా కేసులు

- ఎంత దిగజారారో సుప్రీం వ్యాఖ్యలే నిదర్శనం
- కేసుల వెనక ఎవరెవరు ఉన్నారో తెలుసు
- శాసనసభ సాక్షిగా గుట్టు బయటపెడతా
- చెంపలు వేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- కాళేశ్వరంపై పిటిషన్ కొట్టేయడంపై హరీశ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ప్రాజెక్టుపై సుప్రీం తీర్పుతో తెలంగాణ రైతాంగం, ధర్మం, న్యాయం గెలిచింది. ఈ తీర్పు కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ కుటిల యత్నాలకు చెంపపెట్టు వంటిది" అని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుపై దాఖలైన వ్యాజ్యంపై వాదనలు వినేందుకు స్వయంగా సుప్రీం కోర్టుకు వచ్చిన ఆయన.. ధర్మాసనం కేసును కొట్టేసిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. "ప్రతిపక్షం ఎన్ని కుట్రలు పన్నినా ధర్మం గెలిచింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సర్వోన్నత న్యాయస్థానం పచ్చజెండా ఊపడం రైతు విజయం. అన్ని అనుమతులూ వచ్చిన విషయాన్ని మన న్యాయవాదులు బలంగా చెప్పడం వల్లే తీర్పు అనుకూలంగా వచ్చింది. ఇది కీలక మలుపు" అని హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై వందకుపైగా కేసులు వేసిందని ఆరోపించారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు న్యాయమూర్తే 'ఫోరం హంటింగ్' చేస్తున్నారని, 6 నెలల్లోపు రావాల్సి ఉన్నా తొమ్మిదేళ్ల ఎందుకు ఆగారని ప్రశ్నించారంటే వారెంత దిగజారుతున్నారో తెలుస్తోందని చెప్పారు. ప్రాజెక్టులు కడితే టీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడతారనే భయంతోనే కాంగ్రెస్ ఇలా వ్యవహరిస్తోందని విమర్శించారు. "ఎక్కడైనా ప్రతిపక్షం ప్రాజెక్టులు త్వరగా కట్టాలని డిమాండ్ చేస్తుంది. కానీ, మన దగ్గర ఆపాలనే దురుద్దేశం కనిపిస్తోంది. ప్రతిపక్ష నేతలకు ప్రజా ప్రయోజనం కన్నా రాజకీయ ప్రయోజనమే ముఖ్యం. పిటిషనర్లకు ఎవరు డబ్బు సాయం చేస్తున్నారు? ఢిల్లీకి టిక్కెట్లు ఏ కాంగ్రెస్ నాయకుడు కొనిపెడుతున్నాడో తమ దగ్గర ఆధారాలు ఉన్నాయి. ఆ వివరాలను సరైన సమయంలో శాసనసభ సాక్షిగా బయటపెడతాను. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఇప్పటికైనా వారు చెంపలు వేసుకుని క్షమాపణలు కోరితే కొంతైనా క్షమిస్తారు" అని ధ్వజమెత్తారు. జాతీయ హరిత ట్రైబ్యునల్, హైకోర్టు, సుప్రీంకోర్టు అంటూ వరుసగా కేసులు వేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారని, దీంతో ఇంజనీర్లు ఫీల్డ్‌లో కన్నా కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల మూర్ఖపు చర్యలతో ఇంజనీర్ల విలువైన సమయం పోతోందని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీస్తోందని మండిపడ్డారు. మూడు షిఫ్టుల్లో ప్రాజెక్టు పనులు చేయించే ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, ఆకుపచ్చ తెలంగాణ కేసీఆర్ లక్ష్యమని, రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రం కావాలని సీఎం సంకల్పించారని పేర్కొన్నారు. ఆ కల సాకారం చేసేందుకే రేయింబవళ్లు ప్రాజెక్టు పనులు చేయిస్తున్నామని చెప్పారు. 2018 చివరినాటికి రైతులకు కాళేశ్వరం తొలి దశ ఫలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కోదండరాం, కాంగ్రెస్‌ని వేరుగా చూడబోమని ఒకే చెట్టుకు వచ్చిన రెండు కొమ్మలని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులను అడ్డుకోవాలనుకునేవారు కోదండరాం అయినా, కాంగ్రెస్ నాయకులైనా ఆలోచనా ధోరణి మార్చుకోవాలన్నారు.

ట్రైబ్యునల్‌లో ఉంటూనే ప్రాజెక్టులపై సమీక్ష

ట్రైబ్యునల్‌లో జరుగుతున్న క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరైన హరీశ్ దాదాపు 90 నిమిషాల పాటు అక్కడే ఉన్నారు. వెనుక నుంచి రెండో వరుసలో కూర్చొన్న ఆయన ఒక వైపు ట్రైబ్యునల్ ప్రొసీడింగ్స్ పరిశీలిస్తూనే కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన విషయాలపై సమీక్ష నిర్వహించారు. వాట్సప్ గ్రూపు ద్వారా సంబంధిత ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ప్యాకేజీ వారీగా ఎంత పని కావాల్సి ఉంది, ఇప్పటివరకు ఎంత వరకు అయింది అనేది ఎప్పటి కప్పుడు వివరాలు తెప్పించుకున్నారు. మిగిలిన ప్రాజెక్టు అనుమతుల కోసం ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు వారితో చర్చిస్తూ చేయాల్సిన పనులు దిశానిర్దేశం చేశారు.

ట్రైబ్యునల్‌కు మంత్రి రావడం 14 ఏళ్లలో తొలిసారి

2 తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై ట్రైబ్యునల్‌లో జరిగిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు మంత్రి హరీశ్‌రావు స్వయంగా హాజరయ్యారు. తెలంగాణ తరపు న్యాయవాదులు ఎలా వాదనలు చేస్తున్నారో చూసేందుకే వచ్చానని ఆయన తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు దక్కాల్సిన వాటా దక్కలేదన్నారు. రాష్ట్రానికి సంబంధించిన కేటాయింపులను రాష్ట్రంలో ఎక్కడైనా వినియోగించుకోవచ్చని అప్పటి ప్రభుత్వం వాదించిందని గుర్తుచేశారు. న్యాయపరంగా రాష్ట్రానికి రావాల్సిన వాటాపై పూర్తిస్థాయి వాదనలు వినిపిస్తామని, అంతర్జాతీయ నీటి పంపకాల చట్టాలను అనుసరించి న్యాయపోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఉన్న నీటి పంపకాలు.. వాటాకన్నా మరింత రావాల్సి ఉందన్నారు.

సారథులు వీరే



ఈయన పేరు బాలాజీనాయక్. పదేళ్ల కిందట కేసీఆర్ పల్లె నిద్ర చేసినప్పుడు కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఈయనకు మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త పదవి దక్కింది.



ఈమె పేరు బానావత్ మంజుల. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. అదే జిల్లాకు రైతు సమన్వయ సమితి కన్వీనర్‌గా ఎంపికయ్యారు.

(మొదటి పేజీ తరువాయి)

వర్గానికి చెందినవారు. కాగా, జగిత్యాల జిల్లా సమితికి వెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని, ఖమ్మం జిల్లా సమితికి కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని సమన్వయ కర్తలుగా నియమించింది. అలాగే, 9 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలకు చోటు దక్కింది. సూర్యాపేటలో ముస్లింను ఖరారు చేశారు. బీసీల్లో రెండు పదవులు మున్నూరు కాపు వర్గానికి దక్కాయి. వారిలో నిజామాబాద్ సమన్వయకర్త బానావత్ మంజుల అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. వరంగల్ రూరల్ కన్వీనర్‌గా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న భిక్షపతిని ఎంపిక చేస్తే.. వరంగల్ అర్బన్ కన్వీనర్‌గా ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు జిల్లా టీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పని చేసిన లలితా యాదవ్‌ను ఎంపిక చేశారు. ఉద్యమ నేతగా కేసీఆర్ 2007 ఏప్రిల్‌లో ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం జామాతండా శివారు భూక్యాధాన్యాతండాలో పల్లెనిద్ర చేసినప్పుడు దానిని విజయవంతం చేయడానికి కృషి చేసిన బాలాజీ నాయక్‌ను ఇప్పుడు జిల్లా కో ఆర్డినేటర్ పదవి వరించింది. ఇక, కామారెడ్డి జిల్లాలో మంత్రి పోచారం అనుచరుడు అంజిరెడ్డికి; నిర్మల్ జిల్లాలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రధాన అనుచరుడు వెంకట్రామిరెడ్డికి; ఆదిలాబాద్‌లో జోగు రామన్న అనుచరుడు భోజారెడ్డికి; ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడు నల్లమల వెంకటేశ్వరరావుకు; భద్రాద్రి కొత్తగూడెంకు ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అనుచరుడు అంకిరెడ్డి కృష్ణారెడ్డికి; జనగామకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ప్రధాన అనుచరుడు రమణారెడ్డికి పదవులు దక్కాయి.

జిల్లా పేరు	సమన్వయకర్త పేరు	కులం
కరీంనగర్	గుండెల్లి తిరుపతి	బీసీ- ముదిరాజ్
పెద్దపల్లి	కోట రాంరెడ్డి	ఓసీ - రెడ్డి
జగిత్యాల	చీటి వెంకట్రావు	ఓసీ - వెలమ
సిరిసిల్ల	గడ్డం నర్సయ్య	బీసీ - మున్నూరు కాపు
సిద్దిపేట	వి.నాగిరెడ్డి	ఓసీ - రెడ్డి
మెదక్	టి.సోములు	బీసీ - మున్నూరు కాపు
సంగారెడ్డి	వెంకటరామిరెడ్డి	ఓసీ - రెడ్డి
ఆదిలాబాద్	అడ్డి భోజిరెడ్డి	ఓసీ - రెడ్డి
మంచిర్యాల	ఎం.గురవయ్య	బీసీ - పెరిక
ఆసిఫాబాద్	బసవత్‌కార్ విశ్వనాథ్	ఎస్సీ
నిర్మల్	ఎన్.వెంకటరామిరెడ్డి	ఓసీ - రెడ్డి
నిజామాబాద్	బనావత్ మంజుల	ఎస్టీ - లంబాడ
కామారెడ్డి	డి.అంజిరెడ్డి	ఓసీ - రెడ్డి
వరంగల్ అర్బన్	ఈ.లలితాయాదవ్	బీసీ - యాదవ్
వరంగల్ రూరల్	బొల్లె భిక్షపతి	ఎస్సీ
భూపాలపల్లి	పల్లా బుచ్చయ్య	బీసీ - పెరిక
మహబూబాబాద్	భూక్యా బాలాజీ	ఎస్టీ - లంబాడ
జనగాం	ఐ.రమణారెడ్డి	ఓసీ- రెడ్డి
ఖమ్మం	నల్లమల వెంకటేశ్వర్‌రావు	ఓసీ - కమ్మ
కొత్తగూడెం	అంకిరెడ్డి కృష్ణారెడ్డి	ఓసీ - రెడ్డి
నల్లగొండ	ఈ.రాంచందర్‌నాయక్	ఎస్టీ - లంబాడ
యాదాద్రి	కె. అమరేందర్ ముదిరాజ్	బీసీ - ముదిరాజ్
సూర్యాపేట	ఎస్‌ఏ రజాక్	ముస్లిం
మహబూబ్‌నగర్	ఎస్.బస్వరాజ్‌గౌడ్	బీసీ గౌడ్
నాగర్ కర్నూల్	పోకల మనోహర్	బీసీ పెరిక
గద్వాల	కె.వెంకట్రాములు	బీసీ కురువ (యాదవ్)
వనపర్తి	పి.జగదీశ్వర్‌రెడ్డి	ఓసీ - రెడ్డి
రంగారెడ్డి	వంగేటి లక్ష్మారెడ్డి	ఓసీ - రెడ్డి
వికారాబాద్	కె.మహేశ్ రెడ్డి	ఓసీ - రెడ్డి
మేడ్చల్	నారెడ్డి నందారెడ్డి	ఓసీ - రెడ్డి

కాళేశ్వర విజయం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించడాన్ని సవాల్ చేస్తూ నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో కొందరు కేసులు వేస్తున్న విషయం తెలిసిందే. పర్యావరణ అనుమతులు వచ్చే వరకూ కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఆపాలంటూ గతంలో ఢిల్లీ ఎన్జీటీ ఆదేశించింది. నిజానికి, తెలంగాణకు చెందిన కేసులు చెన్నై ఎన్జీటీ పరిధిలోకి వస్తాయి. కానీ, పిటిషనర్లు ఢిల్లీ ఎన్జీటీని ఆశ్రయించారు. దాంతో, ఢిల్లీ ఎన్జీటీ తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేసింది. ఎన్జీటీ స్టేను ఎత్తివేసిన హైకోర్టు.. కేసును పునర్విచారణ జరపాలని ఎన్జీటీకే ఆదేశాలు జారీ చేసింది. దాంతో, ఎన్జీటీ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ నిర్వాసితుడు హయతుద్దీన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు శుక్రవారం జస్టిస్ రోహింటన్ ఫాలీ నారిమన్, జస్టిస్ నవీన్ సిన్హా ధర్మాసనం ముందుకు వచ్చింది. విచారణ ప్రారంభం కాకముందే తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ మాట్లాడుతూ, అటవీ, పర్యావరణ, సీడబ్ల్యూసీ, అంతర్రాష్ట్ర, హైడ్రాలజీ వంటి అనుమతులన్నీ ప్రాజెక్టుకు వచ్చాయని, ఈ విషయాలేమీ చెప్పకుండా, వాస్తవాలు దాచి పిటిషనర్ కేసులు వేశారని ధర్మాసనానికి తెలిపారు. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టు ప్రారంభ సమయంలో ఎమ్మెల్యేగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న విషయాన్ని లిఖితపూర్వకంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పిటిషనర్ తరపున న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ తన వాదన ప్రారంభించారు. ఎటువంటి అనుమతులు లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ప్రారంభించారని అంటుండగానే ధర్మాసనం అడ్డుకుంది. "ఈ వివాదం ఎన్జీటీ చెన్నై బెంచ్ పరిధిలోకి వస్తుంది కదా! ఇది ఫోరం హంటింగ్ (అనుకూల కోర్టు, జడ్జిని వెతుక్కుని మరీ కేసు వేయడం) ఎందుకు కాదు?" అని ప్రశ్నించింది. దాంతో, చెన్నై ఎన్జీటీలో ఎక్స్‌పర్ట్ మెంబర్ లేరని, పైగా, కేసు పరిధిలో మహారాష్ట్ర కూడా ఉందని, అందుకే ఢిల్లీ వచ్చామని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. దాంతో, 'కేసు పరిధిలో మహారాష్ట్ర కూడా ఉందని అనుకున్నా పుణె బెంచ్‌కు వెళ్లాలి కదా' అంటూ ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. అయినా, ప్రాజెక్టు ప్రారంభమైన 6 నెలల్లోపు అభ్యంతరాలు తెలపాల్సి ఉందని, తొమ్మిదేళ్ల తర్వాత న్యాయస్థానాలకు ఎందుకు వచ్చారని నిలదీసింది. కేసును పూర్తిగా పరిశీలించిన ధర్మాసనం.. హైకోర్టు తీర్పుతో ఏకీభవిస్తూ వ్యాజ్యాన్ని విచారణకు తీసుకోకుండానే కొట్టేసింది. దానికి అనుబంధంగా దాఖలైన పిటిషన్లను కూడా తోసిపుచ్చింది. అయితే, ప్రతిసారీ పిటిషన్లు వేస్తున్న వీరికి జరిమానా విధించాలని ముకుల్ రోహత్గీ నివేదించినా ధర్మాసనం స్పందించలేదు. కాగా, ఇరు పక్షాల వాదనలను ప్రత్యక్షంగా వినేందుకు మంత్రి హరీశ్ స్వయంగా కోర్టుకు రావడం గమనార్హం. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, అదనపు అడ్వొకేట్ జనరల్ రామచంద్రరావు, అడ్వొకేట్ ఆన్ రికార్డ్ పాల్వాయ్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. నిజానికి, కాళేశ్వరం ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులు లేవని పిటిషనర్లు ఎన్జీటీని ఆశ్రయించారు. అందుకే ఎన్జీటీ గతంలో స్టే కూడా ఇచ్చింది. కానీ, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణం సహా అన్ని అనుమతులూ వచ్చేశాయి. తాజాగా, అనుమతులకు సంబంధించిన కేసునే కనీసం విచారణకు స్వీకరించకుండానే సుప్రీం కోర్టు కొట్టివేయడం ప్రభుత్వానికి గొప్ప విజయమని విశ్లేషిస్తున్నాయి.



కొత్త పాసు పుస్తకాల జారీపై ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

రేపే తొలి సదస్సు

- రైతు సమితుల సభ్యులకు సీఎం దిశానిర్దేశం
- కార్పొరేషన్ మూలధనం 200 కోట్లకు పెంపు
- 15 మంది డైరెక్టర్లతో తొలి ఉత్తర్వు జారీ

హైదరాబాద్, రాజేంద్రనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులకు సర్వం సిద్ధమైంది. జయశంకర్ వ్యవసాయ వర్సిటీ క్రీడా మైదానంలో ఆదివారం 13 జిల్లాల సభ్యులతో; సోమవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో మిగిలిన జిల్లాల సభ్యులతో సదస్సు జరుగుతుంది. రెండు సదస్సుల్లోనూ సీఎం కేసీఆర్ పాల్గొని రైతులకు దిశానిర్దేశం చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 540 మండల సమితుల్లోని 12,960 మంది సభ్యులు; 30 జిల్లాల్లోని 720 మంది సభ్యులు వీటిలో పాల్గొంటారు. వారిని సదస్సులకు తీసుకొచ్చేందుకు రవాణా ఏర్పాట్లు చేశారు. ఒక్క రాజేంద్ర నగర్ సదస్సులోనే సమితుల సభ్యులు, అధికారులు కలిపి మొత్తం 7,443 మందికి సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. వారితో మాట్లాడతారు. వ్యవసాయ అభివృద్ధి, రైతు ఆదాయం పెంపునకు సమితుల పాత్ర ఏమిటో వివరిస్తారు. ఈ సందర్భంగా కీలక ప్రకటనలూ ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. కాగా, రాజేంద్రనగర్‌లో సదస్సు వేదిక పనులను శుక్రవారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. రైతు తలెత్తుకుని జీవించేలా చేయడమే సీఎం కేసీఆర్ ఆశయమని, అందుకే పెట్టుబడి సాయం సహా పలు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

మూలధనం 200 కోట్లకు పెంపు

తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి విధివిధానాల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. తొలి ఉత్తర్వులో రూ.150 కోట్ల మూలధనంతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొనగా.. తుది ఉత్తర్వుల్లో దాన్ని రూ.200 కోట్లకు పెంచింది. కార్పొరేషన్ తొలి డైరెక్టర్‌గా వ్యవసాయ ఉత్పత్తుల కమిషనర్ (ఏపీసీ)ను చేర్చింది. ఈ మేరకు తుది ఉత్తర్వులు జారీ చేసినట్లు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్ర సమితి తొలి ఉత్తర్వును గురువారం పొద్దు పోయిన తర్వాత విడుదల చేసింది. శుక్రవారానికి వాటిలో మార్పులు చేసింది. రాష్ట్ర సమితి చైర్మన్ పేరును ప్రభుత్వం నామినేట్ చేస్తుందనే అంశాన్ని తొలగించింది. తొలి డైరెక్టర్ల పేర్లలో ఏపీసీ, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పేర్లను చేర్చింది. రూ.200 కోట్ల మూలధనంలో రూ.199,99,99,300 కోట్ల విలువైన షేర్లు గవర్నర్ పేరున, మిగిలిన రూ.700 షేర్లు ఏపీసీ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల కమిషనర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, అపెడా డీజీఎం పేరిట సరిసమానంగా ఉంటాయని తెలిపింది.

కార్పొరేషన్ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు

తెలంగాణ రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ పాలక మండలి భేటీలోనే డైరెక్టర్ల సంఖ్యను పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కంపెనీల చట్టం కింద కార్పొరేషన్ రిజిస్ట్రేషన్‌కు వ్యవసాయ శాఖ శుక్రవారం దరఖాస్తు చేసుకుంది. తొలి ఉత్తర్వుల్లో 15 మంది డైరెక్టర్లతో పాలక మండలిని ఏర్పాటు చేస్తున్నట్లు విధివిధానాల్లో పేర్కొంది. అయితే, మొత్తం 42 మంది సభ్యులతో రాష్ట్ర సమితి ఉంటుందని ఇప్పటికే సీఎం ప్రకటించారు. దాంతో, తొలి సమావేశంలోనే సమితి సభ్యుల సంఖ్యకు అనుగుణంగా పాలకమండలి డైరెక్టర్ల సంఖ్యను పెంచే; చైర్మన్ పోస్టును ఏర్పాటు చేసే తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉందంటున్నారు. ఆ తర్వాత చైర్మన్, సభ్యులను నామినేట్ చేస్తారు. అలాగే, గ్రామం నుంచి జిల్లా వరకు సమితులను కార్పొరేషన్‌లో అనుసంధానం చేసేలా బైలాస్‌ను రూపొందించుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

లక్ష రుణ మాఫీ

(మొదటి పేజీ తరువాయి)

మాఫీ పోనూ మిగిలిన రుణాన్ని చెల్లించాల్సి ఉంటుంది. దీనిని సదరు రైతులు చెల్లించన మీదటే రుణమాఫీని బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి. ఉదాహరణకు రూ.1.20 లక్షలు అప్పు ఉన్నట్టయితే, ముందుగా సదరు కార్మికుడు రూ.20 వేలను చెల్లించాల్సి ఉంటుంది. తర్వాతనే మిగిలిన లక్ష రుణం మాఫీ కానుంది. 2017 జూన్-సెప్టెంబరు నెలల మధ్య వ్యక్తిగత రుణాలను తీసుకున్న చేనేత కార్మికుల అప్పుల వివరాలను బ్యాంకులు సమర్పించిన మీదట వారికి కూడా రుణమాఫీని అమలు చేసే విషయాన్ని సర్కారు పరిశీలించనుంది. అదే సమయంలో కొత్తగా వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేసే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించనుంది. అప్పులు చెల్లించకుండా నిరర్థక ఆస్తులు ఉన్న కార్మికులకు సంబంధించిన విషయంలో తిరిగి అప్పు ఇప్పించడం సాధ్యం కాదని ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వం చేనేత కార్మికుల రుణమాఫీ పథకాన్ని గత ఏడాది నవంబరులో ప్రకటించింది. దీనిపై బ్యాంకర్లతో సంప్రదింపుల కోసం ఒక కమిటీని కూడా నియమించింది. ఈ నేపథ్యంలోనే పథకం అమలుకు తగిన మార్గదర్శకాలను ఇవ్వాల్సిందిగా చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ చేసిన విన్నపం మేరకు ప్రభుత్వం తాజాగా ఆదేశాలను జారీ చేసింది. రాష్ట్రంలో వివిధ బ్యాంకులు 2014 జనవరి 1 నుంచి 2017 మార్చి 31వ తేదీ మధ్య 3757 మంది చేనేత కార్మికులకు రూ.14.76 కోట్లు రుణంగా ఇచ్చినట్టు ప్రభుత్వం అంచనా వేసింది. అయితే రూ. లక్షకు పైగా రుణం తీసుకున్న చేనేత కార్మికులు 413 మంది ఉన్నారు. వీరు తీసుకున్న అప్పు రూ.8.21 కోట్లుగా ఉంది. కాగా, వివిధ బ్యాంకులు నిరర్థక ఆస్తుల కింద ప్రకటించిన అకౌంట్లు 237 ఉన్నాయి. ఈ అకౌంట్ల కార్మికులు చెల్లించాల్సిన రుణాల మొత్తం రూ.78 లక్షలుగా ఉంది. వ్యక్తిగత పెట్టుబడి రుణాలను మాత్రమే ఈ రుణమాఫీకి పరిగణనలోకి తీసుకోనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. జేఎల్‌జీ, వార్షిక రుణాలను ఈ రుణమాఫీలో పరిగణనలోకి తీసుకోరు. ఒకవేళ 2014 జనవరి నుంచి 2017 మార్చి వరకు రుణ మంజూరీ జరిగిన ఖాతాలకు సంబంధించి చెల్లింపులు జరిగి ఉంటే.. ఆ మొత్తాన్ని ప్రభుత్వం సదరు కార్మికులకు తిరిగి చెల్లించనుంది.

జాక్‌పాట్ ఎవరికి?

3 రాజ్యసభ సీట్లకు ఎన్నిక.. అన్నీ టీఆర్ఎస్‌కే.. సంతోష్ కోసం సీఎంపై నేతల ఒత్తిడి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మూడు రాజ్యసభ స్థానాల భర్తీ కోసం శుక్రవారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. శాసనసభలో పూర్తి స్థాయి మెజార్టీ కలిగిన అధికార టీఆర్ఎస్ ఖాతాలో ఆ మూడు స్థానాలు పడటం లాంఛనమే. ఏకగ్రీవంగానే టీఆర్ఎస్ మూడు రాజ్యసభ స్థానాలను దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రమేష్(టీడీపీ), రాపోలు ఆనందభాస్కర్ (కాంగ్రెస్) ఏప్రిల్ 2న పదవీ విరమణ చేయనున్నారు. ఇదే సమయానికి పదవీ విరమణ చేయాల్సిన రాజ్యసభ సభ్యుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి నిరుడు జూన్ 9న హఠాన్మరణం పొందారు. అప్పటి నుంచి ఈ స్థానం భర్తీకి నోచుకోలేదు. దీంతో తెలంగాణకు సంబంధించి ఈ మూడు రాజ్యసభ స్థానాల భర్తీ కోసం వచ్చే నెల 5న నోటిఫికేషన్ జారీ కానుంది. ఎన్నిక అనివార్యమైతే మార్చి 23న పోలింగ్ నిర్వహిస్తారు. తెలంగాణ అసెంబ్లీలో టీఆర్ఎస్‌కి ఉన్న బలం వల్ల మూడింటికి మూడు స్థానాలను ఆ పార్టీ ఏకగ్రీవంగా గెల్చుకోనుండటంతో పోలింగ్ నిర్వహించాల్సిన అవసరం రాకపోవచ్చు. కేసీఆర్ ముగ్గురి పేర్లను ప్రకటించడం ఆలస్యం... వారు ఎంపీలుగా ఎన్నిక కావటం లాంఛనం కానుంది. దీంతో ఆ అదృష్టం వరించే వారెవరు? అనే చర్చ చాలాకాలంగా సాగుతోంది. మూడు స్థానాల్లో ఒకటి యాదవులకు ఇస్తామని సీఎం కేసీఆర్ స్వయంగా ఇదివరకే ప్రకటించారు. వివిధ సమీకరణాల దృష్ట్యా టీఆర్ఎస్ నుంచి రాజ్యసభ రేసులో పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్ కుమార్, అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, యాదవ నేతల్లో గొర్రెలు, మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయని అందరికంటే ముందుగా 'ఆంధ్రజ్యోతి' జనవరి 4వ తేదీన కథనాన్ని ప్రచురించింది. తర్వాత సీఎం కేసీఆర్ పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థిత్వాల ఖరారు కోసం తనదైన శైలిలో కసరత్తు చేస్తున్నారు. జోగినపల్లి సంతోష్‌కుమార్ పేరు ఖరారు చేయాలని చాలామంది టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, పార్టీ శ్రేయోభిలాషుల నుంచి కేసీఆర్‌పై పెద్దఎత్తున ఒత్తిడి వస్తోంది. ఆయనను రాజ్యసభకు పంపిస్తే, తమకు అభ్యంతరం లేదని పలువురు పార్టీ సీనియర్లు కూడా సీఎం కేసీఆర్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి సంతోష్‌కుమార్ అందరికీ తలలో నాలుకగా వ్యవహరిస్తూ, మితభాషి, మృదుస్వభావిగా గుర్తింపు పొందటమే అందుకు కారణం. ఉన్నత విద్యావంతుడైన సంతోష్ కుమార్ గడిచిన 15 ఏళ్లుగా అధినేత కేసీఆర్‌కు అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. నిత్యం అధినేత నిద్ర లేవకముందు మొదలయ్యే సంతోష్ విధి నిర్వహణ, ఎంత రాత్రి అయినా అధినేత నిద్రకు ఉపక్రమించాకే ముగుస్తూ వస్తోంది. వ్యక్తిగత జీవితం అనేది లేకుండా కేసీఆర్‌కు సేవకుడిగా ఉంటూనే, కీలకమైన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కబెట్టటంలో తెర వెనుక క్రియాశీలక పాత్ర పోషించారు. మూడు స్థానాలు ఒకేసారి ఖాళీ అయిన నేపథ్యంలో సంతోష్‌ను రాజ్యసభకు పంపించటానికి ఇదే సరైన సమయమనే సూచనలు అధినేత కేసీఆర్‌కు వస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు యాదవులకు ఇస్తామని చెప్పిన ఒక స్థానం కోసం రాజయ్య యాదవ్, తుల ఉమతో పాటు, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, నోముల నర్సింహయ్యల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే మంత్రి పదవి సహా పలు ముఖ్యమైన పదవులు ఇప్పటికే యాదవులకు దక్కిన నేపథ్యంలో టీఆర్ఎస్‌లో మొదటి నుంచి కొనసాగుతూ తెలంగాణ ఉద్యమకారిణిగా గుర్తింపు పొందిన, కురమ సామాజిక వర్గానికి చెందిన తుల ఉమకు రాజ్యసభ బెర్త్ ఖరారు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు పలువురు వ్యక్తం చేస్తున్నారు. మంత్రివర్గంలో మహిళకు స్థానం ఇవ్వలేదన్న అపప్రధను ఈ విధంగా బ్యాలెన్స్ చేయవచ్చని సూచిస్తున్నారు. ఇక మిగిలిన ఒక స్థానానికి అభ్యర్థిత్వం ఖరారుపై తర్జన భర్జనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ స్థానాన్ని కూడా బీసీలకు ఇవ్వాలా? లేక రెడ్డి, మైనార్టీ వర్గాలకు ఇవ్వాలా? అనే విషయంలో ప్రస్తుతానికి పార్టీ అధిష్ఠానం ఒక అభిప్రాయానికి రాలేదని సమాచారం. అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, హోంమంత్రి నాయిని పేర్లు రాజ్యసభ రేసులో ఉన్నప్పటికీ ఇందులో ఎవరిని కదిలించినా అసెంబ్లీ స్పీకర్‌గా మరొకరిని ఎన్నుకోవడమో, రాష్ట్ర మంత్రివర్గాన్ని అనివార్యంగా పునర్వ్యవస్థీకరించడమో చేయాల్సి వస్తుంది. ఇప్పుడా తలనొప్పి వద్దనుకుంటే, ఇతరులకు అవకాశం లభిస్తుంది. పార్టీ తరఫున లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల్లో మైనార్టీలు ఒక్కరూ లేనందున, వారికి అవకాశం ఇస్తే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నారు. మరోవైపు బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామనే సంకేతాలు బలంగా ఇవ్వాలని సీఎం కేసీఆర్ భావిస్తే మాత్రం మూడో స్థానం బీసీ వర్గాల్లో ఎవరికి దక్కుతుందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఆ అవకాశం ముదిరాజ్ సామాజిక వర్గానికి దక్కవచ్చనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఇప్పటివరకు సీఎం కేసీఆర్ మాత్రం టీఆర్ఎస్ తరపున రాజ్యసభ అభ్యర్థిత్వాల కోసం ఎవరి పేర్లను కూడా మంత్రులు, టీఆర్ఎస్ ముఖ్య నేతల వద్ద ప్రస్తావించలేదని తెలుస్తోంది. ఆయన మదిలో ఎవరి పేర్లు ఉన్నాయనేది ఎవరికీ అంతుచిక్కటం లేదు. దీంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. కానీ రేసులో ఉన్న వారి నుంచే ముగ్గురు రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ఉండవచ్చని, పెద్దగా సంచలనాలు ఉండకపోవచ్చని పార్టీ ముఖ్యులు అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నెల 5న విడుదలైనప్పటికీ, నామినేషన్ల దాఖలుకు మార్చి 12వ తేదీ వరకు గడువు ఉందని, ఆలోగా ఎప్పుడైనా పార్టీ అభ్యర్థుల పేర్లను కేసీఆర్ ప్రకటిస్తారని, తొందరేమీ లేదని వారు చెబుతున్నారు.



సంతోష్

మార్చి 23న రాజ్యసభ పోలింగ్!

ఏపీలో 3... తెలంగాణలో 3 సీట్లు.. దేశవ్యాప్తంగా 58 సీట్లకు షెడ్యూల్

- 5న నోటిఫికేషన్.. 12 వరకు నామినేషన్లు
- మొత్తం 57 మంది సభ్యుల పదవీ విరమణ
- మంత్రుల్లో జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, జవడేకర్
- నామినేటెడ్‌లో రేఖ, సచిన్ టెండుల్కర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికలకు నగారా మోగింది. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లోని 58 రాజ్యసభ స్థానాల్లో ఎన్నికలకు శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు సీట్లు, తెలంగాణ నుంచి మూడు సీట్లు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం... మార్చి ఐదున నోటిఫికేషన్ విడుదలవుతుంది. 12వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 13న నామినేషన్లు పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 15వ తేదీ వరకు అవకాశం ఇస్తారు. మార్చి 23న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. తర్వాత ఫలితాలను వెల్లడిస్తారు. మార్చి 26న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. కేరళ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ వీరేంద్ర కుమార్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానానికి ఉప ఎన్నిక కూడా ఇదే షెడ్యూల్ ప్రకారం జరుగుతుంది. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో దేశవ్యాప్తంగా 57 మంది రాజ్యసభ ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులో సచిన్ టెండుల్కర్, రేఖ సహా ముగ్గురు నామినేటెడ్ ఎంపీలు పదవీ విరమణ చేస్తున్నారు. ఏప్రిల్ 2, 3 తేదీల్లో 52 మంది పదవీ విరమణ చేస్తారు. ఇద్దరు మే 3న రిటైర్ అవుతున్నారు. వీరి స్థానంలో కొత్త వారిని ఎన్నుకునేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కాంగ్రెస్ ఎంపీలు చిరంజీవి, రేణుకా చౌదరి, తెలుగుదేశం ఎంపీ దేవేందర్ గౌడ్, తెలంగాణ నుంచి తెలుగుదేశం ఎంపీ సీఎం రమేశ్, కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్‌ల పదవీకాలం పూర్తవుతోంది. కాంగ్రెస్ ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి హఠాన్మరణంతో తెలంగాణలో ఒక సీటు కొంత కాలంగా ఖాళీగా ఉంది. రాజ్యసభ ఎన్నికలు జరుగుతున్న ఇతర రాష్ట్రాల్లో యూపీ(10), మహారాష్ట్ర(6) మధ్యప్రదేశ్(5) బిహార్(5), గుజరాత్(4), కర్ణాటక(4), రాజస్థాన్(3), బెంగాల్(5), ఒడిసా(3), జార్ఖండ్(2), ఛత్తీస్‌గఢ్(1), హరియాణా(1), హిమాచల్‌ప్రదేశ్(1), కేరళ(1), ఉత్తరాఖండ్(1) ఉన్నాయి. ఇటీవల వేటుకు గురైన జేడీయూ ఎంపీ అలీ అన్వర్ కూడా ఏప్రిల్‌లోనే రిటైర్ కావాల్సి ఉంది.

ఇదీ ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్	మార్చి 5 (సోమవారం)
నామినేషన్ల గడువు	మార్చి 12 (సోమవారం)
పరిశీలన	మార్చి 13 (మంగళవారం)
ఉపసంహరణ	మార్చి 15 (గురువారం)
పోలింగ్ తేది	మార్చి 23 (శుక్రవారం)
పోలింగ్ సమయం -	ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు
ఓట్ల లెక్కింపు	మార్చి 23 సాయంత్రం 5 గంటల నుంచి
ఎన్నికల ప్రక్రియ ముగింపు	మార్చి 26 (సోమవారం)

జైట్లీ, జవడేకర్...

పదవీ విరమణ చేస్తున్న ప్రముఖుల్లో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ(గుజరాత్), ధర్మేంద్ర ప్రధాన్, రవిశంకర్ ప్రసాద్ (బిహార్), జగత్ ప్రకాశ్ నడ్డా(హిమాచల్ ప్రదేశ్), తావర్ చంద్ గెహ్లాట్, ప్రకాశ్ జవడేకర్(మధ్యప్రదేశ్), కాంగ్రెస్ నేత రహమాన్ ఖాన్(కర్ణాటక), రాజీవ్ శుక్లా, కాంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ, సమాజ్‌వాదీ పార్టీ నేతలు నరేశ్ అగర్వాల్, జయాబచ్చన్, బీజేపీ నేత వినయ్ కతియార్, కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ ఉన్నారు.



నీరవ్ బ్రాండ్‌కో దండం



కాంట్రాక్టు రద్దు చేసుకున్న ప్రియాంక.. మా అంబాసిడర్ కోహ్లీయే.. తప్పుకోరు: పీఎన్‌బీ

ముంబై, ఫిబ్రవరి 23: ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా... వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ బ్రాండ్‌తో కాంట్రాక్టును రద్దు చేసుకున్నారు. నీరవ్ బ్రాండ్‌కు ఆమె గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ఒక టీవీ ప్రకటనలో కనిపించారు. పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల కుంభకోణం బయటపడటం, నీరవ్ దేశం వదిలి పారిపోవడం తెలిసిందే. "ఆరోపణల నేపథ్యంలో నీరవ్ బ్రాండుతో కాంట్రాక్టును రద్దు చేసుకోవాలని ప్రియాంక నిర్ణయించుకున్నారు" అని ఆమె ప్రతినిధి తెలిపారు. నీరవ్ మామ మెహుల్ ఛోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ ప్రకటనలో మరో నటి బిపాసా బసు నటించారు. కాంట్రాక్టు గడువు ముగిసినా తన ఫొటోలను ప్రచారంలో వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. మరోవైపు భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి తమ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతారని పంజాబ్ నేషనల్ బ్యాంకు స్పష్టం చేసింది. బ్యాంకుతో ఒప్పందానికి విరాట్ ముగింపు పలకనున్నారన్న కథనాల నేపథ్యంలో పీఎన్‌బీ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. రూ.11,400 కోట్ల కుంభకోణం దర్యాప్తునకు ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్ (పీడబ్ల్యూసీ)ని నియమించుకున్నట్లు వస్తున్న వార్తలను కూడా పీఎన్‌బీ తోసిపుచ్చింది. నగదు ఉపసంహరణపై పరిమితి విధించిందని, రూ.3,000 మాత్రమే విత్‌డ్రా చేసుకోవచ్చునని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్నీ ఖండించింది. ఎటువంటి పరిమితులు విధించలేదని స్పష్టం చేసింది.

పీఎన్‌బీ లూటీకి బాధ్యులెవరు?

బ్యాంకు లూటీ



నాలుగంచెల్లోనూ ఆడిటర్ల వైఫల్యం.. ఆర్థికమంత్రి వ్యాఖ్యలతో భగ్గుమంటున్న చార్టర్డ్ అకౌంటెంట్లు

ఆడిటర్‌కు లెక్కలు చూపించారా? ఆడిటర్ సర్టిఫై చేశాడా? అయితే సరే. ఏ బిజినెస్‌లో అయినా సరే ఆడిటర్ అంటే ఒక విశ్వాసం. ఆడిటింగ్‌పై అంత నమ్మకం. ఎక్కడ లొసుగున్నా ఆడిటింగ్‌లో దొరికిపోతుందన్న భరోసా. ఉద్దేశపూర్వకంగా తప్పు చేయాలన్నా ఆడిటర్ సలహాలే కావాలి. కట్టుతప్పకుండా నిఖార్సుగా ఉండాలన్నా ఆడిటర్ దృష్టిపథంలోనే ఉండాలి. మరి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో ఆరేడేళ్లుగా అంతపెద్ద స్కామ్ జరుగుతుంటే ఆడిటర్లు ఏం చేస్తున్నట్టు? అనేక అంచెలుగా ఉన్న ఆడిటింగ్ వ్యవస్థ జరుగుతున్న చోరీని ఎందుకు గుర్తించలేకపోయింది. ఇది ఆడిటర్ల వైఫల్యమేనా? లేక బ్యాంకు అంతర్గత నియంత్రణ వ్యవస్థలో లోపమా? బ్యాంకులను నియంత్రించే భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) చేతగానితనమా? ఒకరిద్దరు వజ్రాల వ్యాపారులు అరడజను కంపెనీలతో దేశంలోని అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన పిఎన్‌బిని ఆరేడేళ్లుగా యథేచ్ఛగా కొల్లగొడుతుంటే ఎవరూ పట్టుకోలేకపోయారెందుకు? పిఎన్‌బి స్కామ్‌తో ఇప్పుడు ఆడిటర్లు కూడా బోనులో నిలబడ్డారు. ఆడిటర్లు బాధ్యతగా వ్యవహరించకపోవడం వల్లనే పిఎన్‌బి వంటి స్కామ్‌లకు ఆస్కారం ఏర్పడుతోందంటూ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన వ్యాఖ్యతో చార్టర్డ్ అకౌంటెంట్లు (సిఎ) తీవ్రంగా మండిపడుతున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆడిటింగ్ ఎలా ఉంటుంది? ఎన్ని అంచెల్లో ఉంటుంది? పిఎన్‌బి విషయంలో ఆడిటర్ల వైఫల్యం నిజంగానే ఉందా? ఉంటే ఏ స్థాయిలో జరిగింది? ఈ విషయాలపై ప్రత్యేక కథనం...

నాలుగంచెల వ్యవస్థ

బ్యాంకింగ్‌లో సాధారణంగా ఆడిటింగ్ నాలుగంచెల్లో ఉంటుంది. ఒక దగ్గరకాకున్నా మరో దగ్గరైనా లొసుగులుంటే దొరికిపోయే విధంగా ఏర్పాటైన పకడ్బందీ వ్యవస్థ ఇది. నీరవ్ మోదీ అండ్ పార్టీ పక్కా పథకం ప్రకారం పిఎన్‌బిని లూటీ చేశారు. బ్రాడీ హౌజ్ శాఖ ప్రధానంగా కార్పొరేట్ సంస్థలకు రుణాలు ఇస్తుంది. ఇక్కడ బ్రాంచ్ మేనేజర్‌గా ఎజిఎం స్థాయి అధికారి ఉంటారు. ఇలాంటి శాఖల్లో ఒక సీనియర్ అధికారి కంకరెంట్ ఆడిటర్ హోదాతో రోజువారీ లావాదేవీలను ట్రాక్ చేస్తూ ఏరోజుకారోజు ఆడిట్ నివేదిక తయారు చేస్తుంటారు. దీనిపై బ్రాంచ్ మేనేజర్ సంతకం చేసిన తర్వాత హెడ్ ఆఫీస్‌కు పంపిస్తారు. కంకరెంట్ ఆడిటర్ నేరుగా హెడ్ ఆఫీస్‌కే రిపోర్ట్ చేస్తారు గనుక ఆయన్ను బ్రాంచ్ ఉద్యోగులు ప్రభావితం చేసే అవకాశం ఉండదు. ఏ రోజు లెక్కల్లో తేడా ఉన్నా కంకరెంట్ ఆడిటర్ ఇట్టే పట్టేస్తారు.

అంతర్గత ఆడిటర్ల కనుగప్పడం కష్టం

కంకరెంట్ ఆడిటర్స్‌తోపాటు వ్యవస్థాగతమైన ఆడిటింగ్‌లో భాగంగా ప్రతి శాఖలో ఇంటర్నల్ ఆడిటర్లు ఉంటారు. నిజానికి వీరు ఈ రకమైన మోసాలను అలవోకగా దొరకబుచ్చుకోవాలి. స్విఫ్ట్ సిస్టమ్ వెలుపల జరిగే లావాదేవీలైనా సరే అంతిమంగా విదేశీ బ్యాంకు శాఖల్లోని నాస్ట్రో అకౌంట్స్ (బ్యాంకుల ఫారెక్స్ ఖాతాలు)ను సిబిఎస్ ద్వారానే లింక్ చేయాల్సి ఉంటుంది. ఓవర్సీస్ శాఖల పద్దులను ఆడిట్ చేసినప్పుడు తేలిగ్గానే ఇంటర్నల్ ఆడిటర్స్ సొమ్ము లెక్కల్లో తేడాను పసిగట్టేస్తారు. పిఎన్‌బిలోకాకున్నా పిఎన్‌బి జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఒయు)లపై ఫారెక్స్ రుణాలిచ్చిన బ్యాంకుల ఆడిటర్లైనా దీనిని పట్టేయాలి. అయితే సాధారణంగా ఇంటర్నల్ ఆడిటర్లుగా బ్యాంకు ఉద్యోగులనే మూడేళ్ల కాలానికి నియమిస్తారు.

వాళ్లు మొనగాళ్లే కానీ...

కంకరెంట్ ఆడిటర్లు, ఇంటర్నల్ ఆడిటర్ల కనుగప్పిన లొసుగులు ఏవైనా ఉన్నా అవి స్టాట్యుటరీ ఆడిటర్లకు దొరికి తీరాల్సిందే. స్టాట్యుటరీ ఆడిటర్స్ బ్యాంకుతో సంబంధం లేని బయటి వ్యక్తులు. ఆడిటింగ్‌లో ఆరితేరిన పండితులను స్టాచుటరీ ఆడిటర్స్‌గా నియమిస్తారు. పిఎన్‌బి దానితో పాటు ఈ స్కామ్‌లో నష్టపోయిన ఇతర బ్యాంకులు లిస్టెడ్ సంస్థలు. వీటికి ప్రముఖ ఆడిటింగ్ కంపెనీలే స్టాచుటరీ ఆడిటర్లుగా ఉంటాయి. వీరి దృష్టికి కూడా ఈ స్కామ్ రాలేదు.

అధిష్ఠాన ఆడిటర్ల చూపే వేరు..

మూడంచెల ఆడిటింగ్‌ను దాటుకొని వచ్చిన బ్యాంకుల పద్దులను ఆర్‌బిఐ ఆడిటర్ల డేగచూపులు మరోసారి స్కాన్ చేస్తాయి. వీరి ఆడిటంగ్ అంటే బ్యాంకులకు దడనే. సవాలక్ష ప్రశ్నలు సంధిస్తారు. సంతృప్తికరంగా లేకపోతే ఆర్‌బిఐ నుంచి సదరు బ్యాంకుకు మొట్టికాయలు తప్పవు.

మరి ఎలా సాధ్యమైంది?

మరి ఇలాంటి ఆడిటింగ్ వ్యవస్థ ఉన్నప్పుడు పిఎన్‌బి స్కామ్ ఎలా జరిగింది? దీనికి నిపుణులు చెప్పే సమాధానాలు రకరకాలుగా ఉన్నాయి. ప్రధానంగా తొలి కొన్నేళ్లపాటు మొదట తీసుకున్న రుణాలను తర్వాత తీసుకున్న రుణాలతో తీర్చివేసి ఉంటారు. ఆఖరు సంవత్సరంలో మాత్రం ఎగవేతలకు పాల్పడి ఉంటారన్నది ఒక అనుమానం. అదీ కాకుండా, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌తో సంబంధం లేకుండా లావాదేవీలు జరుగుతుంటే ఆ విషయం కంకరెంట్ ఆడిటర్ దృష్టికి వచ్చే అవకాశాలు కూడా తక్కువే. ఆడిటర్ అత్యుత్సాహవంతుడై బ్రాంచ్ వ్యవహారాలన్నింటిపై ఒక కన్నేసి ఉంచితే తప్ప బ్రాడీహౌజ్ బ్రాంచ్‌లో జరిగిన అక్రమాల వంటివాటిని గుర్తించడం ఈజీ కాదు. పైగా కంకరెంట్ ఆడిటర్లకు ఉద్యోగులతో సత్సంబంధాలు తక్కువగా ఉంటాయి. చాలా సందర్భాల్లో రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నవాళ్లను లేదా పనిష్మెంట్ కింద కంకరెంట్ ఆడిటర్లుగా పంపిస్తారే తప్ప బాధ్యతాయుతమైన వ్యక్తులు, నిజాయితీపరులు అన్న గుర్తింపుతో ఈ రకమైన అసైన్‌మెంట్స్ ఇవ్వరన్న అభిప్రాయం బ్యాంకింగ్‌వర్గాల్లో ఉంది. ఇంటర్నల్ ఆడిటర్లకు ఇతరత్రా ఆడిటింగ్‌లో ప్రావీణ్యం ఉన్నా, ఫారెక్స్ అకౌంట్లలో లావాదేవీలను ట్రాక్ చేసేందుకు అవసరమైన శిక్షణగానీ నైపుణ్యం గానీ ఉండవు. అందువల్ల ఇక్కడ కూడా దొంగలు తప్పించుకుపోయి ఉంటారు. స్టాచుటరీ ఆడిటర్లు సాధారణంగా బ్యాంకు శాఖలకు వెళ్లకుండా ఇంటర్నల్ ఆడిటర్లు అందించిన నివేదికల ఆధారంగా తమ రిపోర్ట్ తయారు చేస్తుంటారు. అందువల్ల అక్కడ కూడా జరుగుతున్న చౌర్యం దొరికిపోయి ఉండదు. ఇక ఆర్‌బిఐ ఆడిటర్ల ఫోకస్ అంతా హెడ్ ఆఫీస్‌పైనే ఉంటుంది. బ్రాంచ్ లెవల్ వ్యవహారాలను పట్టించుకోరు. సాధారణంగా రోజువారి లావాదేవీల గురించికాకుండా రిస్క్‌కు సంబంధించి అంశాలపైనే వీరి దృష్టి ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో ఒక క్లర్కు మరో సీనియర్ అధికారి ఇష్టానుసారంగా ఎల్‌ఒయులను ఆరేడేళ్లుగా జారీ చేస్తున్నా కనిపెట్టలేకపోవడంలో ఆశ్చర్యం లేదు. సాధారణంగా ఎల్‌ఒయు జారీ చేసిన తర్వాత చెల్లింపులు జరిపేప్పుడు బ్యాంకుల ఓవర్సీస్ శాఖలు మరోసారి ఎల్‌ఒయు జారీ చేసిన బ్యాంకుతో సంప్రదింపులు జరపడం పరిపాటి. పైగా జారీ చేసిన బ్రాంచి అధికారులతో కాకుండా జోనల్ అధికారులతో మాట్లాడి ధృవీకరించుకోవడం రివాజు. పిఎన్‌బి విషయంలో వందల సంఖ్యలో జారీ అయిన ఎల్‌ఒయుల విషయంలో కూడా ఓవర్సీస్ శాఖలు కిమ్మనకుండా చెల్లింపులు చేయడం గమనార్హం.

అన్ని రకాలుగా వైఫల్యమే..

బ్యాంకుల ఆడిటింగ్ వ్యవస్థ, నియంత్రణ పద్ధతులు, ఆర్‌బిఐ పర్యవేక్షణ... అన్నీ పిఎన్‌బి విషయంలో విఫలమయ్యాయి. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద బ్యాంక్ స్కామ్ లేదు. ముందుగా క్లయింట్‌కు క్రెడిట్ సౌకర్యం కల్పించిన తర్వాత ఎల్‌ఒయులు జారీ చేయాలి. అలాంటిదేమీ లేకుండా ఎల్‌ఒయులు జారీ చేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. దుర్వినియోగానికి అవకాశం ఉన్న ఇలాంటి ఇన్‌స్ట్రుమెంట్స్‌ను ప్రోత్సహించకూడదు. ఈ స్కామ్‌తో దేశీయ బ్యాంకింగ్ రంగం, ఆర్‌బిఐ తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిందితులను పట్టుకొని శిక్షించడంపైనే కాకుండా ప్రజల సొమ్మును రికవరీ చేయడంపై కూడా గట్టిగా దృష్టి పెట్టాలి.



కె. నరసింహమూర్తి (ఆర్థిక నిపుణులు)

ఆడిటర్లకేం సంబంధం

పిఎన్‌బి స్కామ్‌లో ఆడిటర్లను నిందించడం తగదు. స్విఫ్ట్ కోడింగ్ సిస్టమ్‌ను ఆడిటర్లు యాక్సెస్ చేయడం సాధ్యం కాదు. పైగా బుక్స్ ఆఫ్ అకౌంట్‌లో లేని విషయాలపై ఆడిటర్లు వ్యాఖ్యానించడం, నివేదిక తయారుచేయడం సాధ్యం కాదు. సీక్వెన్స్ నెంబర్లు కేటాయించని రికార్డులు అందుబాటులో లేని ఎల్‌ఒయులకు సంబంధించిన పద్దులను ఆడిటర్లు తయారు చేయలేరు. పైగా కోర్ బ్యాంకింగ్‌లో నమోదు కాని లావాదేవీలను ఆడిటర్లు ఎలా వెరిఫై చేయగలుగుతారు ? బ్యాంకుల వైఫల్యానికి అనేక కారణాలున్నాయి. ఇందులో రాజకీయ కారణం కూడా ప్రధానమైంది. వీటన్నింటిని పక్కనబెట్టి ఆడిటర్లపై నిందవేయడం సరికాదు.

- ఇది ఆడిటర్ల వాదన

మరింత పటిష్ఠంగా నిఘా వ్యవస్థ



ముంబై, ఫిబ్రవరి 23: విదేశాలకు సమాచారాన్ని చేరవేసే స్విఫ్ట్ వ్యవస్థను కోర్ బ్యాంకింగ్‌తో అనుసంధానం చేయకపోవడం వల్లే నీరవ్‌మోదీ స్కామ్‌కు అవకాశం ఏర్పడి ఉంటుందన్న అభిప్రాయంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మాజీ సీఎండీ ఉషా అనంతసుబ్రమణియన్ ఏకీభవించారు. ఇలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా బ్యాంకుల్లో నిఘా వ్యవస్థను మరింత కఠినతరం చేయాలని సూచించారు. ఉషా ప్రస్తుతం అలహాబాద్ బ్యాంక్ సీఈఓ, ఎండీగా ఉన్నారు. తమ బ్యాంకులో కూడా స్విఫ్ట్‌ను కోర్ బ్యాంకింగ్‌తో అనుసంధానం చేసే పనిమీదే ఉన్నామన్నారు. టెక్నాలజీని ప్రతి నిత్యం అప్‌గ్రేడ్ చేసుకోవడంతోపాటు నిఘా వ్యవస్థను పటిష్ఠంగా నిర్మించుకోవాలన్నారు. నీరవ్ మోదీ పీఎన్‌బీ స్కామ్‌లో చాలా భాగం ఆమె ఆ బ్యాంకులో కీలక బాధ్యతల్లో ఉన్న సమయంలోనే జరిగింది.

పీఎన్‌బీకే వజ్రాల దొంగల తాకిడి

ఆభరణాల వ్యాపారుల రుణాల ఎగవేత కారణంగా బ్యాంకులు రూ. 5,000 కోట్లు నష్టపోయాయి. జెమ్స్ అండ్ జువెలరీ వ్యాపారంలో నగదు చాలా కీలకం. బ్యాంకులు ఎడాపెడా అప్పులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండటంతో మంచి వ్యాపారులతో పాటు దగాకోరులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బ్యాంకులకు టోపీపెట్టారు. బ్యాంకు ఉద్యోగుల సంఘాల సమాఖ్య అంచనా ప్రకారం... కేవలం ఆభరణాలు, వజ్రాల వ్యాపారులకు సంబంధించే దాదాపు 90 పద్దుల్లో ఎగవేతల వల్ల బ్యాంకులు నికరంగా రూ. 5,000 కోట్లు నష్టపోయాయి. ఇందులో అత్యధికంగా పీఎన్‌బీ రూ. 1,790 కోట్ల మేర నష్టపోయింది. ఇది ఎస్‌బీఐ నష్టం రూ. 410 కోట్ల కంటే నాలుగు రెట్లు ఎక్కువ. ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసిన విల్‌ఫుల్ డిఫాల్టర్ల సంఖ్య ఆర్‌బీఐ లెక్క ప్రకారం మొత్తం 8,915. వీరు ఎగవేసిన సొమ్ము మొత్తం విలువ రూ. 92,376 కోట్లు. ఇందులో పీఎన్‌బీ ఎగవేతదారుల సంఖ్య అత్యధికంగా 1,120 ఉండగా.. ఎస్‌బీఐ డిఫాల్టర్ల సంఖ్య 997గా ఉంది. విన్సమ్ డైమండ్స్, బ్యూటిఫుల్ డైమండ్స్, ఆరో గోల్డ్.. వంటి సంస్థలు ఎగవేతదారుల జాబితాలో ఉన్నాయి.

1,400 మంది ఉద్యోగుల బదిలీ

పీఎన్‌బీలో 18,000 మంది ఉద్యోగులను బదిలీ చేస్తోందన్న కథనాలను ఆ బ్యాంకు ఖండించింది. ఫిబ్రవరి 19 నుంచి కేవలం 1,415 మంది ఉద్యోగుల బదిలీ జరిగిందని తాజా ట్వీట్‌లో స్పష్టం చేసింది. వీరిలో 257 మంది సబ్-స్టాఫ్, 437 మంది క్లర్కులు, 721 మంది అధికారులు ఉన్నారని తెలిపింది. ఇవన్నీ కూడా సాధారణ బదిలీల్లో భాగమేనని వివరించింది. వీటికి నీరవ్ మోదీ కుంభకోణంతో ఎటువంటి సంబంధం లేదని పేర్కొంది.

దోషులను వదలం: గడ్కరీ

ముంబై, ఫిబ్రవరి 23: పీఎన్‌బీ కుంభకోణంలో దోషులను శిక్షించి తీరతామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అవినీతిపరులను ఎన్‌డీయే ప్రభుత్వం ఎప్పుడూ రక్షించలేదని చెప్పారు. బాంద్రాలో చౌపల్ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ స్కాంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తున్నారన్న విమర్శలు అర్థరహితమని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

పీటీ వారెంట్‌పై లఖ్‌నవ్‌కు కొఠారీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: రోటొమాక్ యజమాని విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌ను లఖ్‌నవ్ తీసుకువెళ్లేందుకు ఢిల్లీ కోర్టు సీబీఐకి అనుమతి ఇచ్చింది. రుణం ఎగవేత కేసుకు సంబంధించి లఖ్‌నవ్‌లో స్పెషల్ జడ్జి ముందు హాజరుపరచవలసి ఉందని సీబీఐ తెలిపింది. దీంతో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమర్ విశాల్.. ఒక రోజు పీటీ వారెంట్‌పై అనుమతినిచ్చారు. రెండు రోజుల ట్రాన్సిట్ రిమాండ్‌కు అనుమతి ఇవ్వాలని కోరగా జడ్జి తిరస్కరించారు. 24 గంటల్లో నిందితులను మళ్లీ తమ ముందు హాజరుపరచాలని ఆదేశించారు.

రుణాలపై పర్యవేక్షణకు వ్యవస్థ

- ఎట్టకేలకు కళ్లు తెరిచిన కేంద్రం
- నిరంతర నిఘా అత్యవసరం
- బ్యాంకులకు ఆర్థికశాఖ ఆదేశాలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ. 11,515 కోట్ల మోసం జరిగాక కానీ కేంద్ర ప్రభుత్వానికి సెగ తగల్లేదు. ఇక మీదట రూ. 250 కోట్లకు పైబడిన రుణాల మంజూరు, పర్యవేక్షణకు ఓ నిర్దిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ విదేశాల్లోని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. 'ఏ అవసరం కోసం అంత భారీ రుణం ఇచ్చారో.. ఆ పని జరుగుతోందా లేదా అన్నది పర్యవేక్షించండి. ఎంతెంత చెల్లింపులు చేయాలి, బాకీలు ఎప్పుడు తీర్చారు, ఇంకా ఎంత తీర్చాలి, ఎంత తీరుస్తారు? మొదలైన వివరాలు తక్షణం రాబట్టండి' అని ఆర్థిక శాఖ- హాంకాంగ్ సహా విదేశాల్లోని నాలుగు బ్యాంకులు- స్టేట్ బ్యాంకు, ఏక్సిస్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకుల శాఖలకు ఆదేశాలిచ్చింది. ముంబైలోని ఓ పీఎన్‌బీ బ్రాంచి జారీ చేసిన ఎల్‌ఓయూల ఆధారంగా నీరవ్ మోదీకి హాంకాంగ్‌లోని ఈ నాలుగు బ్యాంకుల శాఖలే ఎక్కువగా డబ్బు విడుదల చేశాయి. రూ 250 కోట్ల పైబడ్డ రుణ వ్యవహారాల ను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఓ వ్యక్తిని లేదా ఓ నిర్దిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నది ఆర్థికశాఖ ఇచ్చిన ఉత్తర్వు. స్కాం బయటపడ్డాక ఈ శాఖ తీసుకున్న మొదటి గట్టి చర్య ఇదే. ఇప్పటికే జారీ చేసిన ఎల్‌ఓయూలకు సంబంధించిన లావాదేవీలు త్వరగా మొదలయ్యేట్లు చూడాలని ఆదేశాలిచ్చింది. అదేవిధంగా.. ఒక వ్యక్తికి లేదా సంస్థకు పెద్ద మొత్తంలో రుణం ఇచ్చేటపుడు కన్సార్టియంగా ఏర్పడే బ్యాంకుల సంఖ్య ఏడుకు మించరాదనే షరతు విధించింది. 17 బ్యాంకులు కలిసి కన్సార్టియంగా ఏర్పడి విజయ్ మాల్యాకు రూ. 9,000 కోట్ల మేర అప్పులిచ్చాయి. అలాగే ఏడు బ్యాంకులు కలిసి విక్రమ్ కొఠారీకి రూ. 3,695 కోట్లదాకా అప్పు ఇచ్చాయి. అటు పీఎన్‌బీ కూడా విదేశాల్లోని భారతీయ బ్యాంకుల శాఖలకు చెల్లింపులు జరిపే వ్యవస్థ (స్విఫ్ట్) నిబంధనలను కఠినతరం చేసింది. సీనియర్ అధికారులకు మాత్రమే స్విఫ్ట్ కోడ్ అందుబాటులో ఉంటుంది. కిందిస్థాయి ఉద్యోగులకు ఇకమీదట ఈ పాస్‌వర్డ్ ఇవ్వరు. అదే విధంగా రుణాల మంజూరు, కీలక లావాదేవీలు జరిపే వ్యవస్థల్లోనూ మార్పులు తెచ్చారు. పెద్ద పెద్ద మొత్తాలలో చెల్లింపుల క్లియరెన్స్‌ను సీనియర్ ఉద్యోగులు, ఆఫీసర్ల చేతుల్లోనే పెట్టారు. కుంభకోణం దరిమిలా బ్యాంకు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయి- ఎవరికీ ఏ చెల్లింపులూ జరపలేని పరిస్థితుల్లో లేదని పీఎన్‌బీ స్పష్టం చేసింది . నెత్తిమీద పడ్డ భారాన్ని మోయగల నగదు, ఆస్తులు తమ దగ్గరున్నాయని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. 'బకాయిలు రాబట్టుకునేందుకు చట్టపరంగా ఏ చర్యలు తీసుకోవాలో అవి తీసుకుంటున్నాం.. న్యాయపరంగా కూడా పోరాడతాం. బాధ్యులపైనా చర్యలు మొదలయ్యాయి' అని బ్యాంకు వివరించింది.

ఖాతాదారుల సమాచారం రూ. 320కే!

- పీఎన్‌బీలో డేటా లీకేజీ కుంభకోణం
- ఆన్‌లైన్‌లో క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు
- వెల్లడించిన క్లౌడ్‌సెక్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని తీవ్రంగా కుదిపేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కామ్ వ్యవహారం ఇంకా కొలిక్కి రాకముందే.. ఇదే బ్యాంక్‌లో మరో చీకటి బాగోతం వెలుగు చూసింది. కేవలం రూ.320కే పీఎన్‌బీ ఖాతాదారులకు సంబంధించిన సున్నితమైన సమాచారం ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టారనే విషయం తాజాగా బయటపడింది. ఈ బ్యాంకు జారీ చేసిన డెబిట్, క్రెడిట్ కార్డులపై ఉండే వివరాలను ఓ వెబ్‌సైట్ అమ్మకానికి పెట్టిందని, అందులో ఖాతాదారుల పేర్లు, కార్డు గడువు తేదీలతో పాటు వారి వ్యక్తిగత సమాచారం కూడా ఉందని 'ఆసియా టైమ్స్' పేర్కొంది. గత మూడు నెలలుగా దాదాపు 10వేల మంది సమాచారం ఆన్‌లైన్‌లో ఉన్నట్లు వెల్లడించింది. మొత్తం రెండు సెట్లుగా ఆ డేటా ఉందని, ఒకటి సీవీవీ వివరాలతో కూడినది, మరోటి సీవీవీ వివరాలు లేనిదని తెలిపింది. సమాచార లావాదేవీలపై నిరంతరం నిఘా ఉంచే క్లౌడ్‌సెక్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ సంస్థ ఈ వ్యవహారాన్ని బట్టబయలు చేసింది.

ప్రముఖ సెర్చ్ ఇంజన్లకు కూడా దొరక్కుండా గుట్టుగా కార్యకలాపాలు సాగించే వెబ్‌సైట్లపై ఈ సంస్థకు చెందిన నిపుణులు పెడుతారు. సెర్చ్ ఇంజన్ల జాబితాలో ఉండని కొన్ని సైట్లు సున్నితమైన సమాచారం కొనుగోళ్లు, అమ్మకాలను చట్టవిరుద్ధంగా సాగిస్తుంటాయని ఆ సంస్థ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ రాహుల్ శశి చెప్పారు. తాము రూపొందించిన సాఫ్ట్‌వేర్ సాయంతో ఇలాంటి వ్యవహారాలను గుర్తిస్తామని వెల్లడించారు. సమాచారంలో ప్రమాణికత, కచ్చితత్వం ఆధారంగా ఇలాంటి సైట్లు తమ పరపతిని పెంచుకుంటాయన్నారు. ప్రస్తుతం పీఎన్‌బీ ఖాతాదారుల వివరాలను అందుబాటులో ఉంచిన వెబ్‌సైట్‌కు ఈ తరహా వ్యవహారాల్లో చాలామంచి పేరుందని, తమ దగ్గర నుంచి డేటా కొనుగోలు చేసేవారి విశ్వాసాన్ని పొందడంలో భాగంగా వీరు ముందే కొంత సమాచారాన్ని శాంపుల్‌గా కూడా ఇస్తారని చెప్పారు.

ప్రస్తుతం ఒక్కో పీఎన్‌బీ కార్డు డేటాను రూ320కే అందిస్తామని ఆఫర్ కూడా పెట్టారని రాహుల్ వివరించారు. కాగా, డేటా లీకేజీ వ్యవహారం నిజమేనని ధ్రువీకరించిన బ్యాంకు చీఫ్ సెక్యూరిటీ అధికారి టి.డి. విర్వానీ... దీనిపై ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని పేర్కొన్నారు. సదరు వెబ్‌సైట్‌లో సమాచారాన్ని చివరిగా అప్‌డేట్ చేసిన తేదీ 2018, జనవరి 29గా టైం స్టాంప్ ఉండటంతో అందుబాటులో ఉంచిన డేటా మొత్తం ప్రస్తుత ఖాతాదారులకు సంబంధించిందే అని ప్రభుత్వం కూడా భావిస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వ, ప్రైవేట్ ఏజెన్సీలు ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తున్నాయి. అయితే క్లౌడ్‌సెక్ ఉప్పందించే వరకూ తమ ఖాతాదారుల సమాచారం అమ్మకానికి ఉందనే విషయం పీఎన్‌బీ అధికారులకు తెలియక పోవడం విశేషం. కార్డుల సమాచారం బయటకు పొక్కిందన్న వార్తలతో పీఎన్‌బీ ఖాతాదారులు భయాందోళనలకు గురవుతున్నారు.

నీరవ్‌ను చెప్పుతో కొడతా

- నిందితుడి భార్య ఆక్రోశం



ముంబై, ఫిబ్రవరి 23: వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని చెప్పుతో కొడతానని ఓ మహిళ ఆక్రోశం వ్యక్తం చేసింది. ఆమె పేరు సుజాత పాటిల్. నీరవ్ కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ అయిన అర్జున్ పాటిల్ భార్య. రూ.11,400 కోట్ల కుంభకోణం కేసులో సీబీఐ అరెస్టు చేసిన వారిలో అర్జున్ కూడా ఉన్నాడు. సీబీఐ కథనం ప్రకారం... పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌వోయూ) సంపాదించడానికి కావలసిన పత్రాలను అర్జున్ సిద్ధం చేశాడు. "నా భర్త అర్జున్ పాటిల్... నీరవ్ కంపెనీ (ఫైర్‌స్టార్ గ్రూపు)లో పదేళ్లుగా పని చేస్తున్నారు. మిగతావారిలాగే ఆయనా పేపర్‌వర్క్ చేసేవారు. దీనంతటికీ నీరవ్ మోదీయే బాధ్యుడు. అతన్ని నా వద్దకు తీసుకురండి... చెప్పుతో కొడతా" అని సుజాత ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కాంతో తనకేం సంబంధం లేదని, అక్రమాలు చేసినవాళ్లు దేశం విడిచి వెళ్లిపోయారని తన భర్త చెప్పారని ఆమె తెలిపింది.

నీరవ్ వాచీల నిధి



- భారీగా విదేశీ చేతి గడియారాలు స్వాధీనం
- 40 కోట్ల బ్యాంకు ఖాతా, షేర్లు గుర్తింపు
- నీరవ్ మోదీ, ఛోక్సీలకు ఈడీ తాజా సమన్లు

ముంబై, ఫిబ్రవరి 23: పంజాబ్ నేషనల్ బ్యాంకును నిండా ముంచిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతని మామ మెహుల్ ఛోక్సీలకు చెందిన కోట్ల నగదు, ఆస్తులు, ఖరీదైన వస్తువులు తవ్వినకొద్దీ బయటపడుతున్నాయి. వీటిలో అత్యంత విలువైన విదేశీ చేతి గడియారాలు భారీ ఎత్తున ఉండటం విశేషం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం నీరవ్‌కు చెందిన సుమారు రూ.44 కోట్ల డిపాజిట్లు, షేర్లను గుర్తించింది. నీరవ్ నెలకొల్పిన అనేక డబ్బా కంపెనీల్లో ఒకదానికి ఖాతాలో రూ.30 కోట్లు ఉన్నాయి. రూ.13.86 కోట్ల షేర్లను కూడా కనుగొన్నారు. వీటిని మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ స్థంభింపజేసింది. అజ్ఞాత వ్యక్తి సమాచారంతో ఈడీ అధికారులు నీరవ్‌కు చెందిన అడ్డాల్లో తనిఖీలు నిర్వహించారు. 176 స్టీలు అల్మారాలు, 218 అట్ట, ప్లాస్టిక్ పెట్టెల్లో దాచిన ఇంపోర్టెడ్ వాచ్‌లు లభించాయి. వర్లీ సముద్ర మహల్‌లోని నీరవ్ నివాసంలో ఉన్న పెయింటింగ్‌ల విలువను ఈడీ అధికారులు లెక్క కడుతున్నారు. గురువారం వేర్వేరు చోట్ల జరిపిన సోదాల్లో నీరవ్, ఛోక్సీకి చెందిన తొమ్మిది విలాసవంతమైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.94 కోట్ల షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌ను స్థంభింపజేశారు. ఈడీ శుక్రవారం నీరవ్, ఛోక్సీలకు మరోసారి సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 26న తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. తన పాస్‌పోర్టును తాత్కాలికంగా సస్పెండ్ చేయడంతో రాలేకపోతున్నానని నీరవ్ ఈడీకి సమాచారం పంపారని చెబుతున్నారు. ఛార్టెడ్ అకౌంటెంట్ల నియంత్రణ సంస్థ అయిన ఐసీఏఐ కూడా రంగంలోకి దిగింది. పీఎన్‌బీ, గీతాంజలి జెమ్స్ ఆడిటర్లుకు షోకాజ్ నోటీసులు పంపింది.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
నిజామాబాద్ • శనివారం 24 ఫిబ్రవరి 2018

'వియన్నా' సెమీస్‌లో కశ్యప్


వియన్నా: ఆస్ట్రియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ స్టార్ షట్లర్ పారుపల్లి కశ్యప్ పురుషుల సింగిల్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. రెండోసీడ్‌గా బరిలోకి దిగిన కశ్యప్ క్వార్టర్స్‌లో 21-17, 21-19తో ఏడోసీడ్ విక్టర్ స్వెన్డ్సెన్ (డెన్మార్క్)పై గెలిచాడు. ఇక స్విస్ ఓపెన్‌లో గురుసాయిదత్ పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో గురుసాయి 8-21, 15-21తో థాయ్‌లాండ్‌కు చెందిన కాంటాపాన్ వాంగ్‌చారోన్ చేతిలో ఓడాడు.

విజయ్ హజారే-తొలి సెమీఫైనల్

కర్ణాటక X మహారాష్ట్ర
స్టార్‌స్పోర్ట్స్ -1లో
ఉ. 9 గం. నుంచి

బీసీసీఐ X సీవోఏ

● డే/నైట్ టెస్టుపై రగడ


అమితాబ్ | వినోద్

న్యూఢిల్లీ: డే/నైట్ టెస్టు వ్యవహారం బీసీసీఐ, కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ)ల మధ్య మరోసారి విభేదాలకు కారణమైంది. అక్టోబర్‌లో భారత్-వెస్టిండీస్ మధ్య డే/నైట్ టెస్టు నిర్వహించాలని బోర్డు కార్యదర్శి అమితాబ్ చౌదరి ప్రతిపాదన చేశారు. అయితే ఈ విషయంలో సీవోఏకు కనీస సమాచారం కూడా లేదు. తమను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అమితాబ్ చౌదరికి సీవోఏ హెడ్ వినోద్ రాయ్ లేఖ రాశారు. కాగా, డే-నైట్ టెస్టు విషయంలో భారత కోచ్ రవిశాస్త్రి, సీఈవో రాహుల్ జోహ్రీ, తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కోశాధికారి అనిరుధ్ చౌదరిని అమితాబ్ సంప్రదించినట్టు సమాచారం. అయితే సీవోఏకు మాత్రం ఎటువంటి సమాచారం లేదు. దీంతో ఒంటెత్తు పోకడలకు పోతున్నారంటూ రాయ్.. ఘాటైన పదజాలంతో లేఖ రాశారు. 'క్రికెట్ సెంటర్‌లో నలుగురితో మాట్లాడి భాగస్వామ్య పక్షాలందరితో చర్చించినట్టుగా భావిస్తున్నారు. అభిమానులకు నేను ప్రాతినిధ్యం వహిస్తున్నా. వాళ్లే అతి పెద్ద భాగస్వామ్య పక్షమ'ని రాయ్ మెయిల్‌లో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను వాయిదా వేయాలని సూచించారు. ముఖ్యంగా ఐదు రోజులపాటు లైట్ల కింద ఆడేందుకు ఆటగాళ్ల శరీరం సహరిస్తుందా? లేదా? అనే పాయింట్‌ను రాయ్ లేవదీశారు. 'రవిని సంప్రదించి ఉంటారు. కానీ కొత్త సమయాల విషయంలో ఐదు రోజులపాటు ఆడే ఆటగాళ్లతో చర్చించాల్సి ఉంది. నిర్వహణ వ్యయం, భద్రత గురించి కూడా ఆలోచించాల'ని రాశారు.

బాక్సింగ్ ఫైనల్లో మేరీకోమ్



సోఫియా (బల్గేరియా): భారత బాక్సింగ్ క్వీన్ మేరీకోమ్ స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నమెంట్‌లో అదరగొడుతోంది. ఈ మణిపురి ముత్యం 48 కిలోల విభాగం బౌట్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీ సెమీస్‌లో చైనా బాక్సర్ యె జియాలిని చిత్తుచేసి స్వర్ణ పతకపోరులో నిలిచింది. మేరీకిది వరుసగా మూడో అంతర్జాతీయ టోర్నీ ఫైనల్ కావడం విశేషం. పురుషుల విభాగంలో వికాస్ క్రిషన్ (75 కి), గౌరవ్ సోలంకి (52 కి), సతీశ్ కుమార్ (+91 కి)లు తమ విభాగాల్లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. క్వార్టర్‌ఫైనల్ బౌట్లలో కిర్గిస్థాన్‌కు చెందిన అజత్ ఉసెనాలెవ్‌పై గౌరవ్.. కజకిస్థాన్ బాక్సర్ తుర్నిస్‌బె కులాఖ్‌మెత్‌పై వికాస్, ఇమాన్ (ఇరాన్)పై సతీశ్ విజయం సాధించారు. తెలంగాణకు చెందిన మహమ్మద్ హుస్సాముద్దీన్ (56 కి), అమిత్ ఫాంగల్ (49 కి).. మహిళల్లో సరితా దేవి (60 కి), సీమా పూనియా (+81 కి), సవీటీ బూరా (75 కి), మీనా కుమారి దేవి (54 కి), భాగ్యమతి కచారి (81కి)లు ఇప్పటికే సెమీస్ చేరిన సంగతి తెలిసిందే. దీంతో ఈ టోర్నీలో ఓవరాల్‌గా పది పతకాలు భారత్‌కు ఖాయమయ్యాయి.

తెలుగు లిఫ్టర్లకు పతకాల పంట


వరుణ్ | సాయి

విశాఖపట్నం (స్పోర్ట్స్): జాతీయ యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు లిఫ్టర్లు సత్తాచాటారు. తెలంగాణకు చెందిన నిహాల్ రాజు, శివనాగేశ్వర సాయి, ఏపీ కుర్రాడు రాగాల వెంకట వరుణ్ పతకాలతో మెరిశారు. శుక్రవారం జరిగిన జూనియర్ పురుషుల 77 కిలోల కేటగిరిలో వరుణ్ ఓ స్వర్ణం సహా మూడు పతకాలు సాధించాడు. తొలుత స్నాచ్‌లో 131 కిలోలు ఎత్తి స్వర్ణ పతకం నెగ్గిన వరుణ్.. క్లీన్ అండ్ జెర్క్‌లో 151 కిలోలతో కాంస్యం, ఓవరాల్‌గా 282 కిలోలతో రజతం సాధించాడు. యూత్ బాలుర 69 కిలోల విభాగంలో శివనాగేశ్వర సాయి క్లీన్ అండ్ జెర్క్ (138 కి)లో ఓ కాంస్యం, ఓవరాల్‌గా 244 కిలోలతో మరో కాంస్యం అందుకున్నాడు. యూత్ బాలుర 77 కిలోల విభాగంలో మొదట స్నాచ్‌లో 116 కిలోలతో రజతం సాధించిన నిహాల్.. క్లీన్ అండ్ జెర్క్‌లో 148 కిలోలతో రజతం, ఓవరాల్‌గా 264 కిలోలతో మరో రజతం దక్కించుకున్నాడు.

కొడుకుని రనౌట్ చేసిన తండ్రి!



గయానా: ఆధునిక క్రికెట్‌లో తండ్రి కొడుకుల ద్వయం మైదానంలో కలిసి ఆడడం అరుదు. వెస్టిండీస్ వెటరన్ క్రికెటర్ శివ్‌నరైన్ చందర్‌పాల్ తన కుమారుడు తేజ్‌నరైన్ చందర్‌పాల్‌తో కలిసి ప్రొఫెషనల్ క్రికెట్‌లో అలరిస్తున్నాడు. అయితే ఓ లీగ్ మ్యాచ్‌లో చందర్‌పాల్ చేతిలో అతని కొడుకు రనౌట్ కావడం విశేషంగా మారింది. సూపర్ 50 కప్ సెమీస్‌లో చందర్‌పాల్ కారణంగా తేజ్ నరైన్ రనౌట్ కావడంతో మ్యాచ్ కూడా చేజారింది. ఈ టోర్నీలో వీరిద్దరూ గయానాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. విన్‌వార్డ్ ఐలాండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో చందర్‌పాల్ కొట్టిన స్ట్రయిట్ డ్రైవ్‌ను బౌలర్ ఆపే ప్రయత్నం చేయగా బంతి అతని షూకు తగిలి వికెట్లను కూల్చింది. దీంతో నాన్ స్ట్రయికర్ తేజ్ నరైన్ (12) క్రీజు బయట ఉండడంతో మైదానం వీడాల్సి వచ్చింది.

టీ-20లు లేకపోతే కష్టమే..!



కోయంబత్తూర్: టీ-20లు లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌కు మనుగడలేదని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. దక్షిణాఫ్రికా టూర్‌లో చివరి టీ-20 మ్యాచ్‌లో భారత్ విజయం సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశాడు. మొత్తం మీద ఇదో మంచి పర్యటన అని చెప్పాడు. 'మనీష్ పాండే, హార్దిక్ పాండ్యాతోపాటు అనేక మంది యువకులకు భారత జట్టులో చోటుదక్కింది. వాళ్లు మంచి ఆటగాళ్లుగా ఎదిగేందుకు తగిన సమయం ఇవ్వాల'ని గంగూలీ అన్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ధోనీ అద్భుతమైన ప్లేయర్ అని కితాబిచ్చాడు. ఫిట్‌నెస్ విషయంలో అంతర్జాతీయ ప్లేయర్లకు మనోళ్లు దీటుగా ఉంటారని చెప్పాడు. మహిళా క్రికెటర్లపై ప్రశంసలు కురిపించాడు. మహిళా క్రికెట్‌లో హర్మన్‌ప్రీత్ సిక్స్ బాదినట్టుగా ఎవరైనా కొడతారా? అని దాదా ప్రశంసించాడు.

వాతావరణం, పిచ్

మ్యాచ్ జరుగుతున్న కొద్దీ పిచ్ మందకొడిగా మారే అవకాశం ఉంటుంది. ఇక్కడ జరిగిన వన్డేలో కోహ్లీ 160 పరుగులతో చెలరేగాడు. ఈసారీ బ్యాట్స్‌మెన్‌కు అనుకూలం. న్యూలాండ్స్‌లో ఆడిన 15 టీ20ల్లో ఛేదన జట్టే 12 సార్లు నెగ్గింది. చిరుజల్లులకు ఆస్కారం ఉన్నా మ్యాచ్‌కు అంత రాయం కలగకపోవచ్చు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధవన్, రైనా, కోహ్లీ (కెప్టెన్), పాండే, ధోనీ, పాండ్యా, భువనేశ్వర్, ఉనాద్కట్, చాహల్, బుమ్రా/ఉనాద్కట్/అక్షర్.

దక్షిణాఫ్రికా: హెన్‌డ్రిక్స్, స్మట్స్, డుమిని (కెప్టెన్), మిల్లర్, బెహర్డీన్, క్లాసెన్, పెహ్లుక్వాయో, మోరిస్, డాలా, ప్యాటర్సన్/ఫంగిసో, షంసి.

అచ్చంగా వన్డే సిరీస్ తరహాలోనే టీ20ల్లోనూ భారత్ జోరుకు కీలక సమయంలో దక్షిణాఫ్రికా బ్రేక్ వేసింది. అయితే వన్డేలను ఎలాంటి ఇబ్బంది లేకుండా ముగించిన టీమిండియా ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో చావో.. రేవో తేల్చుకునేందుకు బరిలోకి దిగబోతోంది. ఎందుకంటే మిగిలింది ఒక్కటే మ్యాచ్. సిరీస్ 1-1తో సమమైన నేపథ్యంలో ఎవరు నెగ్గితే వారే విజేత. గత మ్యాచ్‌లో బయటపడ్డ లోపాలను సరిదిద్దుకుని తమ రెండు నెలల పర్యటనను 'డబుల్' సిరీస్ విజయంతో ముగింపు పలికేందుకు భారత్ సిద్ధమవుతోంది.

మరోవైపు రెండో మ్యాచ్‌కు ఆతిథ్య దక్షిణాఫ్రికా పకడ్బందీ ప్రణాళికతో బరిలోకి దిగి సిరీస్‌లో నిలవగలిగింది. భారత బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడిన హెన్రిక్ క్లాసెన్, డుమిని విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌నూ వదలకుండా వన్డే సిరీస్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో సఫారీలున్నారు. అయితే న్యూలాండ్స్ మైదానంలో వారికి మెరుగైన రికార్డు లేకపోవడం ఆందోళనపరిచే విషయం.

సోనీ టెన్1, 3ల్లో రాత్రి 9.30 నుంచి ప్రత్యక్ష ప్రసారం


కెప్టెన్ కోహ్లీ | కోచ్ రవిశాస్త్రి

డబుల్ ధమాకా దక్కేనా?

● సఫారీలతో మహిళల చివరి టీ-20 నేడే
● మరో సిరీస్‌పై కన్నేసిన భారత్

సోనీ టెన్-1, 3లో సా. 4.30 నుంచి

కేప్‌టౌన్: అరుదైన డబుల్ సిరీస్ విజయంతో చరిత్ర సృష్టించడానికి భారత మహిళల జట్టు ఒక్క మ్యాచ్ దూరంలో ఉంది. ఐదు టీ20ల సిరీస్‌లో ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉన్న భారత్.. శనివారం జరిగే చివరి మ్యాచ్‌లో విజయంతో అరుదైన ఫీట్ సాధించాలనే పట్టుదలతో ఉంది. నాలుగో మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో సిరీస్ కోసం హర్మన్‌ప్రీత్ సేన చివరి మ్యాచ్ వరకు వేచి ఉండక తప్పలేదు. మొదటి రెండు టీ20 మ్యాచ్‌ల్లో భారత జట్టు ఏడు, తొమ్మిది వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే మూడో మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో నెగ్గిన దక్షిణాఫ్రికా సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. నాలుగో టీ20లో పర్యాటక జట్టు సౌతాఫ్రికాను 15.3 ఓవర్లలో 130/3తో కట్టడి చేసి సిరీస్ నెగ్గే అవకాశాలను మెరుగుపరచుకుంది. కానీ వరుణుడు అడ్డుపడ్డాడు.


స్మృతి | హర్మన్‌ప్రీత్

ఈ చివరి మ్యాచ్‌లో నెగ్గితే సౌతాఫ్రికా టూర్‌లో రెండు సిరీస్ (వన్డే, టీ20)లు నెగ్గిన టీమ్‌గా భారత జట్టు చరిత్ర సృష్టిస్తుంది. ఆస్ట్రేలియా టూర్‌కు ముందు అమ్మాయిల ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా బ్యాటింగ్‌లో భారత్ బలంగా ఉంది. చివరి మ్యాచ్‌లో కొంత పొదుపుగా బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది. శిఖా పాండే కొత్త బంతితో సత్తాచాటాల్సి ఉంది. మూడో టీ20 విజయం నేపథ్యంలో మరోసారి అదే తరహా ప్రదర్శనతో సిరీస్‌ను సమం చేయాలని సౌతాఫ్రికా కెప్టెన్ నీకెర్క్ పట్టుదలతో ఉంది. అయితే ఫామ్‌లో ఉన్న భారత మహిళలు సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తారో లేదో చూడాలి.

విజయంతో ముగించాలని..

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ చివరి టీ20 ● ఆత్మవిశ్వాసంలో సఫారీలు

కేప్‌టౌన్: సూపర్ బ్యాటింగ్‌తో రెండో టీ-20ని గెలుచుకున్న దక్షిణాఫ్రికా జట్టు సిరీస్‌ను రసవత్తరంగా మార్చేసింది. తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత జట్టు 28 పరుగులతో నెగ్గింది. కానీ ఆ తర్వాత పుంజుకున్న ప్రొటీస్ ఆరు వికెట్లతో నెగ్గి భారత్‌ను బేజారెత్తించింది. ఈ నేపథ్యంలో నేడు (శనివారం) జరిగే నిర్ణాయక చివరి మ్యాచ్‌లో ఇరు జట్లు అమీ తుమీ తేల్చుకోనున్నాయి. తమ చివరి మ్యాచ్ ఓటమికి బదులు తీర్చుకోవడంతో పాటు సిరీస్‌ను ఖాతాలో వేసుకోవాలని భారత్ చూస్తోంది. ఇక ఎట్టి పరిస్థితిలోనూ మరో సిరీస్‌ను భారత్‌కు వదలకూడదనే కృతనిశ్చయంతో దక్షిణాఫ్రికా ఉంది. విరాట్ కోహ్లీ నేతృత్వంలో భారత జట్టు మూడు టీ20ల సిరీస్‌ను ఇప్పటిదాకా కోల్పోలేదు. మరోవైపు ఆతిథ్య జట్టుకు కూడా ఇక్కడ మెరుగైన రికార్డేమీ లేదు. ఎనిమిది టీ20లు ఆడితే ఐదింటిలో ఓడింది.

బౌలర్ల రాణింపే కీలకం..: భారత జట్టును ఇప్పటిదాకా వేధిస్తున్న మిడిలార్డర్ సమస్య రెండో టీ20లో తీరిపోయింది. మనీష్ పాండే, ఎంఎస్ ధోనీ అర్ధ సెంచరీలతో స్కోరును పరిగెత్తించారు. ఓపెనర్ శిఖర్ ధవన్ ఫామ్ నిలకడగా ఉంటోంది. సురేశ్ రైనా అంచనాలకు మించి ఆకట్టుకుంటున్నాడు. టాప్ ఆర్డర్‌లో ఒక్క రోహిత్ మాత్రమే విఫలమవుతున్నాడు. ఇక పాండ్యా నుంచి మెరుపులు రావడం లేదు. బుధవారం నాటి మ్యాచ్‌లో బౌలింగ్ విభాగం ఒక్కసారిగా డీలా పడింది. లెగ్ స్పిన్నర్ చాహల్ బౌలింగ్ తీరును క్షుణ్ణంగా పరిశీలించిన క్లాసెన్ ఊచకోతకు దిగాడు. దీంతో అతడు ధారాళంగా పరుగులిచ్చి చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. రెండు మ్యాచ్‌ల్లో ఎనిమిది ఓవర్లు బౌల్‌చేసిన చాహల్ ఒక్క వికెట్ మాత్రమే తీసి 103 పరుగులు సమర్పించుకున్నాడు. ఇక బుమ్రా ఫిట్‌నెస్ ఇప్పటికీ సందేహంగా ఉంది. లెఫ్టార్మ్ పేసర్ ఉనాద్కట్ కూడా పరుగులను నియంత్రించలేకపోతున్నాడు. రెండు మ్యాచ్‌ల్లో 9.78 సగటుతో 75 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. ఒకవేళ బుమ్రా ఆడితే ఉనాద్కట్ స్థానం కోల్పోవాల్సి వస్తుంది. ఈనేపథ్యంలో చివరిదైన ఈ మ్యాచ్‌కు కెప్టెన్ కోహ్లీ మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది.

జోష్‌లో ఆతిథ్య జట్టు: కీలక విజయంతో రేసులోకి వచ్చిన సఫారీలు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. జట్టులో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. క్లాసెన్, డుమిని తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మరో ఎనిమిది బంతులుండగానే ఆ జట్టు రెండో మ్యాచ్‌ను గెలిచింది. వీరిద్దరూ


బౌలింగ్ కోచ్ హెండర్సన్‌తో సౌతాఫ్రికా సారథి డుమిని

ముఖ్యంగా చాహల్, ఉనాద్కట్ బౌలింగ్‌ను లక్ష్యంగా చేసుకుని పరుగులు పిండుకున్నారు. ఈ మ్యాచ్‌లోనూ వారు ఇదే రీతిన రెచ్చిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. తొలి మ్యాచ్‌లో స్పిన్‌ను ఓపెనర్ హెన్‌డ్రిక్స్ బాదేశాడు. బెహర్డీన్, మిల్లర్ స్థాయికి తగ్గట్టుగా ఆడలేకపోతున్నారు. సిరీస్‌ను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో రాణించి మున్ముందు జట్టు తరపున చోటు ఖాయం చేసుకోవాలని ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్ భావిస్తున్నారు. బౌలర్లలో జూనియర్ డాలా, స్పిన్నర్ షంసి ప్రభావం చూపిస్తున్నారు. మరో స్పిన్నర్ ఫంగిసోను తీసుకుంటే ప్యాటర్సన్‌కు ఉద్వాసన తప్పదు.

న్యూలాండ్స్ మైదానంలో భారత్‌కు ఇదే తొలి టీ20 మ్యాచ్

ఈ మైదానంలో ఆడిన తమ చివరి ఆరు టీ20ల్లో దక్షిణాఫ్రికా ఒక్క మ్యాచే గెలిచింది.

కొరియాతో సిరీస్‌కు రజని

న్యూఢిల్లీ: వచ్చే నెలలో దక్షిణ కొరియాతో జరిగే సిరీస్‌కు ఏస్ స్ట్రైకర్ రాణి రాంపాల్‌కు భారత మహిళా హాకీ జట్టు పగ్గాలు అప్పగించారు. అనుభవజ్ఞురాలైన గోల్‌కీపర్ సవితకు విశ్రాంతి కల్పించడంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యతిమరపు రజని, తొలిసారి జట్టుకు ఎంపికైన స్వాతి ఆ బాధ్యతలు పంచుకోనున్నారు. డిఫెండర్ సునీతా లక్రా వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనుంది. మార్చి 3నుంచి 12వ తేదీవరకు భారత్-దక్షిణ కొరియా అయిదు మ్యాచ్‌ల సిరీస్ ఆడనున్నాయి. గత నవంబర్‌లో చైనాను 5-4 తేడాతో ఓడించి ఆసియాకప్ నెగ్గిన తర్వాత భారత్ చేపట్టిన తొలి విదేశీ పర్యటన ఇది.

జట్టు: రాణి రాంపాల్ (కెప్టెన్), వందన, లాల్‌రెమ్, నవ్‌జోత్ కౌర్, నవ్‌నీత్ కౌర్, పూనమ్, సునీతా లక్రా (వైస్‌కెప్టెన్), దీపిక, దీపా గ్రేస్ ఎక్కా, సుమన్ దేవి తోడం, గుర్జీత్, సుశీల చాను, మోనిక, నమిత టొప్పొ, నిక్కి, నేహ, లిలిమా, ఉదిత; గోల్‌కీపర్లు - రజని యతిమరపు, స్వాతి.


రజని

ఇది విజయవంతమైన పర్యటన



(కృష్ణమాచారి శ్రీకాంత్)

దక్షిణాఫ్రికా పర్యటన ముగింపునకు వచ్చేసింది. జట్టు ప్రదర్శనపై కెప్టెన్ విరాట్ కోహ్లీ, మేనేజ్‌మెంట్ సంతోషంగానే ఉన్నట్టుగా అనిపిస్తోంది. టెస్టు సిరీస్ చేజార్చుకున్నా.. వన్డేల్లో ఆతిథ్య జట్టును టీమిండియా చిత్తు చేసింది. ఇక టీ20ల్లోనూ అదరగొడుతోంది. మొత్తంమీద ఈ పర్యటన విజయవంతమైనట్టుగానే భావిస్తున్నా. ఈ టూర్‌లో కోహ్లీ బ్యాటింగ్‌లో అదరగొడుతూనే జట్టును ముందుండి నడిపించాడు. ఇక బౌలర్లు అద్భుతంగా రాణించారు. పేసర్ భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమి టెస్టుల్లో కీలకపాత్ర పోషించారు. ఇక వన్డేల్లో స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ మాయాజాలంతో సౌతాఫ్రికా కుదేలైంది. అయితే మిడిలార్డర్ ఇంకా కుదురుకోక పోవడం కొంత ఆందోళన కలిగించే అంశం. కేప్‌టౌన్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ నెగ్గాల్సింది. కానీ బ్యాటింగ్ వైఫల్యం దెబ్బకొట్టింది. టెస్టుల్లో ఓపెనర్లు విఫలమవడంపై దృష్టి సారించాలి. వన్డేల్లో మాత్రం ఓపెనర్లు శుభారంభాలను అందించారు. ఈ ఏడాదిలో జరిగే విదేశీటూర్లకు ఈ అనుభవం ఎంతో ఉపయోగపడుతుంది.

-(టీసీఎమ్)

మార్చి 2 నుంచి థియేటర్లు బంద్

▸ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దక్షిణాది అంతా

▸ తమిళ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ఫిల్మ్ చాంబర్ల మద్దతు



హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల రెండు నుంచి తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లు బంద్ చేయాలని టాలీవుడ్ చిత్రపరిశ్రమ నిర్ణయించింది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ఫిల్మ్ చాంబర్లు కూడా దీనికి మద్దతు పలకడంతో దక్షిణాది వ్యాప్తంగా థియేటర్లు తాత్కాలికంగా మూతపడనున్నాయి. దక్షిణాది సినిమాలను చులకనభావంతో చూస్తూ, వర్చ్యువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్) పేరుతో నిర్మాతల్ని, పంపిణీదారుల్ని నిలువునా దోచుకొంటున్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ (డీఎస్‌పీ) ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని తెలుగు ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు జెమినీ కిరణ్ చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి నిర్మాత సురేశ్‌బాబు ఛైర్మన్‌గా 46 మంది సభ్యులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) శుక్రవారం బెంగళూరులో 'క్యూబ్.. యూఎఫ్‌వో' ప్రతినిధులతో చర్చలు జరిపింది. ప్రస్తుతం వసూలు చేస్తున్న వీపీఎఫ్‌లో 25 శాతం తగ్గించాలని జేఏసీ చేసిన డిమాండ్‌ను ప్రతినిధులు అంగీకరించలేదు. 9 శాతం మాత్రమే తగ్గించగలమని చెప్పారు. ఇది ఆమోదయోగ్యం కాకపోవడంతో, ముందు అనుకొన్నట్లుగానే మార్చి రెండు నుంచి థియేటర్లు బంద్ చేయాలనీ, క్యూబ్-యూఎఫ్‌వోకు ఇకపై కంటెంట్ ఇవ్వకూడదనీ జేఏసీ నిర్ణయించింది. మార్చి మొదటి వారంలో విడుదలకు ప్లాన్ చేసుకున్న, ఇప్పటికే విడుదలైన చిత్రాలపై ఈ నిర్ణయం ప్రభావం చూపిస్తుంది.

ఎక్కువసేపు టీవీ చూస్తే రక్తం గడ్డకడుతుంది



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: గంటల తరబడి కూర్చొని టీవీ చూస్తున్నారా? కంప్యూటర్‌పై పని చేస్తున్నారా? అయితే, రక్త సరఫరా మందగించి సిరల్లో నెత్తురు గడ్డకట్టుకుపోయే (వీటీఈ) ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాళ్లకు, పాదాలకు రక్త సరఫరా మెరుగ్గా జరగక మోకాళ్ల వద్ద, నడుము భాగంలో రక్తం గడ్డకడుతుందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా పరిశోధకులు తెలిపారు. ఒక చోట రక్త సరఫరా సరిగా జరగకపోతే ఆ స్థానంలో రక్తం గడ్డకట్టుకుపోవడమే కాకుండా శరీరంలోని మరో చోట కూడా గడ్డకట్టుకుపోయే ప్రమాదం ఉందని వెల్లడించారు. 45-64 మధ్య వయసున్న 15వేల మందిని పరీక్షించగా టీవీకి అతుక్కుపోయే వారిలో వీటీఈ సమస్య 1.7రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిందని వివరించారు. రక్తం గడ్డ కట్టకుండా ఇంట్లోనే కొన్ని ఆయుర్వేద పద్ధతులు వాడొచ్చు. పరిస్థితి అదుపు తప్పుతుందని తెలిస్తే కచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి.

రక్తం గడ్డ కట్టకుండా చేసే పదార్థాలు

పసుపు: పసుపులోని కర్క్యుమిన్ రసాయనం రక్త ఫలకికలపై పనిచేసి రక్తం గడ్డ కట్టకుండా చేస్తుంది. గడ్డ కట్టినపుడు వచ్చే నొప్పి నుంచి ఉపశమనాన్ని ఇస్తుంది.

కారం: రక్తాన్ని పలుచగా మార్చుతుంది. అందులో ఉండే 'సిలిసిలేట్' శరీరంపై మంచి ప్రభావం చూపుతుంది.

వెల్లుల్లి: వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు రక్తం గడ్డ కట్టకుండా చేస్తాయి. రోజూ ఉదయం ఒక వెల్లుల్లి పాయ తింటే ప్రయోజనం ఉంటుంది.

కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించి, వాటి హార్డ్ డిస్కును సేకరించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సమక్షంలోనే చీఫ్ సెక్రెటరీ అన్షు ప్రకాశ్‌పై దాడి జరగడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోంది. సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వ ప్రకటనలకు సంబంధించి మాట్లాడేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం కేజ్రీవాల్ పిలిపించారు. ఎమ్మెల్యేల సమక్షంలో మాట్లాడుతున్నప్పుడు మాటామాటా పెరిగి, ఆప్ ఎమ్మెల్యేలు దాడి చేశారు. సీఎస్ అన్షు ప్రకాశ్ ఫిర్యాదుపై ఎమ్మెల్యేలు ప్రకాశ్ జర్వాల్, అమానతుల్లా ఖాన్‌లను అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం వారిద్దరినీ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం బెయిలు నిరాకరించింది. అర్ధరాత్రి సమయంలో సీఎం నివాసానికి పిలిపించి దాడి చేయడం తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. దీన్ని కుట్రగానే పరిగణిస్తామని పేర్కొంది. ఇద్దరినీ జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

ఏడు కెమెరాలు పని చేయడం లేదు

శుక్రవారం సోదాల్లో కేజ్రీవాల్ ఇంట్లో ఉన్న 21 సీసీ కెమెరాలు 40 నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్నాయని తేలింది. అందులో ఏడు కెమెరాలు పూర్తిగా స్విచ్ఆఫ్ చేసి ఉన్నాయి. దాడి అర్ధరాత్రి 12.15 గంటలకు జరిగితే సీసీటీవీ ఫుటేజీలో మాత్రం రాత్రి 11.30కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తిరిగి వెళ్లినట్లు ఉంది. తమ సోదాల వల్ల సీఎం 40 నిమిషాలు కదలకుండా కూర్చోవాల్సి వచ్చిందని ఆప్ చేసిన ఆరోపణలను ఢిల్లీ పోలీసు అదనపు డిప్యూటీ కమిషనర్ తోసిపుచ్చారు. కేజ్రీవాల్‌తో తాము కనీసం మాట్లాడలేదని వెల్లడించారు. దాడి జరిగిన గదిలో కెమెరాలు లేవని, బయట కారిడార్లో మాత్రమే కెమెరాలు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. మంగళవారం సీసీ ఫుటేజీ ఇవ్వాలని కోరగా స్పందన రాలేదని, అందుకే సోదాలు చేయాల్సి వచ్చిందని వివరించారు. దర్యాప్తులో భాగంగా సీఎం సహా దాడి సమయంలో అక్కడున్న వారందర్నీ ప్రశ్నిస్తామని ప్రకటించారు.



లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలిసి వస్తున్న కేజ్రీవాల్, సిసోడియా

రెండు చెంప దెబ్బలకే ఇలా..!

రెండు చెంపదెబ్బలకు భారీ పోలీసు బలగం తన ఇంటి మీద దిగిందని, ఇల్లంతా సోదాలు చేసిందని, జడ్జి లోయా అనుమానాస్పద మరణానికి సంబంధించి అమిత్‌షాను ఎప్పుడు ప్రశ్నించబోతున్నారని కేజ్రీవాల్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. దాంతో పాటు ఆయన శుక్రవారం ఆయన ఒక బహిరంగ సభలో మాట్లాడారు. "ఈ అధికారులు ఏమన్నా అంటే నొచ్చుకుంటారు. నేను ప్రజల కోసం పోరాడుతుంటే బీజేపీ, లెఫ్టినెంట్ గవర్నర్, అధికారులు అడ్డుపడుతున్నారు" అని వ్యాఖ్యానించారు. సోదాలు సీఎంను అవమాన పరచేందుకేనని ఢిల్లీ ప్రభుత్వ అధికార ప్రతినిధి అశుతోష్ వ్యాఖ్యానించారు. కేంద్రం చేతుల్లో కీలుబొమ్మలైన పోలీసులు చట్ట విరుద్ధంగా సీఎం ఇంట్లోకి ప్రవేశించారని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ అన్నారు.

అప్పుడక్కడ లేను... దాడి నిజమే

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీద దాడి జరిగిన సంగతి నిజమేనని సీఎం కేజ్రీవాల్ సలహాదారు వీకే జైన్ పోలీసులకు వెల్లడించారు. దాడి జరుగుతున్న సమయంలో వాష్‌రూమ్‌కు వెళ్లానని గురువారం ప్రకటించిన జైన్ శుక్రవారం న్యాయస్థానంలో ప్రశ్నించినపుడు మాటమార్చారు. తాను వాష్‌రూమ్‌కు వెళ్లింది వాస్తవమేనని, తిరిగి వచ్చేసరికి చీఫ్ సెక్రెటరీ కళ్లజోడు వెతుక్కుంటున్నారని, అప్పుడున్న వాతావరణం చూస్తే ఇద్దరు ఎమ్మెల్యేలు దాడి చేసినట్లే అనిపించిందని చెప్పారు. అంతకుముందు ఏం జరిగిందో తనకు తెలియదన్నారు. పరస్పర విరుద్ధ ప్రకటనలు చేసిన వీకే జైన్ తన సలహాదారు పదవికి రాజీనామా చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ముందు రోజు ప్రకటనను మార్చుకోవాలని వీకే జైన్ పై పోలీసులు ఒత్తిడి తెచ్చారని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించింది. సామాన్యుడి ప్రగతికి సంబంధించిన పనులు ఆపిన అధికారులెవరికైనా దెబ్బలు తప్పవని ఆప్ ఎమ్మెల్యే నరేశ్ బాల్యాన్ శుక్రవారం జరిగిన ఒక ర్యాలీలో పైవిధంగా మాట్లాడారు. కేజ్రీవాల్ రహస్య డీల్స్ చేసే గదిలో సీసీ కెమెరాలు లేవని, అక్కడే చీఫ్ సెక్రెటరీని కొట్టారని ఆప్ రెబల్‌ఎమ్మెల్యే కపిల్‌మిశ్రా ఆరోపించారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌తో భేటీ

సోదాల అనంతరం సీఎం కేజ్రీవాల్ నేతృత్వంలోని మంత్రివర్గం లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలిసింది. గదిలో జరిగిన సమావేశం వివరాలపై అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు. సమావేశం పూర్తయిన తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్... చీఫ్ సెక్రెటరీపై ఎమ్మెల్యేల దాడిని తీవ్రంగా ఖండిస్తూ ట్విట్టర్‌లో ప్రకటన జారీ చేశారు. "సీఎం కేజ్రీవాల్, మంత్రులతో భేటీ అయ్యాను. అధికారిపై దాడిని తీవ్రంగా ఖండించాను. ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య నెలకొన్న అపనమ్మక వాతావరణం తొలగిపోవాలి. అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూడాలి. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు" అన్నారు. కేజ్రీవాల్ కూడా ట్విట్టర్‌లో స్పందించారు. ప్రభుత్వ పాలన సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని లెఫ్టినెంట్ గవర్నర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. మూడు రోజులుగా అధికారులు సమావేశాలకు రావడం లేదని ఆయన దృష్టికి తెచ్చామన్నారు. అధికారులతో కలిసి సామరస్య పూర్వకంగా పని చేస్తామని హామీ ఇచ్చామన్నారు.

పాక్‌పై ఉగ్ర ముద్ర!

ఉగ్రవాదులకు సాయంపై కన్నెర్ర.. గ్రే లిస్ట్‌లో చేర్చేందుకు 36 దేశాల మద్దతు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: అంతర్జాతీయంగా పాకిస్థాన్‌కు మరోఎదురు దెబ్బ తగిలింది. ఉగ్రవాదులకు ఆర్థిక సాయం చేస్తున్న దేశాల జాబితాలో పాక్‌ను చేర్చేందుకు పారిస్‌లో జరిగిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ సమావేశంలో 36 దేశాలు మద్దతిచ్చాయి. పాక్ మిత్ర దేశాలైన సౌదీ అరేబియా, చైనా కూడా ఈ జాబితాలో ఉండడం గమనార్హం. టర్కీ మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించింది. పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో పెట్టాలని అమెరికా తీర్మానం ప్రవేశపెట్టగా భారత్, యూకే, ఫ్రాన్స్ మద్దతు పలికాయి. తీర్మానానికి అనుకూలంగా 36 ఓట్లు రాగా, వ్యతిరేకంగా ఒక ఓటు(టర్కీ) వచ్చింది. వచ్చే జూన్ నుంచి ఈ జాబితాలోకి పాక్‌ను చేర్చనున్నారు దీంతో ఇకపై.. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, బ్యాంకులు పాకిస్థాన్‌లో కార్యకలాపాలు నిర్వహించడం కష్టమవుతుంది. పాకిస్థానీ వ్యాపార సంస్థలకు అంతర్జాతీయంగా రుణాలు సేకరించడం కష్టంగా మారనుంది. పాకిస్థాన్‌కు దాదాపు రూ.19లక్షల కోట్ల రుణాలున్నాయి. జూన్‌లోగా ఈ రుణాలకు సంబంధించిన బాధ్యతలు నెరవేర్చకపోతే అంతర్జాతీయ రేటింగ్ సంస్థలైన మూడీస్, ఫిచ్‌లు ఆ దేశానికి రేటింగ్ తగ్గించనున్నాయి.

ట్రంప్ అసంతృప్తి

ఉగ్రవాద నిర్మూలనకు పాకిస్థాన్ తీసుకుంటున్న చర్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏమాత్రం సంతృప్తిగా లేరని వైట్‌హౌస్ వెల్లడించింది. ఉగ్రవాదంపై చర్యలు తీసుకోవడం లేదన్న కారణంతో కొద్ది రోజుల క్రితమే అమెరికా ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది. అఫ్ఘానిస్థాన్‌లో విమానయాన నిర్వహణలో అమెరికాకు సాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని పెంటగాన్ వెల్లడించింది.

భారత్‌పై దాడులకు భారీ కుట్ర: ఎన్ఐఏ

▸ శ్రీలంక కేంద్రంగా పాక్ ఉగ్రవాదుల పన్నాగం

చెన్నై, ఫిబ్రవరి 23: భారత్‌లో దాడులకు పాకిస్థాన్ ఉగ్రవాదులు శ్రీలంకను కేంద్రంగా వాడుకుంటున్నారా? ఈ ప్రశ్నకు ఎన్ఐఏ చార్జిషీట్ ఔననే సమాధానం చెబుతోంది. చెన్నైలోని అమెరికా కాన్సులేట్, బెంగళూరులోని ఇజ్రాయిల్ కాన్సులేట్ కార్యాలయాలతోపాటు విశాఖపట్నంలోని తూర్పు నావికాదళ ప్రధాన కార్యాలయంపై, ఇతర పోర్టులపై దాడులకు శ్రీలంక కేంద్రంగా పాక్ ఉగ్రవాదులు భారీ కుట్రలు పన్నారని ఎన్ఐఏ పేర్కొంది. దీనికి ప్రధాన సూత్రదారుడు శ్రీలంకలోని కొలంబోలో మకాం వేసిన పాక్ మాజీ దౌత్యవేత్త అమీర్ జుబైర్ సిద్ధిఖీ అని పేర్కొంటూ గురువారం చెన్నైలోని పొన్నమల్లె కోర్టులో అదనపు చార్జిషీట్‌ను దాఖలు చేసింది. చెన్నై కేంద్రంగా దొంగనోట్లను చలామణి చేసే జాకీర్ హుస్సేన్ (37)ను 2013లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఈ భారీ కుట్ర బయటపడింది.

'నెట్' నోటిఫికేషన్ విడుదల

▸ మార్చి 3 నుంచి రిజిస్ట్రేషన్లు.. జులై 8న పరీక్షలు

▸ 91 నగరాల్లో కేంద్రాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: జాతీయ అర్హత పరీక్ష (యూజీసీ-నెట్)కు అధికారిక నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. గత ఏడాది ద్వివార్షిక క్యాలెండర్‌ను తప్పిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఈ ఏడాది జులైలో నెట్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. ఇందుకు మార్చి 3 - ఏప్రిల్ 5ల మధ్య cbsenet.nic.in వెబ్‌సైట్‌ను బ్రౌజ్ చేయాలని పేర్కొంది. జులై 8న పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించింది. 84 సబ్జెక్టుల్లో జరిగే ఈ పరీక్షలను 91 నగరాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించింది.

అభ్యర్థులకు సూచనలు

- చివరి నిమిషంలో సర్వర్ మొరాయింపులతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు.. వీలైనంత త్వరగా దరఖాస్తు చేయడం ఉత్తమం. నెట్‌వర్క్ సమస్యలకు బాధ్యత తమది కాదని సీబీఎస్ఈ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు డిజిటల్ ఫొటోను జతచేయాల్సి ఉంటుంది. ఇది జేపీజీ ఫార్మాట్‌లో ఉండాలి. ఫైల్ సైజు 4కేబీలకు తక్కువ కాకుండా.. 40 కేబీలకు మించకుండా ఉండాలి. ఫొటో సైజు 3.5 సెంటీమీటర్ల వెడల్పు, 4.5 సెంటీమీటర్ల పొడవులో ఉండాలి.
- దరఖాస్తుకు డిజిటల్ సంతకం తప్పనిసరి. ఇందుకు తెల్లకాగితంపై చేసిన సంతకాన్ని స్కాన్ చేసుకోవాలి. ఈ ఫైల్ కూడా జేపీజీ ఫార్మాట్‌లో ఉండాలి. ఫైల్ సైజు 4-30 కేబీల మధ్యలో ఉండాలి. డిజిటల్ సిగ్నేచర్ సైజు 3.5 సెంటీమీటర్ల వెడల్పు, 1.5 సెంటీమీటర్ల పొడవులో ఉండాలి.
- దరఖాస్తు పూర్తిచేశాక.. 'అప్లై' బటన్‌ను ఎంచుకోవడానికి ముందే.. ఫీజు చెల్లింపు పద్ధతిని స్పష్టం చేయాలి. ఫీజును క్రెడిట్/డెబిట్ కార్డులు, ఈ-చలాన్ ద్వారా చెల్లించవచ్చు. డీడీలు/చెక్కులు/మనీ ఆర్డర్ల ద్వారా జరిపే చెల్లింపులను తిరస్కరిస్తారు.

మళ్లీ హెచ్-1బీ బాంబ్

▸ వీసా రూల్స్ ఇక మరింత కఠినతరం

▸ మూడేళ్ల పరిమితిని నియంత్రించే అవకాశం

వాషింగ్టన్, ఫిబ్రవరి 23: భారతీయ టెకీలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చుక్కలు చూపిస్తున్నారు. హెచ్-1బీ వీసా రూల్స్‌ను మరింత కఠినతరం చేస్తూ ట్రంప్ సర్కార్ తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఒక టెకీని పనిలోకి తీసుకున్న భారత ఐటీ కంపెనీలు ఇకపై అతని పనికి సంబంధించి అనేక పత్రాలు సమర్పించాల్సిన పరిస్థితి. ఇప్పటిలా- ఉద్యోగిని థర్డ్‌పార్టీ వర్క్‌సైట్‌కి పంపినపుడు ఏదో ఒక చిన్న మెయిల్ ఇచ్చేసి, ఫలానా చోటకు వెళ్లు అని చెప్పడం కుదరదు. నిర్దిష్ట బాధ్యతలు, అందుకు ఆ వ్యక్తికి ఉన్న అర్హతలు, కంపెనీలో అతని హోదా వంటి పత్రాలెన్నో చూపాలి. పర్యవేక్షణాధికారుల పేర్లు, వివరాలు, బాధ్యతలు, హోదాలు సమర్పించాలి. ఈ నిబంధనలు గురువారమే అమల్లోకి వచ్చాయి.

ఓ విదేశీ నిపుణుడిని ఒక కంపెనీ నిర్దిష్టమైన పని కోసం తీసుకోడానికి అనుమతించేదే హెచ్-1బీ వీసా. భారతీయ సాంకేతిక నిపుణులే ఎక్కువ సంఖ్యలో దీన్ని ఉపయోగించుకుంటున్నారు. ఇది దుర్వినియోగం అవుతోందని, ఇష్టానుసారం దీనిని కంపెనీలు వాడుకుంటూ వేలమంది భారతీయ టెకీలను తక్కువ జీతాలకు తీసుకొంటూ.. అమెరికన్ల ఉద్యోగాలకు గండికొడుతున్నాయని ట్రంప్ ప్రభుత్వం మొదట్నుంచీ ఆరోపిస్తోంది. ఈ విధానంలో సంస్కరణలు తీసుకొచ్చే నెపంతో 'అమెరికా ఫస్ట్' పేరిట ఓ విధానానికి రూపకల్పన చేస్తోంది. తద్వారా హెచ్-1బీ వీసాల సంఖ్యను, గ్రీన్‌కార్డుల జారీని నియంత్రించాలన్నది వ్యూహం. సాధారణంగా ఒక ఉద్యోగి తాలూకు పనిచేసే ప్రదేశం తరుచూ మారుస్తుంటారు, కంపెనీ/క్లయింట్ అవసరాలను బట్టి ఇక మీదట అలా పంపేటపుడు అమెరికా ఇమిగ్రేషన్ విభాగానికి అన్ని వివరాలతో కూడిన పత్రాలు పంపాలన్నది తాజా నిబంధన.



- వేరే చోట్ల ఉద్యోగి పనికి సంబంధించిన ఒప్పందాలు, అక్కడ ఎంతకాలం ఉండాలి అన్నవి సమర్పించాలి.
- ఆ ఉద్యోగిని ఏ పని నిమిత్తం అక్కడికి పంపుతున్నారు, సాంకేతిక అర్హతలేంటి అన్నవి పత్రాల రూపంలో తెలపాలి.
- అవసరమైన బ్రోచర్లు, ఖర్చుకు సంబంధించిన పత్రాలు ఇవ్వాలి.. సదరు ఉద్యోగికి, పనికి ఎలా డబ్బు సమకూరుస్తారో కూడా తెలపాలి
- మైల్‌స్టోన్ టేబుల్ (అంటే బిజినెస్ ప్లాన్, బడ్జెట్, కాల పరిమితి, యాజమాన్యం బాధ్యతల ప్రణాళిక) ను ఇవ్వాలి.
- మార్కెటింగ్ అనాలసిస్, కాస్ట్ బెనిఫిట్ అనాలసిస్ ఇవ్వాలి. ఉద్యోగి నిర్వర్తించే బాధ్యతలకు సంబంధించిన సమగ్ర వివరాలు ఇవ్వాలి. అతని అర్హతలు, వేతనం, పర్యవేక్షకుడి వివరాలు చెప్పాలి.
- వేరే చోట పనికి నియోగించే వ్యక్తికి హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే వారు- ఆ వ్యక్తి ఓ ప్రత్యేక హోదాతో ఉన్న విషయాన్ని తెలియజెప్పే ఆధారాలు చూపాలి.
- అనుమతి ఇచ్చినంతకాలం ఆ ఉద్యోగితో సదరు కంపెనీ సంబంధాన్ని కొనసాగించాలి
- వేరే చోటికి పంపే హెచ్-1బీ వీసాదారులకు- ప్రత్యేక హోదాలో- నిర్దిష్టమైన, ఊహాజనితం కాని బాధ్యతలున్నాయన్న విషయాన్ని స్పష్టం చేయాలి. తగిన పత్రాలు ఇవ్వాలి.
- హెచ్-1బీ వీసాను ఇంతవరకూ మూడేళ్ల వరకూ అనుమతిస్తున్నారు. వేరే చోట పనిగనక ముందుగానే అయిపోతే- ఇమిగ్రేషన్ విభాగం ఇక ఆ వీసా కాలపరిమితి ముగిసినట్లేనని చెప్పే అవకాశం ఉంటుంది. పరోక్షంగా- ఇది మూడేళ్ల కాలపరిమితికి గండికొట్టే నిబంధన. అలా కాకూడదంటే.. వర్క్ పర్మిట్‌ను ఇచ్చే ఆ యాజమాన్యం కచ్చితంగా మూడేళ్లపాటు సదరు ఉద్యోగి థర్డ్ పార్టీ సైట్‌లో పనిచేస్తాడు అని నిరూపించే పత్రాలు ఇవ్వాలి.

భారతీయ కంపెనీలకు ఇబ్బంది

వీసా అనుమతి జారీ ప్రక్రియ సాధారణంగా ఏప్రిల్ 2న మొదలవుతుంది. 2019కి సంబంధించిన అనుమతుల ప్రక్రియను అక్టోబరు 1 నుంచి చేపడతారు. ఈ తాజా రూల్ వల్ల టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో లాంటి భారతీయ కంపెనీలు ఇబ్బందిపడతాయి. ఇన్ని తలనొప్పులు, పత్రాలు సమర్పించడానికి ముందూ వెనకా ఆలోచించి- థర్డ్‌పార్టీ సైట్స్‌కు పంపే వారి సంఖ్యను నియంత్రించుకొనే అవకాశం ఉంది.



రాజు స్వామి భార్య విగ్రహం

భార్యకు గుడి కట్టిన రా'రాజు'

అడుగడుగునా దేవుడి గుళ్లున్న మన దేశంలో.. సినిమా నటులు, రాజకీయ నేతలు, పలువురు ప్రముఖులకు అక్కడక్కడా ఆలయాలు నిర్మించిన ఘటనలున్నాయి. కర్ణాటక రాష్ట్రం చామరాజనగర్ జిల్లాకు చెందిన ఓ రైతు.. మరణించిన తన భార్యకు గుడికట్టి, 12 ఏళ్లుగా నిత్య పూజలు చేస్తుండడం విశేషం. యల్లందూరు తాలూకా కృష్ణాపురకు చెందిన రాజుస్వామి అలియాస్ రాజు తల్లిదండ్రులను ఎదిరించి స్వయానా తన అక్క కుమార్తె రాజమ్మను పెళ్లి చేసుకున్నాడు. వారిద్దరూ అన్యోన్యంగా జీవించేవారు. గ్రామంలో దేవుడి గుడి నిర్మించాలని ఆమె తరచూ భర్తను కోరేది. ఇందుకు రాజు సిద్ధమైన తరుణంలో.. రాజమ్మ మృతిచెందింది. ఈ నేపథ్యంలో గ్రామస్థులు వ్యతిరేకించినా.. భార్య కోరిక మేరకు 2006లో కృష్ణాపురంలో సొంత ఖర్చులతోనే.. గుడి కట్టి ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. - బెంగళూరు

నేటి సినిమాలో శృంగారం తక్కువ.. అంగారం ఎక్కువ

▸ హింస, అశ్లీలత, బూతు... ఇదేనా భావితరాలకు అందించేది?

▸ 'బి.నాగిరెడ్డి' స్మారక తపాలాబిళ్ల ఆవిష్కరణలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



బి.నాగిరెడ్డి స్మారక తపాలా బిళ్లను ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, గవర్నర్ భన్వరీలాల్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హింస, అశ్లీలత, బూతును విడిచిపెట్టి భారతీయతను, మన సంప్రదాయాలను భావితరాలకు అందించేలా మంచి సందేశాత్మక సినిమాలు తీయాలని సినీ దర్శక, నిర్మాతలకు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. దివంగత తెలుగు సినీ దిగ్గజం, విజయా వాహినీ స్టూడియోస్ అధినేత, విజయ హెల్త్ సెంటర్ స్థాపకులు బొమ్మిరెడ్డి నాగిరెడ్డి సేవలకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన తపాలా బిళ్లను ఆయన గురువారం చెన్నైలో ఆవిష్కరించారు. నాగిరెడ్డి వర్ధంతి (ఫిబ్రవరి 25) పురస్కరించుకుని విజయా హెల్త్ సెంటర్, ఎడ్యుకేషనల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, నాగిరెడ్డి తనయుడు బి.వెంకట్రామరెడ్డి, సీఈఓ భారతిరెడ్డిల నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్, తమిళనాడు ఉన్నతవిద్యాశాఖ మంత్రి కేపీ అన్బళగన్ గౌరవ అతిథులుగా, సీనియర్ తమిళ నిర్మాత ఏవీఎం శరవణన్, తపాలాశాఖ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఎం.సంపత్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా 'నాగిరెడ్డి - ద లెజండ్' అనే పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ.. "నాగిరెడ్డి సినీ నిర్మాత, విజన్ ఉన్న వ్యక్తి మాత్రమే కాదు ఆయన గొప్ప మానవతావాది. ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన నాగిరెడ్డి దిగ్గజ స్థాయికి ఎదిగారు. ఆ రోజుల్లోనే పేదలకు సేవ చేయాలని ఆసుపత్రి ప్రారంభించడం చాలా గొప్ప విషయం. ఆయన సినిమాల్లో గొప్ప సందేశం ఉంటుంది. ఆమోదయోగ్యమైన సన్నివేశాలతో శృంగారాన్ని ప్రేక్షకుల మనసులో కల్పించేవారు. కానీ, ఇప్పుడు సినిమాల్లో శృంగారం తక్కువ, అంగారం ఎక్కువ. ఇది దురదృష్టకరం. హింస, అశ్లీలం, బూతు.. ఇదేనా భావితరాలకు మనం అందించేది" అని ప్రశ్నించారు. అలాగే దేశంలో ఏ ప్రాంతంలో నివసించినా ప్రజలు తమ మాతృభాషల్లో చదువుకునేందుకు ఆయా రాష్ట్రాలు వీలు కల్పించాలని, అప్పుడే జాతిసామరస్యం వెల్లివిరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 'మహానటి' సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, సీనియర్ నటుడు, రచయిత రావికొండలరావు, విజయా ఆసుపత్రి పూర్వ జనరల్ మేనేజర్ రాంబాబు, సీనియర్ తమిళ సినీ దర్శకుడు ఎస్పీ ముత్తురామన్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

మే తర్వాత విదేశీ వైద్య విద్యకు 'నీట్' అర్హత తప్పనిసరి: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఈ ఏడాది మే తర్వాత విదేశాల్లోని యూనివర్సిటీల నుంచి వైద్య కోర్సులు చేసే భారతీయ అభ్యర్థులు తప్పనిసరిగా నీట్‌లో అర్హత పొందాల్సి ఉంటుంది. నీట్‌కు సంబంధించి కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఈ వివరణ ఇచ్చింది. విదేశాల్లోని విశ్వవిద్యాలయాలలో వైద్య కోర్సులు చేసే భారత విద్యార్థులు సైతం తప్పనిసరిగా నీట్ అర్హత పొందాల్సి ఉంటుందని ఆరోగ్య శాఖ ఇటీవల ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ నిర్ణయం ఈ ఏడాది మే తర్వాత నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

స్వచ్ఛభారత్ మస్కట్ 106 ఏళ్ల వృద్ధురాలి మృతి

రాయ్‌పూర్, ఫిబ్రవరి 23 : స్వచ్ఛభారత్ అభియాన్‌కు మస్కట్‌గా ఎంపికైన 106 ఏళ్ల కున్వర్‌బాయ్ శుక్రవారం మరణించింది. చండీఘడ్‌కు చెందిన ఆమె డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ మెమోరియల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిందని వైద్యులు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. మేకలు అమ్మి ఇంట్లో మరుగుదొడ్డి కట్టించి ఆమె 2016లో దేశవ్యాప్తంగా పేరు సంపాదించింది. ప్రధానమంత్రి మోదీ నుంచి కూడా కున్వర్‌బాయ్ సన్మానం అందుకుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

మోదీకి టాటా చెప్పిన ప్రియాంకా చోప్రా


ప్రియాంకా చోప్రా

ప్రియాంకా చోప్రా మోదీకి టాటా గుడ్‌బాయ్ చెప్పేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)ని సుమారు పదకొండు వేల కోట్ల రూపాయల మేరకు మోసగించి పరారయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన సంస్థ నీరవ్ మోదీ వజ్రాలకు ప్రచారకర్త బాధ్యతల నుంచి ప్రియాంకా చోప్రా తప్పుకున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఏక్వాంటికో టీవీ సిరీస్ చిత్రీకరణలో బిజీగా ఉన్న ప్రియాంక, నీరవ్ మోదీపై ఆరోపణలు వచ్చిన వెంటనే జాగ్రత్త పడ్డారు. ప్రచారకర్తగా తనకు చెల్లిస్తాన్న మొత్తాన్ని చెల్లించకుండా మోసం చేసిన సంగతిని బయట పెట్టారు. తాజాగా నీరవ్ మోదీ సంస్థతో బంధాన్ని తెంచుకుంటున్నట్లు తెలిపారు. ప్రియాంకా చోప్రాను మాత్రమే కాదు... మరో హిందీ నటి బిపాసా బసును కూడా మోదీ కుటుంబ సభ్యులు మోసగించారు. నీరవ్ మోదీ మామా మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్‌కి బిపాస ప్రచారకర్తగా ఉండేవారు. అయితే... కాంట్రాక్టు గడువు ముగిసిన తర్వాత కూడా బిపాస ఫొటోను గీతాంజలి జెమ్స్ వాడింది.

మరిన్ని సినిమా వార్తల కోసం www.andhrajyothy.com చూడండి

ఈ హోదా కొత్తగా ఉంది



- మాధురీదీక్షిత్

"దాదాపు మూడు దశాబ్దాల పాటు సినిమా రంగంలో ఉన్నాను. ఇప్పుడు తొలి సారి నిర్మాతగా మారడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత హోదాలో ఉన్నందుకు గర్వంగా భావిస్తున్నా" అని అన్నారు మాధురీదీక్షిత్. ఆమె ప్రస్తుతం 'ఫిఫ్టీన్త్ ఆగస్ట్' అనే మరాఠీ చిత్రాన్ని నిర్మిసున్నారు. ఈ చిత్రం కోసం 'వెంటిలేటర్' చిత్రంలో నటించిన రాహుల్‌ని హీరోగా ఎంపిక చేసుకున్నారు. మాధురీ దీక్షిత్ మాట్లాడుతూ "దాదాపు 30 ఏళ్ల సినిమా పరిశ్రమలో ఉన్నాను. తొలి సారి 'ఫిఫ్టీన్త్ ఆగస్ట్' సినిమాను నిర్మిస్తున్నాను. ఇందులో మృణ్మయీ నాయికగా నటిస్తోంది. మృణ్మయి, రాహుల్ ఇద్దరూ చాలా మంచి నటులు. ప్రేక్షకులు వారిద్దరి నటనను ఎప్పుడెప్పుడు చూస్తారా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను" అని అన్నారు. ఇటీవలే ఆమె మరాఠీలో 'బక్కెట్ లిస్ట్' అనే చిత్రంలో కీలక పాత్ర పోషించారు. తన మాతృభాష మరాఠీలో మాధురి నటించిన తొలి చిత్రమిది.

అది చాలా ఇష్టం

- సోనమ్ కపూర్



బాలీవుడ్‌లో సోనమ్ కపూర్ ఏం చేసినా స్పెషలే. ఎలాంటి విషయాన్నైనా నిర్భయంగా, నిజాయతీగా చెబుతుందనే పేరు తెచ్చుకున్నారు సోనమ్. నిత్యం ఏదో ఒక అంశంతో వార్తల్లో ఉండటం సోనమ్‌కి అలవాటే. తాజాగా ఆమె చీర గురించి స్పందించింది. చీరకట్టుకున్న ఫొటోను సామాజిక మాధ్యమంలో అభిమానులతో పంచుకుంది. "నేను వెస్టర్న్ వేర్‌ను ఎంత బాగా ఇష్టపడతానో, చీరను కూడా అలాగే కట్టుకోవాలని అనుకుంటాను. చీర కట్టుకన్నా, బ్లౌజ్‌ల డిజైన్‌ల మీద ఆసక్తి చూపిస్తాను. చాలా సందర్భాల్లో బ్లౌజ్‌ని బట్టి చీరకు అందం రెట్టింపవుతుంది" అని అన్నారు సోనమ్.

మూడు నెలలు వెనక్కి

'పద్మావత్' సక్సెస్‌తో మాంచి జోరు మీద ఉంది దీపికా పడుకొనె. అదే హుషారతో విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ సినిమాకు సైన్ చేసింది. ఇర్ఫాన్‌ఖాన్ ఇందులో కథానాయకుడు. వచ్చే నెలలో నేపాల్‌లో షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ దీపికాకు బ్యాక్ పెయిన్, ఇర్ఫాన్ జాండీస్‌తో బాధపడుతుండటం వల్ల షూటింగ్ మూడు, నాలుగు నెలలు వెనక్కి వెళ్లింది. ఈ విషయాన్ని దర్శకుడు విశాల్ భరద్వాజ్ తన ఫేస్‌బుక్ పేజీలో రాసుకొచ్చారు. "నా హీరోహీరోయిన్లకు ఆరోగ్యం బాగోలేకపోవడం వల్ల షూటింగ్ నిలిపివేశా. వారు కుదుటపడ్డాకే షూటింగ్ మొదలుపెడతా. అందరూ అనుకుంటున్నట్లు అండర్ వరల్డ్ డాన్ సప్నా దీదీ జీవితకు సంబంధించిన కథ కాదిది. ఆమె కథ చిన్న రిఫరెన్స్ మాత్రమే" అని విశాల్ భరద్వాజ్ తెలిపారు.



విశాల్ భరద్వాజ్ , దీపికా పదుకొనె

దానికి... మేమేం చేయగలం?

- కాజల్



"ఈ ప్రపంచంలో ఎవరూ ఇంకొకరిని మార్చలేరు. పుట్టుకతో వచ్చిన బుద్ధులను ఎవరూ సరిదిద్దలేరు. ఎవరికి వాళ్లు స్వతహాగా మార్చాల్సిందే" అని అంటున్నారు కాజల్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'అ!' ఇటీవల విడుదలైంది. కాజల్ మాట్లాడుతూ "సామాజిక మాధ్యమాల్లో ఎవరికి వాళ్లు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతుంటారు. దీనికి ఏ నటుడూ, నటీ బాధ్యులు కారు. ఎవరి సంస్కారం వాళ్లది. తమ అభిమానుల మనస్సుల్లోకి దూరి సంస్కారం నేర్పించే పనుల్లో నటీనటులు ఉండరు. మంచీచెడు చెప్పడం వరకే మా పని. వినడం, వినకపోవడం అవతలివారి పని. ఫలానా వారి అభిమానులు ఇలా అంట కదా... అని ఎవరైనా మాట్లాడినా మేం చేయగలిగింద ఏమీ ఉండదు.. వినీవిననట్టు ఊరకుండటం తప్ప.." అని చెప్పారు.



సరదాగా స్నాక్స్

స్నాక్స్ అంటే నచ్చని వాళ్లని ఒక్కరంటే ఒక్కరిని చూపించండి... చూద్దాం! వేడి వేడిగా లాగించే స్నాక్స్‌ను వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దా అందరూ బోల్డెంత ఎంజాయ్ చేస్తారు. అలాంటి వాటిలో వెరైటీ వెజ్ స్నాక్స్ తయారీ వివరాలు ఇవి. మరింకెందుకాలస్యం... చదవగానే తయారు చేయండి. తింటూ ఎంజాయ్ చేయండి!!

నమ్‌కీన్ సేమ్యా

కావలసినవి: వెర్మిసెల్లి/సేమ్యా- రెండున్నర కప్పులు (చిటికెడు ఉప్పు, కొంచెం నూనె వేసి సేమ్యాను నీళ్లల్లో ఉడకబెట్టాలి), ఉల్లిపాయ - ఒకటి (పెద్దది, సన్నగా తరిగి), ఉడికించిన బంగాళాదుంప- ఒకటి (సన్నగా తరిగి), కరివేపాకు- గుప్పెడు, వేగించిన పల్లీలు- అరకప్పు, నల్ల ఆవాలు- ఒక టీస్పూను, వెల్లుల్లి పాయలు-2 (సన్నగా తరిగి), అల్లం ముక్కలు- ఒక టీస్పూను (సన్నగా తరిగి), ఉప్పు-తగినంత, నూనె- ఒక టీస్పూను.

తయారీ:

- కడాయిలో నూనె వేసి వేడెక్కాక అందులో ఆవాలు, కరివేపాకు వేయాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు అల్లం, వెల్లుల్లి తరుగు వేసి కాసేపు వేగించాలి.
- ఉల్లి తరుగుని కూడా వేసి బంగారు రంగులోకి వచ్చేవరకూ వేగించాలి.
- తర్వాత బంగాళాదుంపముక్కలు, ఉప్పు వేసి కలపాలి. బంగాళాదుంప ముక్కలు రంగు మారాక వేగించిన పల్లీలు వేయాలి.
- చివరిగా ఉడికించిన సేమ్యాను వేసి కలిపితే నమ్‌కీన్ సేమ్యా రెడీ. వేడి వేడిగా సాస్‌తో కలిపి తింటే టేస్టీగా ఉంటుంది.

మొలకలతో కార్న్ చాట్

కావలసినవి: పలు గింజల మొలకలు (ఉడకబెట్టి)- పదిహేను గ్రాములు, మొక్కజొన్న గింజలు (ఉడకబెట్టి)- పదిహేనుగ్రాములు, టొమాటో-1 (సన్నగా తరిగి), ఉల్లిపాయ-1 (సన్నగా తరిగి), కొత్తిమీర చట్నీ- ఒక టేబుల్‌స్పూను, జీలకర్రపొడి, కారం - ఒక్కోటి అర టీస్పూను చొప్పున, ఉప్పు-తగినంత, కొత్తిమీర తరుగు - కొద్దిగా.

తయారీ:

- మొలకలను రాత్రంతా నీళ్లల్లో నానబెట్టాలి. మర్నాడు ఉదయం కుక్కర్‌లో పావుగంట ఉడికించాలి. తర్వాత నీటిని వడగట్టాలి.
- ఒక గిన్నెలో ఉడికించిన మొలకలు, మొక్కజొన్న గింజలతోపాటు అన్ని పదార్థాలనూ వేసి కలపాలి. ఈ చాట్ ఎంత టేస్టీగా ఉంటుందో తిని తెలుసుకోవాల్సిందే మరి!



బటాటా వడ

కావలసినవి: ఆలు-అరకేజి, వేగించడానికి తగినంత నూనె.

తాలింపు: ఆవాలు- ఐదు గ్రాములు, కరివేపాకు, కొత్తిమీర - కొద్దిగా, పసుపు- ఐదు గ్రాములు, కారం- మూడు గ్రాములు, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి - ఒక్కోటి పది గ్రాముల చొప్పున, నిమ్మ కాయ- ఒకటి, ఉప్పు-తగినంత.

పిండి కోసం: శెనగపిండి-200 గ్రాములు, నీరు- సరిపడా, కారం, పసుపు - ఒక్కోటి ఐదు గ్రాములు చొప్పున, జీలకర్ర (దంచి)- మూడు గ్రాములు, ఉప్పు- తగినంత, వంటసోడా- కొద్దిగా.

తయారీ:

- ఆలు ఉడికించి పొట్టు తీసి తరువాత మెత్తగా చేతితో నలపాలి.
- పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి, కొత్తిమీరలను మెత్తగా గ్రైండ్ చేయాలి.
- వీటన్నింటినీ కలిపి చిక్కటి పిండిలా చేయాలి.
- కడాయిలో నూనె వేడి చేసి ఆవాలు వేయాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు కరివేపాకు కూడా వేయాలి.
- సిద్ధం చేసుకున్న బంగాళాదుంప మిశ్రమంలో తాలింపు వేయాలి.
- బంగాళాదుంప మిశ్రమాన్ని నిమ్మకాయ సైజు ఉండలు చేయాలి.
- ఆ ఉండల్ని పిండిలో ముంచి నూనెలో బంగారు రంగు వచ్చేదాకా వేగించాలి.
- కరకరలాడే ఈ వడలను చెట్నీతో వేడి వేడిగా తింటే ఎంతో బాగుంటాయి.



మిక్స్‌డ్ మిల్లెట్ భేల్‌పురి

కావలసినవి: తృణధాన్యాల ఫ్లేక్స్ మిశ్రమం, రాగి ఫ్లేక్స్ - ఒక్కో కప్పు చొప్పున, మరమరాలు-మూడు కప్పులు, వేగించిన పల్లీలు- అర కప్పు, కొయ్యతోటకూర, బ్రౌన్ రైస్- ఒక్కోటి అర కప్పు చొప్పున, పచ్చిమిర్చి తరుగు, చాట్ మసాలా- ఒక్కోటి రెండు టేబుల్‌స్పూన్‌ల చొప్పున, నల్ల నువ్వులు- మూడు టేబుల్ స్పూన్లు, ఉడికించిన ఆలు- నాలుగు (చిన్న ముక్కలుగా తరిగి), ఉల్లిపాయలు- రెండు (సన్నగా తరిగి), టొమాటోలు- రెండు, నిమ్మరసం- నాలుగు టేబుల్‌స్పూన్లు, గ్రీన్ చట్నీ- మూడు టేబుల్‌స్పూన్లు, కొత్తిమీర- గుప్పెడు, మునగాకు పొడి- మూడు టేబుల్‌స్పూన్లు.



తయారీ:

- ఒక గిన్నెలో తృణధాన్యాల మిశ్రమం, రాగుల ఫ్లేక్స్, మరమరాలు, వేగించిన పల్లీలను కలపాలి. వీటితో పాటు కొయ్యతోటకూర, బ్రౌన్ రైస్‌లను కూడా వేయాలి. చాట్‌మసాలా, నల్ల నువ్వులను పైన చల్లాలి.
- ఈ మిశ్రమంలో ఆలు, టొమాటో, ఉల్లిపాయ, పచ్చిమిర్చిల తరుగు, నిమ్మరసం వేసి కలిపి కాసేపు నానబెట్టాలి.
- తర్వాత మునగాకుపొడి, గ్రీన్ చట్నీ వేసి కలపాలి. దీని మీద కొత్తిమీర తరుగు చల్లి తింటే ఎంతో యమ్మీగా ఉంటుంది.

బేసిల్, బటర్ బ్రెడ్

కావలసినవి: బ్రెడ్ ప్యాకెట్- ఒకటి, పెద్ద వెల్లుల్లి రెబ్బలు- ఏడు, వెన్న (సాల్టెడ్)- ఒకటిన్నర టేబుల్‌స్పూను, తులసి ఆకులు- అరకప్పు, ఆలివ్ నూనె- అర టీస్పూను, ఉప్పు-చిటికెడు, ప్రాసెస్డ్ జున్ను (తురుము)- రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీ:

- వెల్లుల్లి రెబ్బల్ని పేస్టులా చేయాలి.
- తులసి ఆకుల్ని కడిగి చిటికెడు ఉప్పు వేసి మెత్తగా చేసి వెల్లుల్లి పేస్టులో కలపాలి.
- ఈ మిశ్రమంలో అర టీస్పూను ఆలివ్ నూనె వేసి మెత్తటి గుజ్జులా చేయాలి.
- చిన్న గిన్నె తీసుకుని అందులో కరగబెట్టిన వెన్న, తులసి, వెల్లుల్లి మిశ్రమాలు వేసి కలిపితే బేసిల్ బటర్ రెడీ.
- బ్రెడ్‌ను చదరపు ఆకారంలో ఒకే పరిమాణంలో ముక్కలుగా కట్ చేయాలి.
- తర్వాత బ్రెడ్ ముక్కలపై బేసిల్ బటర్ పూయాలి. సన్నగా తురిమిన జున్నును పైన వేయాలి.
- బ్రెడ్, చీజ్ రెండూ బంగారు రంగులోకి వచ్చేవరకూ ఒవెన్‌లో 200 సెంటిగ్రేడు వేడిపై పావుగంట బ్రెడ్ ముక్కలను ఉంచాలి.
- ఇలా తయారైన బేసిల్ బటర్ బ్రెడ్‌ను పాస్తాతో కలిపి తినొచ్చు. లేదా బేసిల్ బటర్ బ్రెడ్‌నే స్నాక్‌గా తీసుకోవచ్చు.



కార్న్‌ఫ్లేక్స్ క్రంబ్డ్ పనీర్

కావలసినవి: కార్న్‌ఫ్లేక్స్- 50 గ్రాములు (పొడి), సన్నని పనీర్ తరుగు - వంద గ్రాములు, మైదా-ముప్పై గ్రాములు, గుడ్డు- ఒకటి (ఇష్టపడితే), మారినేషన్‌కు: కారం-ఐదు గ్రాములు, అల్లంవెల్లుల్లి పేస్టు-పది గ్రాములు, గరంమసాలా పొడి- నాలుగు గ్రాములు, ఉప్పు-తగినంత, నల్ల మిరియాలపొడి- రెండు గ్రాములు, కొత్తిమీర తరుగు- పది గ్రాములు.

తయారీ:

- కారం, అల్లంవెల్లుల్లిపేస్టు, గరంమసాలా, ఉప్పు, నల్లమిరియాల పొడిలో పనీరును కలిపి పది నిమిషాలు నానబెట్టాలి.
- నీళ్లు లేదా గుడ్డు సొనలో మైదా వేసి చిక్కటి పిండిలా చేయాలి.
- ఈ పిండిలో నానబెట్టిన పనీరు ముక్కలు ముంచి కార్న్‌ఫ్లేక్స్ పొడిని అద్దాలి.
- కడాయిలో నూనె పోసి బాగా వేడెక్కాక పిండిలో ముంచిన పనీర్ ముక్కలను నూనెలో వేసి కరకరలాడేలా వేగించాలి.
- వేడిగా ఉన్న కార్న్‌ఫ్లేక్స్ క్రంబుల్డ్ పనీర్‌ని కెచప్ లేదా టొమాటో చట్నీతో తింటే ఎంతో రుచిగా ఉంటుంది.



ఆహారం-ఆరోగ్యం

జామతో లాభాలెన్నో...

ఈ మధ్య కాలంలో రకరకాల జామపళ్లు వస్తున్నాయి. గులాబీ రంగు జామపళ్ళు, కిలో బరువుండే పెద్ద జామకాయలు మొదలైనవి. వాటిలో ఏ జామకాయలు మంచివి ? ఎప్పుడు తింటే మంచిది ?

- మొట్టమొదటిగా జీర్ణకోశాన్ని శుభ్రంగా ఉంచుతుంది. జామకాయలో ఉన్న ప్రత్యేకమైన పీచు పదార్థం, పెద్ద పేగులోని మలినాలను త్వరగా బయటకి పంపిస్తుంది. దీనివల్ల మలబద్ధకం ఉండదు. విషపదార్థాలు ఏర్పడవు. పెద్ద పేగు శ్లేష్మాన్ని (మ్యూకోసల్ లైనింగ్) రక్షించి క్యాన్సర్ వంటి రోగాలను దూరంగా ఉంచుతుంది.
- 12 వారాలు జామకాయలు తినడం వల్ల బీపీ 8 శాతం తగ్గుతుంది. 9 శాతం కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ట్రైగ్లిసరైడ్స్ 8 శాతం తగ్గుతుంది. అలాగే గుడ్ కొలెస్ట్రాల్ 8 శాతం పెరుగుతుందని పరిశోధనల ద్వారా తేల్చి చెప్పారు.
- జామకాయల్లో విటమిన్-సి అత్యధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధకశక్తిని పెంచుతుంది. విటమిన్-సి జీవక్రియ (మెటబాలిజం)లో, హిమోగ్లోబిన్ పెంచడంలో ఉపయోగపడుతుంది. ఒత్తిడి వల్ల జరిగే అనర్థాల నుంచి రక్షిస్తుంది.
- గులాబీ రంగు ఉన్న జామకాయాల్లో 'లికోపెన్' అనే కెరొటినాయిడ్ ఉంటుంది. మగవారిలో ప్రోస్టేట్ గ్రంధికి సంబంధించిన సమస్యలు తలెత్తకుండా చేస్తుంది. ఆడవారిలో గర్భసంచి వ్యాధులకు సంబంధించిన హెచ్‌పీవీ వైరస్‌ని చంపుతుంది. 'లికోపెన్' రక్తనాళాలను శుభ్రంగా ఉంచుతుంది. దీనివల్ల ప్రతి అవయవానికి రక్త సరఫరా బాగా జరుగుతుంది. అన్ని అవయవాలకు పోషకాలు అందడం వల్ల అవి సరిగా పనిచేస్తాయి.



- విటమిన్ ఎ,బి,సి, పొటాషియం, ప్రత్యేకమైన పీచు పదార్థం, 'లికోపెన్' ఇవన్నీ కలిపి జామకాయను సూపర్ ఫ్రూట్‌ని చేసాయి.

ఐబిఎస్ (ఇరిటేబుల్ బొవెల్ సింద్రోమ్) ఉన్నవారు తప్పించి, జామకాయలు అందరూ తినవచ్చు. అంటే మధుమేహం ఉన్నవారు కూడా భయం లేకుండా తినవచ్చు.

జామకాయ, చిన్న టొమాటో, వెల్లులి రెబ్బ (సన్నగా తరిగింది)లను ఒక్కోటి చొప్పున తీసుకోవాలి, కొద్దిగా కొత్తిమీర, తగినంత చాట్ మసాలా ఇవన్నీ కలిపి భోజనంతో పాటు వెరైటీ డిష్‌గా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.



డాక్టర్ జానకి
న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

నాన్న రియల్ నాయకన్!

ఆత్మీయం

విలక్షణ నటుడు కమల్‌హాసన్ 'మక్కళ్ నీది మయ్యమ్' పార్టీని ప్రారంభించడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ పెద్దకూతురు, సినీ నటి శృతిహాసన్ తండ్రికి బెస్టాఫ్‌లక్ చెప్పింది. తనకు మాత్రమే తెలిసిన తండ్రి వ్యక్తిత్వాన్ని ఆమె ఆవిష్కరించింది.

రాజకీయాల్లోకి రావాలనుకోవటం నాన్న తీసుకున్న నిర్ణయం. తనకు మంచిదనిపించిందే చేస్తారు. తను నమ్మినదాన్ని త్రికరణశుద్ధిగా ఆచరిస్తారు. అలాంటి తండ్రికి కూతురుగా పుట్టినందుకు ఎప్పుడూ గర్వపడతా. నాన్నకు ఎప్పుడూ నా మద్దతు ఉంటుంది.

- ప్రజలు నాన్న మీద చూపించే అభిమానం చూస్తుంటే హృదయం చెమ్మగిల్లుతుంది. నాన్నలో ప్రజలకు మంచి చేయాలనే తపనుంది. ప్రజలకు మేలు చేయాలనే తాపత్రయాన్ని ఆయనలో చాలాసార్లు గమనించాను. ఆ విషయంలో నాన్న చిత్తశుద్ధిని తరచూ ప్రశంసిస్తుంటాను కూడా.
- నాన్న ఏ పని చేసినా ముందు లోతుగా ఆలోచిస్తారు. తరువాతనే రంగంలోకి దిగుతారు. అంతేకాదు తలపెట్టిన పని సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తారు కూడా. ఇది రాజకీయాలకూ వర్తిస్తుంది.
- నాన్నకు సామాజిక స్పృహ ఎక్కువ. అందుకే అభిమాన సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల సమస్యలపై వారి పక్షాన తన వాణిని బలంగా వినిపిస్తున్నారు. అలా ఆయన రాజకీయ భవిష్యత్‌కు బలమైన పునాది పడింది.
- ప్రజల సమస్యలపై ఎవ్వరినైనా ఎదిరించి మాట్లాడగల ధైర్యం నాన్నకు ఉంది. నమ్మినదాని గురించి మాట్లాడే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. అలానే నాన్నకూ ఆ హక్కుంది. అయితే ఎవరికో వ్యతిరేకంగా మాట్లాడటం వల్ల ఆయనకేదో జరుగుతుందనే భయం నాకు లేదు.
- తమ ఆకాంక్షలు పూర్తిగా నెరవేరలేదనే వెలితి ప్రజల్లో ఉంది. దాన్ని తొలగించేందుకే నాన్న పార్టీ పెట్టారు. ఇది దానికి తగిన సమయం కూడా. దేశంలో మహాత్మాగాంధీ కోరుకున్న మార్పు చూడాలంటే దానికోసం ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలి.
- సింపుల్‌గా జీవించటమే ఆయనలోని గొప్పతనం. గొప్ప స్టార్‌డమ్ ఉన్నా చాలా నిరాడంబరంగా ఉంటారు. ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చినా అలానే ఉంటారు. రాజకీయ ప్రస్థానంలో ఆయనకు తోడుగా ఉంటాను. ఇప్పుడే నేను పార్టీ సిద్ధాంతాలు, ఆదర్శాల గురించి మాట్లాడలేను.
- నా మనసుకు నచ్చినట్టు జీవించే క్రమంలో నేను దేనికి భయపడలేదు. నా తల్లి దండ్రుల నుంచే ధైర్యాన్ని పుణికి పుచ్చుకున్నాను. వాళ్లిద్దరూ స్వతంత్రంగానే జీవించారు. నేను కూడా వారిలానే జీవించాలని కోరుకున్నా.
- నేనెప్పుడూ నా మనసు మాటే వింటాను. నమ్మిందే చేశాను. దానివల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చినా నమ్మకం కోల్పోలేదు. .
- నాన్న నాస్తికుడు. కానీ నేను భగవంతుడిని విశ్వసిస్తాను. అలాగని ఆయన అభిప్రాయాలు మా మీద బలవంతంగా రుద్దలేదు.. ఎవ్వరిని గుడ్డిగా అనుసరించ కూడదు, స్వంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి అని చెప్పేవారు. మమ్మల్ని అలానే పెంచారు.








పేపర్ కళ

స్టెప్ 1: ఒరిగామి పేపర్‌ను బొమ్మలో చూపించిన విధంగా ఫోల్డ్ చేయండి.
స్టెప్ 2: పేపర్ వెనక్కి తిప్పి కింద నుంచి పైకి ఫోల్డ్ చేయండి
స్టెప్ 3: 'జెడ్' ఆల్ఫాబెట్ ఆకారంలోకి పేపర్ మారేలా ఫోల్డ్ చేయండి
స్టెప్ 4: బొమ్మల్లో చూపించిన విధంగా నిలువుగా రెండు పక్కలా కూడా ఫోల్డ్ చేయండి
స్టెప్ 5: 'మౌంటేయిన్ ఫోల్డ్' వచ్చేలా పేపర్‌ను మడవండి.
స్టెప్ 6: మరోసారి రెండు పక్కలా నిలువుగా మడవండి
స్టెప్ 7: బొమ్మలో చూపించిన విధంగా కాగితాన్ని ఫోల్డ్ చేసి, అన్‌ఫోల్డ్ చేయండి
స్టెప్ 8: మీరు ఇప్పటివరకూ చేసిన ఫోల్డింగ్స్ కారణంగా కాగితం పై భాగంలో మీకు రెండు దీర్ఘచతురస్రాకారాలు ఏర్పడతాయి. అప్పుడు బొమ్మలో చూపించిన విధంగా కాగితం కింది భాగం వరకూ ఫోల్డ్ చేయండి
స్టెప్ 9: మడతలన్నీ తీసేయండి
స్టెప్ 10: తాబేలు కాళ్లు ఆకారం వచ్చేలా కాగితాన్ని మడవండి
స్టెప్ 11: బొమ్మలో చూపించిన విధంగా ఫోల్డ్ చేయండి
స్టెప్ 12: కాగితాన్ని 180 డిగ్రీలకు తిప్పండి.
స్టెప్ 13: మళ్లీ కాగితాన్ని ఫ్లిప్ చేయండి
స్టెప్ 14: మూడో వంతు కాగితాన్ని లోపలికి మడవాలి
స్టెప్ 15: తాబేలు ముందు కాళ్లు, వెనుక కాళ్లు ఆకారం వచ్చేలా ఫోల్డ్ చేయండి
స్టెప్ 16: కాగితాన్ని మళ్లీ ఫ్లిప్ చేయండి. అంతే తాబేలు రెడీ!



మన జాతీయ గేయం

బంకించంద్ర ఛటర్జీ రాసిన 'వందేమాతరం'ను జాతీయ గేయంగా గుర్తించారు. ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' గ్రంథం నుంచి ఈ గేయాన్ని స్వీకరించారు. తొలుత దీన్ని సంస్కృతంలో రాశారు. అరబిందో ఘోష్ ఆంగ్లంలోకి అనువదించారు. 1896లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మొదటిసారిగా ఆలపించారు.



క్విజ్

1) బ్యాక్టీరియా	ఎ) లెన్నెక్
2) రక్తప్రసరణ	బి) వోల్టా
3) స్టెతస్కోప్	సి) లీవెన్‌హుక్
4) మైక్రోస్కోప్	డి) విలియం హార్వే
5) ఎలక్ట్రిక్ బ్యాటరీ	ఇ) జాన్సన్

జవాబులు: 1- సి, 2- డి, 3- ఎ, 4- ఇ, 5- బి

మంచి పుస్తకం

'వండర్'ఫుల్ బుక్



'మీ ముందు రెండే రెండు ఆప్షన్లు ఉన్నాయి. ఒకటి 'నిజాయతీ', ఇంకోటి 'దయ'. దేన్ని ఎంచుకుంటారు?' మంచివాళ్లయితే నిజంగా 'దయ'నే ఎంచుకుంటారు. ఇది 'వండర్' అనే నవల ఇచ్చే సందేశం. ఆర్.జె. పలాసియో దీన్ని రచించారు. ఆగస్ట్ పుల్‌మ్యాన్ అనే ఓ పిల్లవాడి చుట్టూ ఈ నవల తిరుగుతుంది. జన్యుపరమైన కారణాలతో ఆగస్ట్ ముఖం పుట్టేనాటికి సరిగ్గా ఉండదు. ఈ కారణంతో అతని ముఖానికి చాలా సార్లు సర్జరీ చేయాల్సి వస్తుంది. దాంతో అతడు కాస్త అందవికారంగా తయారవుతాడు. ఈ ఆత్మానూన్యతతోనే స్కూల్ కూడా వెళ్లడు. తల్లి దగ్గరే చదువు నేర్చుకొంటాడు. కానీ ఇలాగే ఇంట్లో ఉండిపోతే ఆగస్ట్ బయట ప్రపంచానికి అలవాటు పడడనే కారణంతో అతణ్ణి స్కూల్‌కి పంపిస్తుంది అతని కుటుంబం. కానీ అతనికి తోటి పిల్లల నుంచి వెక్కిరింతలు ఎక్కువవుతాయి. ఇలాంటి ఇబ్బందులను తట్టుకొని తన కుటుంబం సహకారంతో జీవితాన్ని ఎలా ఆస్వాదించాడన్నదే మిగతా కథ! ఈ పుస్తక రచయిత్రి ఆర్.జె.పలాషియో జీవితంలో జరిగిన ఓ సంఘటనే ఈ నవలకు స్ఫూర్తి. ఒక రోజు రోడ్డు మీద వెళుతున్న ఓ అబ్బాయిని చూసి పలాషియో కూతురు ఏడవడం ప్రారంభించిందట. అతని ముఖం కాస్త విచిత్రంగా ఉండటమే కారణం. అప్పుడే ఈ నవల రాయాలని నిర్ణయించుకున్నారు. గతేడాది ఈ పుస్తకం ఆధారంగా ఇదే పేరుతో ఓ హాలీవుడ్ చిత్రం కూడా వచ్చింది. బాగా సక్సెస్ అయింది కూడా!

ఇది విన్నారా?



బారెంట్స్ సీ!

బారెంట్స్ సముద్రం ఆర్కిటిక్ సముద్రంలో ఒక చిన్న జల భాగం. నార్వే, రష్యా దేశాల తీరప్రాంతంలో ఉంది. దీని పొడవు 1300 కి.మీ. వెడల్పు 1050 కి. మీ. గతంలో దీన్ని 'ముర్మన్ సముద్రం' అని పిలిచేవారు. తరువాత డచ్ నావికుడు 'విలియం బారెంట్స్' పేరు ఈ సముద్రానికి పెట్టారు. ఇక్కడ సముద్ర జలాల్లో అపార మత్స్య సంపద ఉంది. హైడ్రోకార్బన్ నిల్వలు ఎక్కువ.

కిడ్ సైంటిస్ట్

ఎలక్ట్రో మ్యాగ్నెట్!



కావలసిన వస్తువులు

- 3 అంగుళాల పొడవైన ఇనుప మేకు,
- రెండు అడుగుల పొడవైన కరెంట్ వైరు
- టార్చ్‌లైట్‌లో వాడే బ్యాటరీ

ప్రయోగం చేసే విధానం

రెండె వైపులా కొసలు వదిలి కరెంట్ వైరును మేకుకు చుట్టాలి.
కరెంట్ వైరుకు పైన ఉండే ప్లాస్టిక్ తొడుగును కొసల్లో అంగుళం పొడవున తొలగించాలి.
ఈ కొసలను బ్యాటరీ ధన, రుణ ధృవాలకు కలుపుతూ టేపుతో అంటించాలి. ఇప్పుడు ఈ వైరు ద్వారా మేకులోకి విద్యుత్ ప్రవహించి, విద్యుదయస్కాంత శక్తిగా మారుతుంది. కొన్ని పేపర్ క్లిప్‌లు ఉంచితే మేకు వాటిని ఆకర్షిస్తుంది.

దారి కనుక్కోండి



బుద్ధిలేని దొంగలు!

నీతి కథ!



ఒక బ్రాహ్మణుడు ఊరి నుంచి మరో ఊరికి ఒంటరిగా ప్రయాణిస్తున్నాడు. మధ్యదారిలో చీకటి పడింది. ఒంటరితనం దానికి తోడు అతను ప్రయాణించే దారి కూడా నిర్మానుష్యంగా ఉంది. ఎంతో భయం భయంగా అతని అడుగులు పడుతున్నాయి. అతని భయానికి తగ్గట్టే ఒక చోట నలుగురు దొంగలు ఆయనను అటకాయించారు. ఉన్నదంతా ఇచ్చేయమన్నారు.

బ్రాహ్మణుడి దగర రెండు బంగారు నగలూ, కొద్దిగా పైకమూ ఉన్నది. దాన్ని ఇవ్వకపోతే దొంగలు తన ప్రాణాలు కూడా తీయటానికి సిద్ధంగా ఉన్నట్టు కనబడ్డారు. బ్రాహ్మణుడు తన మూట విప్పి నగలూ, డబ్బూ చూపుతూ " దొంగ సొమ్ము దొంగలపాలే అవుతున్నది!, తీసుకోండి" అన్నాడు.

"ఇది దొంగ సొమ్మా?" అని దొంగలు ఆశ్చర్యంగా అడిగారు. "కాదామరి! రెండు మైళ్ల ఎగువన కొందరు దొంగలు పెళ్లి బండ్లను దోచేస్తూ, ఆ మాట ఎవరికీ చెప్పవద్దని నగలు, కొంత రొక్కమూ నా చేతిలో పెట్టారు," అన్నాడు బ్రాహ్మణుడు. ఆ మాట వింటూనే దొంగలు బ్రాహ్మణుడి సొమ్ము తీసుకునే ఆలోచన మానేసి, ఆయన వచ్చిన దిక్కుగా పరిగెత్తిపోయారు. బ్రాహ్మణుడు ముందుకు సాగి త్వరలోనే తన ఊరు చేరుకున్నాడు.

- కాళ్ల గోవిందరావు


SHINE screens
HAPPY BIRTHDAY
NATURAL STAR
NANI
VENKAT BOYANAPALLI
PRESENTS
కృష్ణార్జున యుద్ధం
#KRISHNARJUNAYUDHAM
MERLAPAKA GANDHI
SAHU GARAPATI HARISH PEDDI
HIPHOP TAMIZHA KARTHIK GATTAMNENI SAHI SURESH SATYA.G


HAPPY
BIRTHDAY
TO OUR HERO
NATURAL STAR
NANI
- NIHARIKA ENTERTAINMENT


BHAVYA CREATIONS
HAPPY BIRTHDAY
NANI
-V.ANAND PRASAD
WORKING TITTLE